

'గ్రామాల్లో సంపద పెరగాలి.
పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 121
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బంగ్లాదేశ్‌లో కోటా కట్

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల వివాదానికి ముగింపు పలికే దిశగా ఆ దేశ సుప్రీం కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది.

- వివరాలు 6లో



మధ్యప్రదేశ్‌లోనూ...

ఉజ్జయినిలోని దుకాణదారులు వారి పేర్లు, ఫోన్ నంబర్లను ప్రదర్శించాలని మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది.

- వివరాలు 6లో



అస్తిత్వం తాకట్టు..

మోదీ ప్రభుత్వం త్వరలోనే కూలిపోతుందని పశ్చిమ బెంగాల్ సీఎం మమత వ్యాఖ్యానించారు.

- వివరాలు 6లో

అమెరికా అధ్యక్ష రేసు నుంచి
జో బైడెన్ ఔట్

పోటీ నుంచి వైదొలుగుతున్నానని ప్రకటన



దేశ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని వెల్లడి

డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా కమలా హ్యారిస్‌కు మద్దతు



అమెరికా అధ్యక్షుడిగా ప్రజలకు ఇప్పటిదాకా సేవలందించడం అతిగొప్ప గౌరవంగా భావిస్తున్నా. మరోసారి పోటీ చేయాలన్న ఆలోచన లేదు. అధ్యక్షుడిగా మిగిలిన పదవీకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యతలపై దృష్టి పెడతా. వచ్చే వారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తా. నా నిర్ణయాన్ని పూర్తిగా తెలియజేస్తా. - జో బైడెన్

6లో

ముంచిన డిబేట్

ఇప్పుడేంటి?

న్యూస్‌రీల్

నీట్.. ర్యాంకుల 'షికార్'



నీట్ యూజీ–2024 పరీక్ష ఫలితాలపై వివాదం కొనసాగుతూనే ఉంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తాజాగా పట్టణాలు, పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాలను వెల్లడించింది. అందులో ఓ పరీక్ష కేంద్రంలో ఆశ్చర్యకర ఫలితాలు వెల్లడయ్యాయి.

- వివరాలు 12లో

డిప్లొమా విద్యార్థులకు 10వేల ఇంజనీరింగ్ సీట్లు



పాలిటెక్నిక్, ఫార్మసీ డిప్లొమా పూర్తి చేసిన వారికి నిర్వహించే తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇంజనీరింగ్‌లో 12,785 సీట్లు అందుబాటులో ఉంటే 10,407 సీట్లు భర్తీ చేశారు. ఫార్మసీలో 47 సీట్లే భర్తీ అయ్యాయి.

- వివరాలు 3లో

మన జీవ వైవిధ్యం భేష్



రాష్ట్రంలో జీవ వైవిధ్యత అలరారుతోంది. అటవీ ప్రాంతాల్లో వివిధ రకాల జంతువుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 12 రక్షిత అటవీ ప్రాంతాలు (7 శాంక్చురీలు, 2 టైగర్ రిజర్వ్‌లు, 3 జాతీయ పార్కులు) ఉన్నాయి.

- వివరాలు 3లో

'పంచ్' పతకం తెచ్చేనా!

పారిస్ ఒలింపిక్స్‌లో భారత బాక్సర్లపై భారీ ఆశలు

వివరాలు 14లో

బదిలీలు బద్నామ్!

రాష్ట్ర ఉద్యోగుల సాధారణ బదిలీల్లో తీవ్ర గందరగోళం..

కొత్త జోనల్ విధానం వచ్చాక పూర్తిస్థాయిలో చేపట్టిన తొలి ట్రాన్స్‌ఫర్లు

దాదాపు నెలరోజులుగా కొనసాగుతున్నా కొలిక్కిరాని ప్రక్రియ

సీనియారిటీ జాబితాల రూపకల్పనపై ఆరోపణలు

40శాతానికి మించొద్దనే నిబంధనతో చిక్కు.. సీనియర్లకూ దక్కని బదిలీ చాన్స్

ఆందోళనకు కారణమవుతున్న జీహెచ్ఎంసీ పరిధి నిర్ధారణ..

ఫోకల్ నుంచి నాన్ ఫోకల్‌కు బదిలీ చేయాలన్న నిబంధన గాలికి..

గురుకుల విద్యాసంస్థల్లో ఉద్యోగుల జోన్లు తారుమారు

వైద్యారోగ్య శాఖలో సీనియర్లు నారాజ్.. కీలక అధికారులు మారుమూల ప్రాంతాలకు..



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నూతన జోనల్ విధానం అమల్లోకి వచ్చాక తొలిసారిగా తలపెట్టిన ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ ప్రహసనంగా మారింది. సీనియారిటీ జాబితాల రూపకల్పన మొదలు గరిష్టంగా 40శాతం సిబ్బంది బదిలీ నిబంధన వరకు ఎన్నో సమస్యలు తలెత్తాయి. దీనితో చాలా శాఖల్లో ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రభుత్వం ఈనెలాఖరు వరకు బదిలీల గడువును పొడిగించాల్సి వచ్చింది. నిజానికి ప్రభుత్వ శాఖలు ప్రకటించిన సీనియారిటీ జాబితాలు శాస్త్రీయంగా లేవని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సీనియారిటీ జాబితాల ప్రకటన అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిష్కారం, తుది జాబితాల ప్రకటనకు ప్రభుత్వం పెద్దగా సమయం ఇవ్వలేదని.. దీంతో ఆయా శాఖల్లో బదిలీలు ముందుకు సాగలేదని అంటున్నారు. వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖతోపాటు వ్యవసాయ, ఆర్థిక, రెవెన్యూ, సంక్షేమ శాఖల్లో ట్రాన్స్‌ఫర్లకు ఆటంకాలు ఏర్పడ్డాయని వివరిస్తున్నారు. ఆయా ఉద్యోగుల సందేహాలను, సీనియారిటీ సమస్యలను నివృత్తి చేయలేక శాఖాధిపతులు తల పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది.

తేలని జీవో 317 లొల్లి..

రాష్ట్ర ప్రభుత్వం జీవో 317 అమల్లో భాగంగా చేసిన ఉద్యోగుల కేటాయింపులపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు వచ్చాయి. 32 శాఖల్లోని 53వేల మందికిపైగా ఉద్యోగులు ఆన్‌లైన్ విధానంలో ప్రభుత్వానికి తమ వినతులు సమర్పించారు. జీవో 317 సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఈ సమస్యల వివరాలను

మిగతా 12వ పేజీలో ▶

40% నిబంధనతో చిక్కు..

ప్రస్తుత సాధారణ బదిలీల ప్రక్రియలో భాగంగా నాలుగేళ్లు, ఆపై ఒకేచోట పనిచేస్తున్న అధికారి/ఉద్యోగి తప్పనిసరి బదిలీ కేటగిరీలోకి వస్తారు. అయితే గరిష్టంగా 40 శాతం మందికి మాత్రమే స్థానచలనం కలిగేలా ప్రభుత్వం నిబంధన పెట్టింది. ఉదాహరణకు ఒక జోన్ పరిధిలో వంద మంది ఉద్యోగులు ఉండి, వారిలో 50 మంది నాలుగేళ్లకుపైగా ఒకేచోట ఉన్నారనుకుంటే.. ఈ 50 మందికి బదిలీ అర్హత ఉన్నట్టే. కానీ 40శాతం నిబంధన మేరకు 40 మంది మాత్రమే బదిలీ అయి, మిగతా పది మందికి చాన్స్ దొరకదు. ఇలా చాలా శాఖల్లో తప్పనిసరి జాబితాలోని ఉద్యోగులకు బదిలీ చాన్స్‌రాక తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఇక గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కార్యాలయాలన్నీ ఒకే స్టేషన్ కిందకు వస్తాయంటూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్పష్టత ఇచ్చింది. ఈ నిబంధనను అమలు చేయడంలో ప్రభుత్వ శాఖలు తడబాటుకు గురవడంతో.. కొందరు గ్రామీణ ప్రాంతాల్లోని ఉద్యోగులు తిరిగి గ్రామీణ ప్రాంతాలకే బదిలీ కావాల్సి వచ్చింది.



ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి సమర్పించేందుకు పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రి పొన్నం, ఎంపీ అనిల్ కుమార్, ఎమ్మెల్యే దానం

7లో



బడ్జెట్ 'హల్వా' మెప్పిస్తుందా!

మోదీ 3.0 తొలి బడ్జెట్‌పై ఎన్నో అంచనాలు

- ఆదాయపన్ను తగ్గించాలన్న డిమాండ్లు
- ఈ దిశగా బడ్జెట్‌లో ప్రకటనలకు వీలు
- రేపు లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంతి నిర్మలా సీతారామన్

15లో

నేటి నుంచే బడ్జెట్ సమావేశాలు

వివరాలు 6లో

ఆదివారం సాయంత్రం భద్రాచలంలో మహోగ్రంగా ప్రవహిస్తున్న గోదావరి



పోటెత్తిన గోదావరి

రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో విస్తారంగా వర్షాలు

పరవళ్లు తొక్కుతున్న ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, శబరి, కడెం ఉప నదులు

- గోదావరిలో గంటగంటకూ పెరుగుతున్న ప్రవాహం
- ఎల్లంపల్లికి పెరిగిన వరద.. మేడిగడ్డ బరాజ్‌కు 5.52లక్షల క్యూసెక్కులకుపైగా రాక
- భద్రాచలం వద్ద 43 అడుగులు దాటిన నీటిమట్టం.. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: గోదావరి పోటెత్తుతోంది. క్రమంగా ఉగ్రరూపం దాల్చుతోంది. నదీ పరీవాహక ప్రాంతంలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలతోపాటు రాష్ట్రంలో విస్తారంగా వానలు పడుతుండటంతో.. ప్రాణహిత, ఇంద్రావతి, తాలిపేరు, కిన్నెరసాని, శబరి, కడెం ఉప నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. ఆ నీరంతా చేరుతూ గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ప్రవాహాలు పెరుగుతున్నాయి. కడెం ప్రాజెక్టుకు భారీగా వరద వస్తోంది. గత ఏడాది వరదలతో ప్రాజెక్టు దెబ్బతిన్న నేపథ్యంలో.. ఈసారి ముందు జాగ్రత్తగా ప్రాజెక్టు పూర్తిగా నిండకముందే గేట్లను ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. కడెం నుంచి వస్తున్న ఈ ప్రవాహాలు, ఇతర వాగులు గోదావరికి తోడుకావడంతో

మిగతా 2వ పేజీలో ▶



మరో రెండ్రోజులు వానలే..

2లో

'రెడ్‌బుక్'తో అరాచకం

అదే రాజ్యాంగం అనే రీతిలో ఏపీలో పాలన

అధఃపాతాళానికి దిగజారిన శాంతి భద్రతలు

గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఫిర్యాదు

హోర్డింగులు పెట్టి మరీ ప్రోత్సహిస్తున్న ఓ మంత్రి



గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసేందుకు రాజ్‌భవన్‌కు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

- నెల రోజుల్లోనే 36 హత్యలు.. 300కుపైగా హత్యాయత్నాలు
- యథేచ్ఛగా దాడులు.. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తుల విధ్వంసం
- వైఎస్సార్‌సీపీని అణచివేసే కుట్రతోనే బీభత్సకాండ
- కేంద్రం వెంటనే జోక్యం చేసుకొని దర్యాప్తు జరిపించాలని విజ్ఞప్తి

12లో


డబ్ల్యూహెచ్‌వో చెప్పినా.. పెడచెవిన..

రాష్ట్రంపై డెంగీ పంజా

ఈ ఏడాది ఇప్పటివరకు వెయ్యికి చేరువలో కేసులు.. హైదరాబాద్‌లోనే 327 కేసులు నమోదు

16లో

ఇదండీ సంగతి



అసలు ముందు నువ్ గిట్టితే మా ప్రాణాలు పోయేవి కావు కదా!

వాగులూ... వంకలూ..

మల్లూరు, పాకాల, చలివాగులో పెరుగుతున్న నీటిమట్టం

ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది.. తెలంగాణ-మహారాష్ట్ర మధ్య నడిచే నాటుపడవల నిలిపివేత



ములుగు జిల్లా పేరూరు-చందుపట్ల గ్రామాల మధ్యన రహదారిపై ఉన్న బ్రిడ్జిని ముంచెత్తిన మర్రిమాగు వాగు



నిండుకుండలా మల్లూరు వాగు మధ్యతరహా ప్రాజెక్టు

సాక్షి, నెట్‌వర్క్: విస్తారంగా కురుస్తున్న వర్షాలతో పలు జిల్లాలకు జలకళ సంతరించుకుంది. ములుగు జిల్లాలో గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం వద్ద గోదావరి 14.38 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తూ మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ఉంది. మల్లూరువాగు మధ్యతరహా ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 26 ఫీట్లు కాగా ప్రస్తుతం 19 ఫీట్ల నీటిమట్టం ఉంది. వాజేడు మండలం టేకులగూడెం సమీపంలో 163 నంబరు జాతీయ రహదారిపైకి గోదావరి వరద చేరడంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్యన రాకపోకలు నిలిచిపోయాయి. చీకుపల్లిలోని బొగత జలపాతం ఉగ్ర రూపం దాల్చి ప్రవహిస్తోంది.

- వరంగల్ జిల్లా ఖానాపురం మండలం పాకాల సరస్సు 30.3 ఫీట్లకు 21.9 అడుగులకు నీటిమట్టం చేరింది.
- హనుమకొండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లి శివారు మధ్యతరహా చలివాగు ప్రాజెక్టు సామర్థ్యం 18 ఫీట్లు ఉండగా.. ప్రస్తుతం నీటి మట్టం 15.2ఫీట్లకు చేరి నిండుకుండను తలపిస్తోంది.
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాన జోరు తగ్గడం లేదు. వర్షాలతో పంటలు నీట మునుగుతున్నాయి. పత్తి చేలల్లో ఇసుక మేటలు వేశాయి. ప్రాణహితకు భారీగా వరద పోటెత్తడంతో వేమనపల్లి పుష్కరఘాట్ వద్ద తెలంగాణ-మహారాష్ట్ర మధ్య నడిచే నాటుపడవలను నిలిపివేశారు.

వాగులో ఇద్దరు గల్లంతు

చెట్టు కొమ్మ పట్టుకొని ఒకరు బయటకు.. జాడ తెలియని మరొకరు



వాగు వద్ద అధికారుల గాలింపు చర్యలు

ఉట్నూర్ రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి వాగులు పొంగి ప్రవహిస్తుండటంతో ఒకరు గల్లంతైన సంఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని చోటు చేసుకుంది. బొప్పరికుంట గ్రామానికి చెందిన టేకం రాజు, టేకం లక్ష్మణ్(28) సొంత పనులపై ఉట్నూర్‌కు సాయంత్రం వచ్చారు. పని ముగించుకొని తిరిగి రాత్రి గ్రామానికి కాలినడకన బయలుదేరారు. గంగాపూర్ వద్ద వాగు దాటే క్రమంలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఇద్దరు కొట్టుకుపోయారు. రాజు చెట్టు కొమ్మ పట్టుకొని బయటకు వచ్చాడు. లక్ష్మణ్ వాగులో గల్లంతయ్యాడు. రెస్క్యూ టీం సాయంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గాలింపునకు అంతరాయం కలిగింది.

పెదవాగు ప్రాజెక్టు రీడిజైన్ చేస్తాం

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



పెదవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

అశ్వారావుపేట రూరల్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లి వద్దగల పెదవాగు ప్రాజెక్టును రీడిజైన్ చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన గుమ్మడవల్లి, కొత్తూరు, నారాయణపురంలో పర్యటించి వరద బాధితులు, పంట నష్టపోయిన రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అధిక వర్షాలు, వరద పోటుతో పెదవాగు ప్రాజెక్టుకు పడిన గండ్లను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, పెదవాగు ప్రాజెక్ట్‌కు గండ్లు పడి భారీగా ఆస్తి, పంట నష్టపోవడం బాధాకరమని, ఇందులో ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా తెలుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో పెదవాగు ప్రాజెక్టుకు మరమ్మతులు చేసినా ప్రయోజనం ఉండదని, తిరిగి నిర్మించడమే మంచిదని అన్నారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు, ఏపీ రాష్ట్రంతో సమన్వయం చేసుకుంటూ ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లుగా ప్రాజెక్టు సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచేలా, అదనంగా మరో మూడు గేట్లు ఏర్పాటుచేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వానాకాలం సీజన్ నాటికే ప్రాజెక్టు రీడిజైన్, నిర్మాణ పనులు పూర్తయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రి తుమ్మల వెంట భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

పోటెత్తిన గోదావరి



కడెం గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

▶ మొదటి పేజీ తరువాయి

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 42వేల క్యూసెక్కులకుపైగా వరద వస్తోంది.

మేడిగడ్డ దిగువ నుంచి ఉప్పొంగుతూ..

గోదావరి నదికి ప్రాణహిత తోడవడంతో కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్ నుంచి భారీ వరద కొనసాగుతోంది. గేట్లన్నీ ఎత్తి ఉండటంతో వచ్చిన నీళ్లు వచ్చినట్టు దిగువకు వెళ్లిపోతున్నాయి. ఈ ప్రవాహానికి ఇంద్రావతి వరద కలసి.. తుపాకులగూడెం(సమ్మక్క) బరాజ్‌లోకి 8,23,450 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా.. గేట్లు ఎత్తి అంతే స్థాయిలో నీటికి దిగువకు వదిలేస్తున్నారు. మధ్యలో వాగులు, వంకల ప్రవాహం తోడై.. దుమ్ముగూడెం (సీతమ్మ సాగర్) బరాజ్‌లోకి 9,01,989 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. ఆ తర్వాత తాలిపేరు, పెద్దవాగు, కిన్నెరసాని ప్రవాహాలు కలుస్తూ.. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గంట గంటకూ పెరుగుతోంది.

భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నది పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేశారు. పునరావాస శిబిరాలను సిద్ధం చేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలిస్తున్నారు. రాత్రి 12 గంటలకల్లా నీటిమట్టం 45.1 అడుగులకు చేరింది. ఇది 48 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు.

ఏపీలో శబరి దూకుడు..

ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో భారీ వర్షాలతో ఏపీలోని శబరి ఉప నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కూనవరం వద్ద నీటిమట్టం 36.74 మీటర్లకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

గోదావరి ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం ఇలా..

ప్రాజెక్టు	నిల్వ సామర్థ్యం	ప్రస్తుత నిల్వ	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
జైక్వాడ్	102.73	29.23	391	391
సింగూర్	29.91	13.63	391	0
నిజాంసాగర్	17.8	3.14	0	0
శ్రీరాంసాగర్	90.31	19.85	18,518	503
కడెం	7.6	5.42	8785	14,436
ఎల్లంపల్లి	20.18	7.88	42,314	331
మేడిగడ్డ బరాజ్	16.17	-	5,52,600	5,52,600
సమ్మక్క బరాజ్	6.94	-	8,23,450	8,23,450
సీతమ్మసాగర్	36.57	53.35	9,01,989	9,01,989

(ఆదివారం సాయంత్రం 6 గంటలకు.. నిల్వలు టీఎంసీల్లో, ఇన్‌ఫ్లో/ఔట్‌ఫ్లో క్యూసెక్కుల్లో..)

పోలవరం ప్రాజెక్టులోకి 8,57,707 క్యూసెక్కులు చేరుతుండటంతో స్పిల్ వే ఎగువన నీటిమట్టం 32 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు 48 గేట్లను ఎత్తి.. వచ్చిన నీటిని అంతా దిగువకు వదిలేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ధవళేశ్వరం బరాజ్‌లోకి 7,74,171 క్యూసెక్కులు చేరుతుండగా.. గోదావరి డెల్టాకు 1,800 క్యూసెక్కులను వదులుతూ, మిగతా నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

ఇప్పటికే 149 టీఎంసీలు సముద్రం పాలు..

ప్రస్తుత నీటి సంవత్సరంలో.. అంటే ఈ ఏడాది జూన్ 1 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ధవళేశ్వరం బరాజ్ నుంచి 149.03 టీఎంసీల నీళ్లు సముద్రం పాలయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి ధవళేశ్వరం బరాజ్ నుంచి 77.79 టీఎంసీలు సముద్రంలో కలవడం గమనార్హం. ప్రాణహిత, ఇంద్రావతి, శబరి పరీవాహక ప్రాంతాల్లో ఆదివారం కూడా విస్తారంగా వర్షాలు కురవడంతో గోదావరి వరద ఉధృతి మరింత పెరుగుతుందని అధికారులు చెప్తున్నారు.

మేడిగడ్డ అలా... అన్నారం ఇలా..

మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కురుస్తున్న వానలతో ప్రాణహిత పోటెత్తి మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో వస్తోంది. అక్కడ గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. గోదావరిలో దానికి ఎగువన ఉన్న అన్నారం (సరస్వతి) బరాజ్ పరిస్థితి భిన్నంగా ఉంది. ఇక్కడ ఎగువ నుంచి ప్రధాన నదిలో ఇన్‌ఫ్లో ఏమీ లేకపోగా.. మానేరు, ఇతర వాగుల నుంచి 16,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే వస్తోంది. ఈ నీరంతా కిందికి వదిలేస్తున్నా.. గోదావరి చిన్న పాయలా ప్రవహిస్తోంది.

కాగా, ములుగు జిల్లా ఎస్ఎస్‌తాడ్వాయి మండల పరిధి మేడారంలోని జంపన్నవాగు మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉధృతంగా ప్రవహిస్తోంది.



మేడిగడ్డ బ్యారేజీ వద్ద వరద ఉధృతి



అన్నారం బ్యారేజీ వద్ద గోదావరిలో నీరు లేని దృశ్యం

మరో రెండ్రోజులు వానలే..

సాక్షి, హైదరాబాద్: రానున్న రెండ్రోజులు పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఒడిశాతీరం చిలికా సరస్సు వద్ద కేంద్రీకృతమైన వాయుగుండం బలహీనపడి అల్పపీడనంగా మారింది. రానున్న ఆరు గంటల్లో ఇది మరింత బలహీనపడే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. జైసాల్మయిర్, కోట, గుణ, మాండ్ల, అంతర్గత ఒడిశా దాని సమీపంలోని ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో ఉపరితల ద్రోణి కేంద్రీకృతమై ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ఇది తూర్పు, మధ్య బంగాళాఖాతం ప్రాంతం వరకు కొనసాగుతున్నట్టు వివరించింది. రానున్న రెండు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ వివరించింది. ఆదివారం రాష్ట్రంలో సగటున 3.32 సెంటీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 8.81, జగిత్యాల జిల్లాలో 7.01, నిర్మల్ జిల్లాలో 6.92, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 6.83 సెంటీమీటర్ల వర్షం కురిసింది. నల్లగొండ, గద్వాల జిల్లాలు మినహాయిస్తే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు నమోదయ్యాయి. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 23.39 సెంటీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, ఆదివారం నాటికి 36.43 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సీజన్లో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం కంటే 33శాతం అధికంగా వానలు నమోదయ్యాయి.

ఆదివారం అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు

జిల్లా	ప్రాంతం	వర్షపాతం (సెం.మీ.లలో)
ములుగు	ఏటూరునాగారం	12.05
ములుగు	మల్లంపల్లి	11.73
ములుగు	అలుబాక	10.15
హన్మకొండ	కమలాపూర్	8.83
హన్మకొండ	నాగారం	8.03
ములుగు	వెంకటాపూర్	7.55
ములుగు	మేడారం	7.53
జనగాం	పాలకుర్తి	7.23
హన్మకొండ	శాయంపేట	7.08
కరీంనగర్	బోర్నపల్లి	7.00

దెబ్బతిన్న పార్వతీ బరాజ్ కరకట్ట

మరమ్మతు చేపట్టిన నీటిపారుదల శాఖ అధికారులు



దెబ్బతిన్న పార్వతీ బరాజ్ కరకట్ట

మంథని: పెద్దపల్లి జిల్లా మంథని మండలం సిరిపు రం గ్రామ సమీపంలోని పా ర్వతీ బరాజ్ కరకట్ట కోతకు గురైంది. అప్రమత్తమైన నీటిపారుదల శాఖ అధికా రులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు చేపట్టారు. ఏడాదిన్నర క్రితం బరాజ్ డెలివరీ సిస్టం వైపు ఉన్న కరకట్ట దెబ్బతినగా మట్టి పోశారు. కానీ, భారీ వర్షాలకు మరోసారి కరకట్ట కోతకు గురైంది. అప్పటినుంచి మరమ్మతు చేపట్టలేదు. జాతీయ భద్రత ప్రాధికార సంస్థ ఆదేశాలకనుగుణంగా ప్రస్తుతం బరాజ్ మరమ్మతు కొనసాగుతోంది. ఈ క్రమంలో దిగువ గేట్లవైపు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం 74 గేట్లను ఎత్తడంతో బరాజ్‌లోని నీరు పూర్తిగా ఖాళీ అయింది. పనిలోపనిగా గతంలో దెబ్బతిన్న కరకట్ట మరమ్మతు కూడా చేస్తున్నారు.

కరకట్ట కోతకు గురికాకుండా పకడ్బందీగా పనులు..

నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతోనే కరకట్ట కోతకు గురైనట్లు పలువురు భావించారు. కానీ, బరాజ్‌లోకి పూర్తిస్థాయి నీరు చేరినా...కరకట్ట కోతకు గురికాకుండా పనులు పకడ్బందీగా చేస్తున్నామని డీఈఈ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు. కోతకు గురైన ప్రాంతంలో మట్టి తొలగించి కంకర, సిమెంట్, కాంక్రీట్‌తోపాటు దిగువకు జారకుండా సిమెంట్ బిళ్లలు అమర్చుతామని ఆయన వివరించారు. ఏవైనా అనూహ్య పరిస్థితులేర్పడి కరకట్ట ప్రమాదానికి గురైనా దిగువన 130 మీటర్ల లోతు ఉంటుందని, సమీప గ్రామాలకు వరద చేరే అవకాశం లేదని ఆయన తెలిపారు. కాగా బరాజ్‌లోకి 5,429 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతేమొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నామని ఆయన వివరించారు.

ఉస్మానియాలో కూలిన సీలింగ్



ఓపీ భవనంలో కూలిన సీలింగ్

అఫ్జల్‌గంజ్ (హైదరాబాద్): ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలోని ఓపీ భవనంలో సీలింగ్ కూలిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ఓపీ చీటీల పంపిణీ కేంద్రం పనిచేసింది. సమయం ముగిసిన తర్వాత సిబ్బంది ఓపీ చీటీల పంపిణీ కేంద్రాన్ని మూసివేసి వెళ్లారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ఇక్కడి సీలింగ్ ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న అధికారులు వెంటనే అప్రమత్తమై అటువైపు ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరవళ్లు

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 96,369 క్యూసెక్కుల నీరు రావడంతో నీటినిల్వ 822.5 అడుగుల్లో 42.73 టీఎంసీలకు చేరుకుంది. నాగార్జునసాగర్‌లోకి ఎలాంటి వరద చేరకపోగా.. పులిచింతల ప్రాజెక్టులోకి కేవలం 640 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. కాగా పులిచింతలకు దిగువన నదిపరీవాహక ప్రాంతం (బేసిన్)లో విస్తారంగా కురిసిన వర్షాలకు కట్టలేరు, మున్నేరు పరవళ్లు తొక్కగా, ఏపీలోని ప్రకాశం బ్యారేజీలోకి 13,634 క్యూసెక్కుల నీరు చేరింది. ఇందులో కృష్ణా డెల్టాకు 1,309 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తూ మిగులుగా ఉన్న 12,325 క్యూసెక్కులను 17 గేట్లు ఒక అడుగు మేర ఎత్తి సముద్రంలోకి అధికారులు వదిలేస్తున్నారు. పశ్చిమ కనుమల్లో కురుస్తున్న వర్షాల ప్రభావం వల్ల కృష్ణా ప్రధానపాయలో ఎగువన వరద ప్రవాహం కొంత పెరిగింది. ఆల్మట్టిలోకి 1.24 లక్షల క్యూసెక్కుల నీరు చేరగా, గేట్లు ఎత్తి 1.50 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలారు. దాని దిగువన నారాయణపూర్ డ్యామ్‌లోకి 1.25 లక్షల క్యూసెక్కుల నీరు చేరగా, గేట్లు ఎత్తి 1,45,750 క్యూసెక్కుల నీటికి వదలడంతో జూరాల ప్రాజెక్టులోకి చేరుతున్న వరద క్రమేపి పెరుగుతోంది. జూరాల ప్రాజెక్టులోకి 1,29,000 లక్షల క్యూసెక్కుల నీరు చేరగా.. విద్యుదుత్పత్తి చేస్తూ, గేట్లు ఎత్తి 1,34,161 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు.

మూడు రోజుల్లో తుంగభద్ర గేట్లు ఎత్తేసే అవకాశం

ఇక కృష్ణా ప్రధాన ఉపనది తుంగభద్రలో వరద ఉధృతి మరింత పెరిగింది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,17,647 క్యూసెక్కుల నీటిరాకతో నీటినిల్వ 78.67 టీఎంసీలకు చేరుకుంది. నిండుకుండను తలపిస్తున్న తుంగభద్ర డ్యామ్‌లో ఆదివారం విద్యుదుత్పత్తిని ప్రారంభించిన అధికారులు.. 4,754 క్యూసెక్కులను దిగువకు వదిలారు. తుంగభద్రలో మరో మూడు రోజులు ఇదే రీతిలో వరద వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో 27 టీఎంసీలు చేరితే తుంగభద్ర డ్యామ్ నిండుతుంది. మూడు రోజుల్లో తుంగభద్ర డ్యామ్ నిండే అవకాశముంది.


సాగర్ నీటిమట్టం 504.30 అడుగులు

నాగార్జునసాగర్/మునగాల: నాగార్జునసాగర్ నీటిమట్టం ప్రస్తుతం 504.30 అడుగులుగా ఉంది. తాగునీటికి అవసరాల కోసం కుడి కాల్వ ద్వారా 5,700 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 3,146 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీ ద్వారా 800 క్యూసెక్కులు ఇలా మొత్తం 9,646 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. సాగర్‌కు ఇన్‌ఫ్లో ఏమాత్రం లేదు.

ఎడమకాల్వ లాకుల వద్ద పహారా: సూర్యాపేట జిల్లా మునగాలలోని సాగర్ ఎడమకాల్వ ప్రధాన లాకుల వద్ద రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పహారా కాస్తున్నారు. తాగునీటి అవసరాల కోసం సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేస్తుండగా, రైతులు ఈ నీటిని పంటల సాగుకు మళ్లించకుండా ఉండేందుకు పహారా ఏర్పాటు చేశారు.

96,369 క్యూసెక్కులకు పెరిగిన వరద

- ఎగువన కృష్ణా ప్రధాన పాయలో పెరిగిన వరద ఉధృతి
- ఆల్మట్టి నుంచి 1.50 లక్షలు, నారాయణపూర్ 1.45 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు
- జూరాల నుంచి 1.19 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల



సాగర్ జలాశయం



జూరాల ప్రాజెక్టు వద్ద 22 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద నీరు

కృష్ణాబేసిన్‌లో ప్రధాన ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం, నీటి నిల్వలు ఇలా

ప్రాజెక్టు పేరు	పూర్తి నీటి నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటి నిల్వ	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	అవుట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	99.68	1,25,000	1,50,000
నారాయణపూర్	37.64	32.78	1,25,000	1,45,750
ఉజ్జయిని	117.24	51.01	7,954	176
జూరాల	9.66	6.81	1,29,000	1,34,161
శ్రీశైలం	215.81	42.73	96,369	0
నాగార్జునసాగర్	312.05	122.97	0	9,646
పులిచింతల	45.77	0.83	640	50
ప్రకాశం బ్యారేజ్	3.07	3.07	13,634	13,634

మూసీకి 1,560 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి: హైదరాబాద్‌తో పాటు, మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మూసీ ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. ఆదివారం ఎగువ నుంచి మూసీకి 1,560 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా 639.90 అడుగులకు చేరిందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్టులో నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.15 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



వరద నీటితో కళకళలాడుతున్న మూసీ రిజర్వాయర్

మన జీవ వైవిధ్యం భేష్



రాష్ట్రంలో వృక్ష, జంతుజాలంతో అలరారుతున్న వైవిధ్యత

ఆయా ప్రాంతాల్లో సందడి చేస్తున్న వన్యప్రాణులు

తాజా అధ్యయనంలో వెల్లడి

పులుల సంచారం పెరిగినా కవ్వాల్‌లో స్థిర నివాసం ఏర్పరచుకోక పోవడంపై ఆందోళన

సాక్షి, హైదరాబాద్: పెరిగిన జంతుజాలం, వృక్ష జాలంతో రాష్ట్రంలో జీవ వైవిధ్యత అలరారుతోంది. అటవీ ప్రాంతాల్లో వివిధ రకాల జంతువుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నట్టుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 12 రక్షిత అటవీ ప్రాంతాలు (7 శాంక్చురీలు, 2 టైగర్ రిజర్వ్‌లు, 3 జాతీయ పార్కులు) ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 26,903 చ.కి.మీ పరిధిలో అటవీ ప్రాంతం విస్తరించి ఉండగా, 5,693 చ.కి.మీ.లో (21.16 శాతం) రక్షిత ప్రాంతాలున్నాయి. ప్రతీ రెండేళ్లకోసారి ఆయా రక్షిత ప్రాంతాలు, శాంక్చురీలు, టైగర్ రిజర్వ్‌లు, నేషనల్ పార్కుల్లో జంతు, వృక్ష జాతులపై అధ్యయనం నిర్వహిస్తున్నారు. అటవీ ప్రాంతాల పరిధిలో చిరుతలు, అడవి దున్నలు, అడవి కుక్కలు, నక్కలు, జింకలు, దుప్పులు తదితర రకాల వన్యప్రాణులు సందడి చేస్తున్నాయి. కెమెరాట్రాపుల్లో వీటి కదలికలు తాజాగా రికార్డ్ కావడం, వీటి సంఖ్య పెరిగిన ఆనవాళ్లు కనిపించడం పట్ల అటవీశాఖ అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అన్నిరకాల అనుకూల పరిస్థితులు, మెరుగైన సౌకర్యాలతో కవ్వాల్ టైగర్ రిజర్వ్ వన్యప్రాణుల వైవిధ్య కేంద్రంగా నిలుస్తోంది. పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి పులుల సంచారం పెరిగినా, ఇక్కడ అనుకూల పరిస్థితులున్నా అవి ఇంకా స్థిరనివాసం ఏర్పరచుకోకపోవడం మాత్రం సవాల్‌గానే మారింది. మహారాష్ట్ర తడోబా నుంచి నేరుగా పులులు వచ్చేందుకు జాతీయ రహదారితోపాటు రైల్వేకారిడార్ ఉండడం, కొన్నిచోట్ల ఆక్రమణలతో కొంత అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు.

టైగర్ కన్జర్వేషన్ సొసైటీ పరిశీలనలో...



ఇటీవల హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కవ్వాల్‌లోని ప్రధాన (కోర్), పొరుగు ప్రాంతాల నుంచి జంతువులు రాకపోకలు సాగించే (బఫర్) ఏరియాల్లో జంతువుల సంఖ్య పై అధ్యయనం నిర్వహించారు. కవ్వాల్‌లో పులుల అభయారణ్యం ఏ మేరకు సరిపోయేటట్టు ఉంది, ఏయే రకాల మాంసాహార, శాఖాహార జంతువులు ఉన్నాయనే దానిపై దృష్టి కేంద్రీకరించారు. బఫర్ ఏరియాలోని కాగజ్‌నగర్, చెన్నూరు, ఆదిలాబాద్ డివిజన్లలో అనేక పులి పాదముద్రలను గుర్తించారు. మహారాష్ట్రలోని తిప్పేశ్వర్ వైల్డ్ లైఫ్ శాంక్చురీ నుంచి ప్రాణహిత, పెన్‌గంగ నదులను దాటి తడోబా అంథారి టైగర్ రిజర్వ్ నుంచి పులుల సంచారం ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. కవ్వాల్ ప్రధాన అటవీ ప్రాంతంలో చిరుతలు, అడవికుక్కలు, ఎలుగుబంట్లు ఇతర జంతువులు కనిపించాయి. తాళ్లపేట, ఇంథన్ పల్లిలో కృష్ణ జింకలను అధికసంఖ్యలో గుర్తించారు. అడవి దున్న, అడవి పంది, నీల్గాయ్, సాంబారు, మచ్చలజింక, చౌసింగ వంటి శాఖాహార జంతువులను కూడా గుర్తించారు. నీల్గాయ్‌లు, అడవి పందుల జనాభా అటవీ ప్రాంతమంతా విస్తరించి ఉండగా, సాంబార్ జింకలు కొండ ప్రాంతాల్లో ఉన్నట్టు గుర్తించారు. అయితే, ఈ అధ్యయనానికి సంబంధించి ఇంకా తుది నివేదిక రూపొందించలేదు. ఇది తయారయ్యాకే ఆయా రకాల జంతువుల సంఖ్యపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశముంది.

2,254 చ.కి.మీ. సర్వే చేశాం



అధ్యయనంలో భాగంగా ఆదిలాబాద్, కాగజ్‌నగర్, నిర్మల్, జన్నారం, చెన్నూరు, మంచిర్యాలను కవర్ చేశాం. మొత్తం 2,254.35 చ.కి.మీ మేర కవర్ అయ్యింది. ఆదిలాబాద్, కాగజ్‌నగర్–చెన్నూరు సరిహద్దులో పులుల ఉనికి గుర్తించాం. ఆదిలాబాద్, కాగజ్‌నగర్, జన్నారంలలో ఎలుగుబంట్లు, చిరుతలు, ధోల్ తదితర జంతువులు కనిపించాయి. జన్నారంలో అడవి గొర్రెలు, సాంబార్ జింకలు, చెన్నూరు, కాగజ్‌నగర్, ఆదిలాబాద్‌లో నీల్గాయ్‌లు పెద్ద సంఖ్యలో కనిపించాయి. వర్షాకాలం తర్వాత ఆసిఫాబాద్‌లో మళ్లీ సర్వే చేయాలని భావిస్తున్నాం.

–ఇమ్రాన్ సిద్దిఖీ, డైరెక్టర్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ

లద్నాపూర్ నిర్వాసితులకు పరిహారంపై చర్చించండి

- సింగరేణి అధికారులకు మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మంథని నియోజకవర్గం రామగిరి మండలం లద్నాపూర్ ఓపెన్ కాస్ట్ మైన్ కోసం సింగరేణి సంస్థ సేకరించిన భూమిలో ఇళ్లు నిర్మించుకున్న 280 మందికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం చెల్లింపు అంశంపై చర్చలు జరపాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. ఈ అంశంపై ఆదివారం ఆయన సచివాలయంలో సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష కోయాతో సమావేశమై చర్చించారు. పరిహారం చెల్లించేందుకు చట్టపరమైన ఇబ్బందులున్నాయని అధికారులు చెప్పగా, మానవతా దృక్పథంతో నిర్ణయం తీసుకోవాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. లద్నాపూర్‌లో సింగరేణి సంస్థ ఓపెన్ కాస్ట్ మైన్ కోసం 2012లో 103 ఎకరాలను సేకరించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద 466 ఇళ్లకు పరిహారంతో పాటు 721 మంది నిర్వాసితులకు చెరో రూ.7.5 లక్షల చొప్పున చెల్లించింది. ఇందుకు సింగరేణి రూ.145 కోట్లు ఖర్చు చేసింది. భూసేకరణ ముగిసిన తర్వాత కొందరు అవే భూముల్లో 1400 ఇళ్లు నిర్మించుకుని నష్టపరిహారం కోరారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న శ్రీధర్ బాబు చొరవతో వారికి రూ.30 కోట్ల పరిహారాన్ని సింగరేణి సంస్థ చెల్లించింది.

కాళేశ్వరంపై సొంత నిర్ణయాలు వద్దు

నిపుణుల సూచనల మేరకే ముందుకు వెళ్లాలని సీఎం ఆదేశం

ఎన్‌డీఎస్‌ఏతో భేటీ వివరాలను మంత్రి ఉత్తమ్‌ను అడిగి తెలుసుకున్న రేవంత్

నేడు అధిష్టానం పెద్దలు, కేంద్ర మంత్రులను కలిసే అవకాశం



ఆదివారం ఢిల్లీలో ఎన్‌డీఎస్‌ఏ అధికారులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ సహా ఇతర బరాజ్‌లను వినియోగంలోకి తెచ్చే విషయంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ)చేసిన సిఫార్సులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. శనివారం ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్‌తో జరిపిన చర్చల సారాంశాన్ని రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఢిల్లీలోనే ఉన్న ఆ శాఖ కార్యదర్శులు, రాహుల్ బొజ్జా, ప్రశాంత్ పాటిల్‌లను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకు ఆదివారం ఢిల్లీకి వచ్చిన రేవంత్‌రెడ్డి, తన అధికారిక నివాసంలో వీరితో భేటీ అయ్యారు. సుమారు గంటపాటు చర్చించారు. మేడిగడ్డ ప్రాజెక్టు పూర్తిస్థాయి నివేదిక వచ్చేంతవరకు బరాజ్‌లో నీటిని నిల్వ చేయరాదని, వచ్చిన నీటిని వచ్చినట్లుగా దిగువకు విడుదల చేయాలని ఎన్‌డీఎస్‌ఏ సూచించిన విషయాన్ని వారు సీఎం దృష్టికి తీసుకు వచ్చారు. కాళేశ్వరం బరాజ్‌ల విషయంలో సొంత నిర్ణయాలకు అవకాశం ఇవ్వవద్దని, నిపుణుల కమిటీ సూచనల మేరకే ముందుకు వెళ్లాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మంత్రి, అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. కాగా, సోమవారం ఎన్‌డీఎస్‌ఏతో మరోమారు భేటీ ఉన్న దృష్ట్యా, నిపుణుల సూచనలకు అనుగుణంగా పునరుద్ధరణ పనులు, ఇతర పరీక్షలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశనం చేసినట్లు తెలిసింది.

అధిష్టానం పెద్దలతో భేటీ కానున్న సీఎం

ఢిల్లీ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పెద్దలతో భేటీ కానున్నారు. ఎన్నికల వేళ రాష్ట్ర రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఈ మేరకు సీఎం రేవంత్ రుణమాఫీని ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిని పురస్కరించుకుని వరంగల్‌లో 'కృతజ్ఞత సభ' పేరుతో భారీ బహిరంగ సభను నిర్వహించాలని రేవంత్ నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నారని తెలుస్తోంది. రాహుల్ గాంధీ షెడ్యూల్‌ను బట్టి బహిరంగ సభ తేదీని నిర్ణయించే అవకాశముందని సమాచారం. మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల నియామకాలపైనా సీఎం చర్చించనున్నారు.

కేంద్ర మంత్రులతోనూ భేటీ?

పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను రేవంత్‌రెడ్డి కలుస్తారని తెలిసింది. బడ్జెట్ కేటాయింపుల్లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరే అవకాశముందని చెపుతున్నారు. కాగా, సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు సీఎం రేవంత్, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌లు కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలవనున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు సహా తెలంగాణలోని పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి వారు కేంద్ర మంత్రితో చర్చించనున్నారు.

సీఎంతో ఆయుత చండీయాగం జరిపిస్తా

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



రుద్రయాగంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి: రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ.. శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయంలో ఏడాదిలోపు సీఎం రేవంత్‌రెడ్డి చేత ఆయుత చండీయాగం జరిపిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల పరిధిలోని గోపాలయపల్లి గ్రామ సమీపాన గల శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవాలయంలో ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఆశీస్సులతో యాగ సహిత రుద్రయాగం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చివరి రోజు ఆదివారం పూర్ణాహుతి కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి వచ్చి రుద్రయాగం పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ – విజయవాడ రహదారిని ఆరు లేన్లుగా విస్తరించేందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అంగీకరించారని, వచ్చే నెలలో పనులకు టెండర్లు పిలుస్తామని వెల్లడించారు.

రూ.700 కోట్లతో అల్యూమినియం టిన్నుల యూనిట్

బాల్ బేవరేజెస్‌కు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: మంత్రి శ్రీధర్‌బాబు




గణేశన్‌తో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్ బాబు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బాల్ బేవరేజెస్ ప్యాకేజింగ్ కంపెనీ యూనిట్ ఏర్పాటుకు అవసరమైన భూమిని ఇవ్వడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. రూ.700 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్ ద్వారా బీర్లు, కూల్‌డ్రింక్స్, పర్‌ఫ్యూమ్స్ కోసం అల్యూమినియం టిన్నులు తయారవుతాయని, తద్వారా 500 మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఆదివారం బాల్ బేవరేజెస్ కంపెనీ కార్పొరేట్ వ్యవహారాల అధినేత గణేశన్ సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబును కలసి తమ కంపెనీ విస్తరణ ప్రణాళికలను వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ కంపెనీ యూనిట్ స్థాపనకు ముందుకొచ్చిన నేపథ్యంలో అవసరమైన తోడ్పాటునందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో దొరికే టిన్ బీర్లు మహారాష్ట్రలో బాటిలింగ్ అవుతున్నాయని, ఈ టిన్నులను మన రాష్ట్రంలో తయారు చేసి, బాటిలింగ్ చేసేందుకు ఎక్సైజ్ విధానంలో మార్పులు తేవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అంశంపై సీఎం రేవంత్, మంత్రి జూపల్లి కృష్ణారావులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామన్నారు. 500 మిల్లీలీటర్ల బీర్లను రాష్ట్రంలోనే ప్యాక్ చేయడం వల్ల ఎక్సైజ్ డ్యూటీ తగ్గి ప్రభుత్వ ఖజానాకు ఏటా రూ.285 కోట్ల ఆదాయం వస్తుందని ఆయన వివరించారు. తాను గతంలో అమెరికా పర్యటనకు వెళ్లిన సందర్భంగా కోకాకోలా కేంద్ర కార్యాలయాన్ని సందర్శించానని, పెద్దపల్లి జిల్లాలో కొత్త బాటిలింగ్ యూనిట్ ఏర్పాటు కు ఆ సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసిందని, రూ.1,000 కోట్లతో ఏర్పాటయ్యే ఆ యూనిట్‌కు బాల్ సంస్థ అల్యూమినియం టిన్నులను సరఫరా చేస్తుందని చెప్పా రు.

ఢిల్లీలో తెలంగాణ పరువు తీయకండి

ఉత్తమ్ అవాకులు, చెవాకులు ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనం: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఎత్తిపోతల పథకాలకు కరెంటు ఖర్చు అవుతుందని ఆ ఎత్తిపోతలు లేకపోతే తెలంగాణ కరువు ప్రాంతంగా, వలసలకు నెలవుగా, రైతుల ఆత్మహత్యలకు నిలయంగా మారుతుందని మాజీ మంత్రి హరీశ్‌రావు అభిప్రాయపడ్డారు. తెలంగాణ భౌగోళిక పరిస్థితిని అర్థం చేసుకుని అవగాహనతో మాట్లాడాలని, కనీసం ఢిల్లీలో మాట్లాడేటప్పుడయినా తెలంగాణ పరువు తీయవద్దని ఆదివారం ఒక ప్రకటనలో పాలకులకు హితవు పలికారు. డ్యాం సేఫ్టీ అథారిటీతో సమావేశం అనంతరం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ అవాకులు, చెవాకులు పేలడం ఆయన అవగాహన రాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలోనే మేడిగడ్డ ప్రాజెక్టు ఆరడుగులు కుంగిపోయిందని ఉత్తమ్ అంటున్నారని, అది కేవలం ఒక దురదృష్టకర ఘటన అని, అలా జరగాలని ఏ ప్రభుత్వమూ కోరుకోదని పేర్కొన్నారు. "2022లో సంభవించిన వరద గోదావరి చరిత్రలోనే అతి పెద్దది, మేడిగడ్డ బరాజ్ వద్ద 28లక్షల క్యూసెక్కులపైగా వరద ప్రవాహం వచ్చింది దాంతో బ్యారేజి కింది సిమెంటు బ్లాకులు అక్కడక్కడ లేచిపోయి ఉన్నందున చిన్న లీకేజీలు బుంగలుగా మారి సొరంగంగా ఏర్పడ్డాయి, ఈ సొరంగం 2023 వరదల అనంతరం మూడు పిల్లర్ల కుంగుబాటుకు కారణమైంది'' అని వివరించారు. మేడిగడ్డ పునాదులు బలపరిచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పిన మంత్రి మళ్లీ మేడిగడ్డ వద్ద మట్టి పరీక్షలు సాధ్యం కాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. వరద వచ్చేంతవరకు సాంకేతిక పరీక్షలు నిర్వహించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యమే కారణమైతే ఇందుకు ఆ ప్రభుత్వమే బాధ్యత వహించాలని హరీశ్ డిమాండ్ చేశారు.

డిప్లొమా విద్యార్థులకు 10వేల ఇంజనీరింగ్ సీట్లు

6,048 సీట్లు కంప్యూటర్ బ్రాంచీల్లోనే

ఫార్మసీలో 3.98 శాతమే సీట్ల భర్తీ

పూర్తయిన ఆఖరి విడత ఈసెట్ కౌన్సెలింగ్



సాక్షి, హైదరాబాద్: పాలిటెక్నిక్, ఫార్మసీ డిప్లొమా పూర్తి చేసిన వారికి నిర్వహించే తుది విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇంజనీరింగ్, ఫార్మసీలో రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశాలు కల్పించారు. ఇంజనీరింగ్‌లో 12,785 సీట్లు అందుబాటులో ఉంటే, 10,407 సీట్లు భర్తీ చేశారు. ఫార్మసీలో 1,180 సీట్లు అందుబాటులో ఉంటే, కేవలం 47 సీట్లు (3.98 శాతం) మాత్రమే భర్తీ అయ్యాయి. ఈ ఏడాది ఈ సెట్‌కు 22,365 మంది అర్హత సాధించారు. ఫైనల్ ఫేజ్‌లో 9,646 మంది 3,92,923 ఆప్షన్లు ఇచ్చారు. ఆఖరి విడతలో 1,246 మంది బ్రాంచీలను మార్చుకున్నట్టు సాంకేతిక విద్య విభాగం తెలిపింది. ఇంజనీరింగ్‌లో ఎక్కువ భాగం కంప్యూటర్ సైన్స్, ఇతర కంప్యూటర్ కోర్సుల్లోనే ఆప్షన్లు ఇచ్చారు. దీంతో 8,371 సీట్లు ఈ బ్రాంచీల్లో ఉంటే, 6,084 సీట్లు భర్తీ అయ్యాయి. 72.68 శాతం సీట్ల భర్తీ పూర్తయినట్టు అధికారులు తెలిపారు. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 24లోగా రిపోర్టు చేయాలని అధికారులు సూచించారు.

ప్రధాన బ్రాంచీల్లో సీట్ల కేటాయింపు

బ్రాంచీ	సీట్లు	కేటాయించినవి
సీఎస్ఈ	3,434	2,878
ఐటీ	869	628
సీఎస్ఈ (డేటాసైన్స్)	1,200	722
సీఎస్ఈ (సైబర్ సెక్యూరిటీ)	282	200
సీఎస్ఈ (ఏఐఎంఎల్)	1,741	1,102
ఈసీఈ	1,894	1,859
ఈఈఈ	869	861
సివిల్	676	671
మెకానికల్	662	650
బి ఫార్మసీ	1,180	47

ఇంజనీరింగ్ (రెండో ఏడాదిలోకి) సీట్ల కేటాయింపు ఇలా

సంస్థ	సంఖ్య	సీట్ల లభ్యత	భర్తీ అయినవి	మిగిలినవి	శాతం
యూనివర్సిటీలు	14	1814	1,589	225	87.6
ప్రైవేటు వర్సిటీలు	2	198	198	0	100
ప్రైవేటు కాలేజీలు	153	10,773	8,620	2,153	80.01
మొత్తం	169	12,785	10,407	2,378	81.40

ఫార్మసీ (రెండో ఏడాదిలోకి) సీట్ల కేటాయింపు

సంస్థ	సంఖ్య	సీట్ల లభ్యత	భర్తీ అయినవి	మిగిలినవి	శాతం
యూనివర్సిటీ	6	143	28	115	19.58
ప్రైవేటు వర్సిటీ	1	10	0	0	0
ప్రైవేటు కాలేజీలు	114	1,027	19	1,008	1.85
మొత్తం	121	1,180	47	1,133	3.98



“ఒకదాని పేరు తెలుసుకోవడానికీ, ఒకదాన్ని తెలుసుకోవడానికీ మధ్య ఉన్న తేడా ఏమిటో నేను త్వరగా నేర్చుకున్నాను.
– రిచర్డ్ పి. ఫెయిన్‌మాన్

సాక్షి
సోమవారం, 22 జూలై 2024

దాశరథి స్మృతి

పూపరిమళాన్ని వెదజల్లే అగ్నిశిఖలాంటివాడు దాశరథి. చైత్రరథాలను తోలుతూనే, అభ్యుదయ పంథా సాగాడు. ఋతురాగాలను వర్ణిస్తూనే, ‘నిరుపేదవాని నెత్తురు చుక్కలో’ విప్లవాలను కాంచాడు. ‘అంగారమూ శృంగారమూ’ సమపాళ్లలో మేళవించివున్న సుకుమారుడు. ఆకాశమంత ఎదిగిన వామనుడు. స్నానం చేసి మడి కట్టుకున్నాక, సంస్కృతంలో తప్ప తెలుగులో మాట్లాడని సనాతన సంప్రదాయ కుటుంబంలో జన్మించిన దాశరథి– పన్నీటివంటి తెలుగునూ, పసందైన ఉర్దూ గజళ్లనూ ప్రేమించాడు. ‘ఏది కాకతి? ఎవతి రుద్రమ?/ ఎవడు రాయలు? ఎవడు సింగన?/ అన్ని నేనే, అంత నేనే/ వెలుగు నేనే, తెలుగు నేనే’ అని సగర్వంగా ప్రకటించాడు. ఒకప్పటి వరంగల్ జిల్లాలో భాగమైన ఖమ్మంలోని చిన గూడూరులో 1925 జూలై 22న జన్మించిన దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సంవత్సరం నేటి నుంచి మొదలవుతుంది.

దొరలు, దేశ్‌ముఖులు, జమీందారులు, జాగీర్దార్ల గుప్పిట సాగుభూములన్నీ ఉన్న రోజుల్లో; ఎర్రకోటపై నిజాం పతాకం ఎగురవేస్తాననీ, బంగాళాఖాతంలో నిజాం కాళ్లు కడుగుతాననీ కాశిం రజ్వీ బీరాలు పలుకుతున్న కాలంలో; హైదరాబాద్ రాష్ట్రాన్ని ఇండియన్ యూనియన్‌లో కలపడం కోసం తొలుత కమ్యూనిస్టుగానూ, అటుపై స్టేట్ కాంగ్రెస్‌వాడిగానూ పోరాట పిడికిలి బిగించిన యోధుడు దాశరథి. ‘మధ్యయుగాల రాచరికపు బలా’న్నే తన కవితకు ప్రేరణగా మలుచుకుని సింహగర్జన చేసిన మహాకవి దాశరథి. ‘ఓ నిజాము పిశాచమా! కానరాడు/ నిన్ను బోలినరాజు మాకెన్నడేని/ తీగెలను తెంపి అగ్నిలో దింపినావు/ నా తెలంగాణ కోటిరత్నాల వీణ’ అని నినదించిన ‘అగ్నిధార’ దాశరథి. 1947 ప్రాంతంలో నిజాం పోలీసులు బంధించి తొలుత వరంగల్ సెంట్రల్ జైలుకూ, అనంతరం నిజామాబాద్ జైలుకూ ఆయన్ని తరలించారు. ముక్కిన బియ్యం, ఉడకని అన్నం వల్ల అనారోగ్యానికి గురైనా కవితా కన్యకను విడిచిపెట్టలేదు. కలం కాగితాలు దొరక్కపోయినా జైలు గోడల మీద బొగ్గుతో కవిత్వం రాయడం మానలేదు. తోటి ఖైదీలు పదే పదే చదువుతూ వాటిని కంఠస్థం చేసేవాళ్లు. ‘దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు/ ఊళ్లకూళ్లు అగ్గిపెట్టి ఇళ్లన్నీ కొల్లగొట్టి... పెద్దరికం చేస్తావా మూడు కోట్ల చేతులు నీ/ మేడను పడదోస్తాయి...’ అంటూ ‘ఇదేమాట పదేపదే’ హెచ్చరించాడు.

తెలంగాణను కలవరించిన ‘కవిసింహం’ దాశరథి. తెలంగాణ అనే మాటతో మరింకే కవీ ముడిపడనంతగా ముడిపడిన ‘అభ్యుదయ కవిసమ్రాట్’ దాశరథి. ‘కలిపి వేయుము నా తెలంగాణ తల్లి/ మూడు కోటుల నొక్కటే ముడి బిగించి’ అని కోరాడు. ‘తెలంగాణము రైతుదే/ ముసలి నక్కకు రాచరికమ్ము దక్కునే’ అని ప్రశ్నించాడు. ‘నేనురా తెలంగాణ నిగళాలు తెగగొట్టి ఆకాశమంత ఎత్తర్చినానూ’ అని ఘోషించాడు. ‘తెలంగాణమున గడ్డిపోచయును సంధించెను కృపాణమ్ము’ అని కీర్తించాడు. ‘మూగవోయిన కోటి తమ్ముల గళాల/ పాట పలికించి కవిరాజసమ్ము కూర్చి/ నా కలానకు బలమిచ్చి నడపినట్టి/ నా తెలంగాణ కోటిరత్నాల వీణ’ అని పలికాడు. ‘నాడు నేడును తెలగాణ మోడలేదు’ అని ఎలుగెత్తాడు. 1952లో స్థాపించిన ‘తెలంగాణ రచయితల సంఘం’కు మొదటి అధ్యక్షుడిగా వ్యవహరించాడు. అయినప్పటికీ ‘మహాంధ్ర సౌభాగ్య గీతి’ని చివరిదాకా ఆలపించాడు. ‘సమగ్రాంధ్ర దీపావళి సమైక్యాంధ్ర దీపావళి’ని జరుపుకొన్నాడు. సమైక్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆస్థాన కవిగా వ్యవహరించాడు.

ఆంధ్ర నటుల నోట తెలంగాణ మాట ఇప్పుడు కమ్మగా వినిపిస్తున్నదంటే, ఆంధ్ర దర్శకులు తెలంగాణ పలుకుబడిని తమది కానిదని భావించడం లేదంటే– దాశరథి, ఇంకా అలాంటి ఎందరో తెలంగాణ రచయితలు, అటుపై జరిగిన తెలంగాణ ప్రత్యేక ఉద్యమాలు కారణం. దాశరథి లాంటివాళ్లు రెండు రకాల యుద్ధాలు చేశారు. ఉర్దూమయమైన హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు మాట్లాడటం కోసం ఒకటి, అది ‘తౌరక్యాంధ్రము’ అని ఈసడించే ఆంధ్రులతో మరొకటి! అయినా దాశరథి తాను రాసిన సినిమా పాటల్లో తెలంగాణ ‘తహజీబ్’ను ‘ఖుషీ ఖుషీగా’ చాటాడు. నిషాలనూ, హుషారులనూ మజామజాగా పాడాడు. అంతేనా? ‘ఏ దివిలో విరిసిన పారిజాతమో ఏ కవిలో మెరిసిన ప్రేమగీతమో’; ‘నా కంటిపాపలో నిలిచిపోరా నీ వెంట లోకాల గెలవనీరా’ అంటూ సాటి తెలుగు సినీ గేయరచయితలకు దీటుగా నిలిచాడు.

భద్రాద్రి శ్రీరామచంద్రుని సేవలో తరించి దాశరథి అనే ఇంటిపేరును స్థిరం చేసుకున్నదని చెప్పే వంశం వాళ్లది. తమ్ముడు దాశరథి రంగాచార్య కూడా అంతే గట్టివాడైనప్పటికీ మనకు దాశరథి అంటే దాశరథి కృష్ణమాచార్యే. ‘మహాంధ్రోదయం’, ‘పునర్నవం’, ‘కవితాపుష్పకం’, ‘అమృతాభిషేకం’, ‘రుద్రవీణ’, ‘తిమిరంతో సమరం’ వంటి కవితా సంపుటాలు; ‘మహాశిల్పి జక్కన్న’ అనే చారిత్రక నవల; ‘యాత్రాస్మృతి’ పేరిట వచన సొగసును తెలిపే ఆత్మకథ వెలువరించాడు. రేడియోలో పనిచేస్తూ లలిత గీతాలు, రేడియో నాటకాలు వినిపించాడు. భక్త రామదాసు మాదిరిగానే ‘దాశరథీ కరుణాపయోనిధీ’ మకుటంతో ‘అభినవ దాశరథీ శతకం’ రచించాడు. చక్కటి గాలిబ్ గీతాలను సరళ సుందరమైన తెలుగులోకి అనువదించాడు. ‘నాదు గుండె గాయము కుట్టు సూదికంట/ అశ్రుజలధార దారమై అవతరించె’ అంటూ గాలిబ్ ఉర్దూ ఆత్మను తెలుగు శరీరంలోకి ప్రవేశపెట్టాడు. ‘రోజూ కనబడే నక్షత్రాల్లోనే/ రోజూ కనబడని కొత్తదనం చూసి/ రోజూ పొందని ఆనందానుభూతి/ పొందడం అంటేనే కవిత్వం’ అని చెప్పిన సౌందర్యారాధకుడు దాశరథి 1987 నవంబర్ 5న అరవై రెండేళ్లకు గురుపూర్ణిమ నాడు పరమపదించాడు.

జమ్మూలో దాడుల వెనుక...

విశ్లేషణ



జ్యోతీ మల్హోత్రా

కొన్ని వారాలుగా జమ్ము తీవ్రవాదుల దాడులతో దద్దరిల్లుతోంది. కశ్మీర్ లోయ నుండి ఉగ్రదాడులు జమ్మూకి ఎందుకు మారినట్టు? ప్రపంచంలోనే అత్యంత సైనికీకరించిన ప్రదేశాల్లో కశ్మీర్ ఒకటి. సైన్యానికి తెలియకుండా ఆకు కూడా కదలదు. కశ్మీర్‌తో పోల్చితే జమ్మూ తక్కువ సమస్యాత్మకం. జమ్ము–కశ్మీర్‌కు ఆర్టికల్ 370 రద్దు అయిదో వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి బీజేపీ పాలిత కేంద్రం సిద్ధమవుతున్న తరుణంలో ఈ దాడులు జరుగుతుండటం గమనార్హం. సాధారణ స్థితికి సంబంధించిన ప్రభుత్వ వాదనలను జమ్మూలో కూడా తోసిపుచ్చడమే ఉగ్రవాదుల లక్ష్యం అయి వుండాలి. శాశ్వత శాంతిని కనుగొనడంలో ‘పాకిస్తానీ హస్తం’ ఇప్పటికీ తప్పనిసరని ఈ దాడులు గుర్తు చేస్తాయని వాళ్లు భావిస్తూవుండొచ్చు.

ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ ప్రాంతంలోని రియాసీ నుంచి కాశ్మీర్‌లోని బారాముల్లా వరకు చీనాబ్ నదిపై ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన వంతెన మీదుగా ఈ నెలాఖరులో తొలి రైలు రన్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. కానీ ప్రశ్న ఏమిటంటే, పీర్ పంజాల్‌కు దక్షిణాన ఇటీవల జరిగిన ఉగ్రదాడుల కారణంగా ఈ ప్రాంత వాసుల్లో ఏర్పడుతున్న ఆందోళనకు ప్రధాన మంత్రి సమక్షంలో భరోసా లభిస్తుందా?

గత కొన్ని వారాలు రక్తంతో తడిసిన భీకర శబ్దాన్ని గుర్తుచేస్తున్నాయి: జూలై 8న కథువా జిల్లాలో ఐదుగురు సైనికులు హతమయ్యారు. జూలై 7న కుల్గామ్‌లో ఆరుగురు ఉగ్రవాదులతో సహా ఎనిమిది మంది హతమయ్యారు. జూన్ 26న దోడా జిల్లాలో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. జూన్ 9న ఢిల్లీలో ప్రధాని మోదీ ప్రమాణ స్వీకారం చేస్తున్న రోజున రియాసి జిల్లాలో తొమ్మిది మంది యాత్రికులు హత్యకు గురయ్యారు.

మరో నెల రోజుల్లో, జమ్ము–కశ్మీర్‌కు ఆర్టికల్ 370 రద్దు అయిదో వార్షికోత్సవాన్ని జరుపుకోవడానికి బీజేపీ పాలిత కేంద్రం సిద్ధమవుతున్న తరుణంలో ‘సబ్ చంగా సీ’ (అంతా బాగుంది) పిలుపునకు ఏమైంది? ముడుచుకుపోయిన పెదవులు, పిడచకట్టుకుపోయిన నాలుకలపై కదులుతున్న ప్రశ్న ఏమిటంటే, ముస్లింలు మెజారిటీగా ఉన్న కశ్మీర్ లోయ నుండి ఉగ్రవాద దాడులు హిందూ మెజారిటీ జమ్మూకి ఎందుకు మారాయి?

మొదట, వాస్తవాలు చూద్దాం. దాడులు చేస్తున్న ఉగ్రవాదులు విదేశీయులు. అంటే వారు పాకిస్తాన్‌కు చెందినవారు. అఫ్గాన్లు, చెచెన్లు మొదలైన ఇతర విదేశీ ఉగ్రవాదుల్ని ఇక్కడ గుర్తించలేదు. రెండవది, వారు అమెరికా తయారీ ఎమ్4 కార్బైన్ అసాల్ట్ రైఫిల్స్ వంటి అధునాతన ఆయుధాలను కలిగి ఉన్నారు. ఇవి తరచుగా జమ్ము–కశ్మీర్‌లో కంటే అఫ్గాన్ యుద్ధరంగంలో ఎక్కువగా కనిపిస్తాయి. మూడవది, వారు దాడులను నిర్వహించడానికి అత్యున్నత శిక్షణ పొందారు. నాల్గవది, ఈ ఉగ్రవాదులు అటవీ, అంతర్జాతీయ సరిహద్దు విభాగం నుండి జమ్మూ ప్రాంతంలోకి చొరబడ్డారు. వారు వేగవంతమైన ప్రవాహాల నుండి ఈదుకుంటూ వచ్చారు, అంతే తప్ప నిజంగా నియంత్రణ రేఖను దాటి కాదు.

అంతర్జాతీయ సరిహద్దు నుంచి చొరబడవచ్చని చెబితే ఎక్కువగా ఆశ్చర్యపోవద్దు. రియాసీ, డోడా, కథువా, సాంబాలో నేల మెత్తటిది. గతంలో ఉగ్రవాదులు సొరంగాల ద్వారా చొరబడ్డారు. ఇప్పుడైతే పాకిస్తానీ డ్రోన్లు వారికి సాయపడుతున్నాయి – 2021లో జమ్మూ వైమానిక క్షేత్రంపై దాడితో సహా!

మరీ ముఖ్యంగా, పాకిస్తానీ వ్యూహంలో మార్పు – అంటే, లక్ష్య ప్రాంతాన్ని కశ్మీర్ నుండి జమ్మూకి మార్చడం అనేది కశ్మీరీ జనాభాకు ‘ఉపశమనం’ ఇవ్వాలనే ఉద్దేశ్యంతో స్పష్టంగా జరిగిన చర్య. కశ్మీర్ లోయ చాలా నిశితంగా పరిశీలించబడుతోంది. అక్కడ చెట్టు నుండి పడే ఆకు వేగం, కోణం, దూరం గురించి కూడా భద్రతా బలగాలకు తెలుసు. వారికి ముందుగా తెలియకుండా చిగురుటాకు కూడా రాలడం కష్టం. కశ్మీర్‌లోని పెద్ద భూభాగాలు ప్రపంచంలోనే అత్యంత సైనికీకరించబడిన వాటిలో ఒకటిగా ఉన్నాయనడంలో సందేహం లేదు. వ్యవస్థ గురించి మాట్లాడితే లేదా వ్యతిరేకంగా మాట్లాడితే దానికి చెల్లించే మూల్యం చాలా ఎక్కువగా ఉంటుంది కాబట్టి ప్రజలు తమ పనులు తాము చూసుకుంటారు.



జమ్మూ ప్రాంతంలో అలా కాదు. పూంఛ్–రాజౌరీ సెక్టార్‌లో నిరంతరం దాడులు జరుగుతున్నప్పటికీ, ఈ భూభాగాల భద్రత చాలావరకు సడలించబడింది. హిందూ మెజారిటీతో కూడిన జమ్మూ మరింత జాతీయవాదంతో, తక్కువ సమస్యాత్మకంగా ఉంటుంది. వాస్తవానికి, 2020 వేసవిలో వాస్తవ నియంత్రణ రేఖ అంతటా చైనీయులు కాలిడినట్లు గుర్తించిన వెంటనే, రాష్ట్రీయ రైఫిల్స్ వారి బ్రిగేడ్‌ను తూర్పు లద్దాఖ్‌కు తరలించారు. భద్రత పలుచబడిపోవడం వల్ల జమ్మూకు భారీ నష్టం వాటిల్లింది. ఇప్పుడు మాత్రమే ఇక్కడి బ్రిగేడ్ కొంతమంది రిజర్వ్ బలగాలతో భర్తీ అయింది.

ఇక్కడ మరొకటి కూడా జరుగుతోంది. ఇది భద్రతా పరిస్థితులతో నేరుగా సంబంధం కలిగి ఉండకపోయినా, మారుతున్న పరిస్థితుల గురించి మీకు కొంత ఆలోచన ఇస్తుంది. అదేమిటంటే ఆర్టికల్ 370 రద్దు అనంతరం కూడా బీజేపీ బలహీనపడటం!

ఇది ఇలా ఉండకూడదు. ఆర్టికల్ 370ను రద్దు చేయడం వల్ల జమ్మూను దేశంలోని మిగిలిన ప్రాంతాలతో మరింత అనుసంధానం చేయాలని భావించారు. దానికి బదులుగా, ఇప్పుడు స్థానిక నివాసితులు పెరుగుతున్న నిరుద్యోగం, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, బయటి వ్యక్తులకు భూమి అమ్మకం, మద్యం వ్యాపారంలో పెరుగుదలతో పాటుగా, శ్రీనగర్ నుండి ఐదు లక్షల మందితో కూడిన బలమైన సైన్యం తరలింపును గురించి ఫిర్యాదు చేస్తున్నారు. ఇది స్థానిక వ్యాపారానికి ఊతమిచ్చేది.

ఇటీవలి లోక్‌సభ ఎన్నికలు ఆ అసంతృప్తిని కొంత మేరకు ప్రదర్శించాయి. ఉధమ్‌పూర్ (40.11 శాతం ఓట్లు సాధించిన చౌధురీ లాల్ సింగ్‌ను 51.28 శాతంతో జితేంద్ర సింగ్ ఓడించారు), జమ్మూ (42.4 శాతం ఓట్లు సాధించిన రామన్ భల్లాను 52.8 శాతంతో జుగల్ కిషోర్ శర్మ ఓడించారు) స్థానాలను బీజేపీ గెలుచుకున్నప్పటికీ, వారి గెలుపు మార్జిన్లు చాలా తక్కువగా ఉన్నాయి. రెండూ 1.5 లక్షల కంటే తక్కువ. ఇలా జరగడం పట్ల అధికార పార్టీ ఒకింత ఆశ్చర్యం కూడా వ్యక్తం చేసింది.

బహుశా, పాకిస్తానీ ఉగ్రవాదులు చేయాలనుకుంటున్నది అదే కావచ్చు. ఆర్టికల్ 370 రద్దు అయిదో వార్షికోత్సవం సందర్భంగా, సాధారణ స్థితికి సంబంధించిన ప్రభుత్వ వాదనలను జమ్మూలో కూడా తోసిపుచ్చడమే. తీవ్రవాద దాడుల స్థాయి ఇంకా కొద్దో గొప్పో నియంత్రణలోనే ఉందనీ, వ్యూహాలు మారినప్పటికీ అది ఎక్కువ ప్రతీకార చర్యలకు పురిగొల్పదనీ కొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులు సైనిక శిబిరాలకు ఎక్కువ నష్టం కలిగించడానికి ఉద్దేశించబడ్డాయి. జమ్మూలో ఇవి సాయుధ గస్తీపై, పౌర వాహనాలపై మెరుపుదాడిగా మారాయి.

బహుశా, మరొక కారణం ఉంది. పార్లమెంట్‌లో ప్రధాని మోదీ బలం తగ్గినప్పటికీ, ఆయన ప్రపంచంలో పర్యటిస్తున్నారనీ, ఆయన గౌరవం పొందుతున్నారనీ పాకిస్తాన్ సర్వశక్తిమంతమైన సైనిక వ్యవస్థ గమనించకుండా ఉండదు. న్యూఢిల్లీని దాని ఆత్మసంతృప్తి దశ నుండి కదిలించి, ఒక పరిష్కారాన్ని, శాశ్వత శాంతిని కనుగొనడంలో ‘పాకిస్తానీ హస్తం’ ఇప్పటికీ తప్పనిసరని గుర్తించేలా ఈ దాడులు చేస్తాయని బహుశా రావల్పిండి భావిస్తూవుండొచ్చు.

అయినప్పటికీ, అంతర్గత ఒత్తిడికి మోదీ చాలా ఎక్కువగా స్పందిస్తారని స్పష్టంగా తెలుస్తుంది. 2019లో కర్తార్‌పూర్ సాహిబ్ కారిడార్‌ను బలవంతంగా ప్రారంభించిన పంజాబ్ మాదిరిగానే, మరికొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు కశ్మీర్‌కు అవకాశం వస్తుంది. కశ్మీర్ లేదా జమ్మూ నుండి ఎన్నికైన ప్రతినిధులను ఢిల్లీ గానీ, రావల్పిండి గానీ విస్మరించలేవు. చేతిలో ఒక క్షణం ఉంటుంది. ఇది త్వరలో మళ్లీ రాకపోవచ్చు. భారతదేశం, పాకిస్తాన్ రెండూ ప్రయత్నించాలి, దానికి సిద్ధం కావాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!

హక్కు సమానమే!



మత ఆజ్ఞ ప్రకారం, తాను తింటున్నది హలాల్ అవునో, కాదో తెలుసుకునే హక్కు ఒక ముస్లింకు ఉంటుంది. అదే... తాను కొంటున్నది తన మత అవసరాలను తీర్చుతున్నదా, లేదా అని ఒక హిందువు చూసుకుంటే అది మతతత్వం అవుతుంది. ఎంతటి ద్వంద్వ ప్రమాణాలు!

– బల్‌బీర్ పుంజ్, బీజేపీ మాజీ ఎంపీ – కాలమిస్ట్

తాకనీయరు!



ముస్లింలు ప్రతిచోటా శాకాహార భోజనం చేస్తారు. మాంసం తింటున్నప్పుడు మాత్రమే అది హలాల్ అయివుండాలి. ఎందుకంటే శాకాహారం అప్పటికే హలాల్. దీనికి విరుద్ధంగా కొందరు (హిందూ శాకాహారులు!) తమ చెమ్చాలను కూడా వెంట తెచ్చుకొంటారు.

– దారాబ్ ఫారూఖీ, సినిమా రచయిత

చరిత్ర పునరావృతం?



19వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ నల్లమందు వ్యాపారాన్ని కొనసాగించింది. దాన్నొక ఆర్థిక వరంగా చూపినప్పటికీ వాస్తవంలో అది గ్రామీణ జనాభాను దోచుకోవడానికి దారితీసింది. చరిత్ర మణిపూర్‌లో పునరావృతం అవుతోందా? కుకీ–మైతేయిల ఘర్షణకు సామాజిక–రాజకీయ కోణం ఉండొచ్చుగానీ, ఆర్థిక కోణమే రాజకీయాలను నడుపుతోంది.

– ఆర్తీ టిక్కూ సింగ్, సంపాదకురాలు

అయిపోయిందా?



ఉక్రెయిన్ జెండాలను సామాజిక మాధ్యమాల్లో ఎగరవేస్తున్న జనాలు నాకు ఎవరూ కనబడటం లేదు. అందరూ నిశ్శబ్దంగా వాటిని తమ పరిచయం(బయో)లోంచి తొలగించారు. ఏమైంది? ఇంకా యుద్ధం కొనసాగుతోందిగా?

– జూబీ, ర్యాపర్

ఇన్ బాక్స్

సుస్థిరాభివృద్ధిలో మెరుగుదల ఉన్నా...

పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, వైద్యం, లింగ అసమానతలు, ఆకలి, పరిశుభ్రత, రక్షిత మంచినీరు, పర్యావరణం లాంటి 16 లక్ష్యాలలో రాష్ట్రాల కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరు ఆధారంగా ‘ఇండియా ఇండెక్స్ 2023– 24’ పేరుతో నీతి ఆయోగ్ సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనపై తన రిపోర్టుని విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారంగా 2018 నుండి భారత్ తన స్కోర్‌ని 57 నుండి 71 పాయింట్లకు పెంచుకున్నప్పటికీ సుస్థిరాభివృద్ధి కీలక లక్ష్యాల సాధనలో మెరుగైన ఫలితాలను సాధించటంలో వెనుకబడిందని నివేదిక స్పష్టం చేస్తోంది. పర్యావరణ విధ్వంసం జరగకుండా ప్రస్తుత తరం అవసరాలతో రాజీపడకుండా భవిష్యత్ తరాల అవసరాలను తీర్చగలిగే విధంగా వనరుల సామర్థ్యాన్ని కాపాడటమే సుస్థిరాభివృద్ధి. ఈ భావనను యూఎన్‌డీపీ 2015లో ప్రకటించిన తర్వాత ప్రపంచంలోని 193 దేశాలు 2030 నాటికి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాయి. సుస్థిరాభివృద్ధికి కావలసిన 16 లక్ష్యాలలో ప్రతి లక్ష్యానికి 0 (సున్నా) నుండి 100 స్కోర్ కేటాయిస్తారు. ఈ 16 లక్ష్యాలలో వచ్చిన స్కోర్ ఆధారంగా రాష్ట్రాలకి ర్యాంకులు కేటాయిస్తారు. ‘అందరికీ అందుబాటులో శక్తి వనరులు’ అనే లక్ష్యంలో మాత్రమే అత్యధికంగా 96 స్కోర్ సాధించగలిగినాం. పేదరిక నిర్మూలన, రక్షిత మంచినీరు, పరిశుభ్రత, ఆరోగ్య సంరక్షణ, బాధ్యతాయుతమైన వినియోగం, ఉత్పత్తిలో, నేలపై జీవుల రక్షణ, శాంతి, న్యాయం, బలమైన వ్యవస్థల విషయంలో 70 దాటి స్కోర్ సాధించగలిగింది. అయినప్పటికీ లింగ సమానతలో అతి తక్కువ స్కోరు (49) సాధించటం; ఆకలి నివారణ, నాణ్యమైన విద్య, అసమానతల తగ్గింపు, పరిశ్రమలు, ఆవిష్కరణలు, మౌలిక వసతుల కల్పనలో వెనకబడటం ఆందోళన కలిగించే విషయంగానే చెప్పాలి.

నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో రాష్ట్రాల స్కోర్లను చూస్తే... ఉత్తరాఖండ్ , కేరళలు 79 స్కోర్‌తో మొదటి ర్యాంకు సాధించాయి. 57 స్కోర్‌తో బిహార్ చివరి స్థానంలో నిలబడింది. 74 స్కోర్‌తో రెండు తెలుగు రాష్ట్రాలు ఆరవ ర్యాంకులో నిలిచాయి.

‘ప్రధానమంత్రి ఆవాస్ యోజన’ కింద నాలుగు కోట్ల గృహాలను నిర్మించటం, 11 కోట్ల టాయిలెట్ సౌకర్యాలు కల్పించటం, ‘ఉజ్వల యోజన’ కింద పది కోట్ల మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వటం, ‘జల్ జీవన్ మిషన్’లో భాగంగా 15 కోట్ల గృహాలకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించటం, 30 కోట్ల మందికి ‘ఆయుష్మాన్ భవ’ వర్తింపజేయటం, ‘ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన’ పథకం కింద 80 కోట్ల పేదలకు ఉచిత రేషన్ ఇవ్వటం వంటివాటి వలన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారత్ తన స్కోర్‌ను 57 నుండి 71కి పెంచుకోగలిగిందనేది నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం అభిప్రాయం.

– డా॥ తిరునహరి శేషు, అసిస్టెంట్ ప్రొఫెసర్, కాకతీయ విశ్వవిద్యాలయం । 9885475877

వర్చువల్ కచ్చడాలు

తూర్పు తీరం



కె.ఎన్. మల్లీశ్వరి

‘ఒక తల్లి, ముగ్గురు డాడీలు’ యూ ట్యూబ్ ఓపెన్ చెయ్యగానే ఒక చానల్ పెట్టిన థంబ్ నెయిల్ కనపడింది. వ్యూస్ పెంచుకోవడానికి యూట్యూబ్ చానల్స్‌తో పాటు చిన్నా పెద్ద పత్రికల డిజిటల్ విభాగాలు కూడా ఎన్నో ప్రయత్నాలు చేస్తాయి. ‘మతి పోగొట్టే, రచ్చ రచ్చ చేసే, పడీపడీ నవ్వే, చూడగానే షాకయ్యే’ ఎన్నో థంబ్ నెయిల్స్ చూస్తూనే ఉన్నాము. కానీ ఆడవాళ్ళ విషయంలో... ముఖ్యంగా పోరాట కులాల నుంచి వచ్చిన ఆడవాళ్ళ విషయంలో ఈ చూపుడు వేళ్ళు మరిన్ని వంకర్లు తిరుగుతాయి.

‘ఆడదాన్ని అడ్డం పెట్టుకుని యుద్ధం చేస్తావా?’ అంటుంది ఫ్యూడల్ సమాజం. పౌరుషమైన విషయాలు మగవారికే కనుక వారు పురుషులయ్యారు. సమాజమూ రాజకీయాలు వగైరాలన్నీ మగవారి టెరిటరీగా ఉన్నంతకాలం ఆడవాళ్ళని రాజకీయాల్లోకి లాగడం తప్పన్నది ఒక అనాగరిక విలువ. ఆ మేరకు స్త్రీలు యుద్ధాలు చేయని సుకుమారులుగా, మాటంటే బడబడా కన్నీరు కార్చే సున్నిత మనస్కులుగా తయారు చేయబడ్డారు. ఇక ఇపుడు అలా లేరు. స్త్రీలు అన్నీ మాట్లాడగలరు. ముక్కూ చెవులూ కోసి పంపినందుకు సంబరపడిన మన మొహాలకేసి జాలిగా చూసి, ‘ప్రేమించడం తప్పా?’ అంటుంది ఆధునిక శూర్పణఖ. ‘పేడితో యుద్ధం చెయ్యనని’ ఆయుధం విసర్జించిన విలువిద్యకారుని ప్రశ్నించింది శిఖండి. ‘భీష్మా! నాతో పోరాడు’ అని సవాల్ చేసినట్లు కూడా రాసింది ఒక రచయిత్రి.

స్త్రీలు తమ యుద్ధాలు తామే చేస్తున్నా వారి లైంగిక వ్యక్తిత్వం మగవారి సొత్తుగానే ఉంది. సామాజిక మాధ్యమాల విస్తృతి వల్ల ఈ స్థితి కొత్తరూపం తీసుకుంటోంది. రాజకీయ నాయకులుగా, రాజకీయ కుటుంబీకులుగా, ఉన్నతోద్యోగులుగా, కళాకారులుగా ఇంకా ఎన్నో రంగాలలో స్త్రీలు బాహాట శీలపరీక్షలకు గురవుతున్నారు. చేతిలో ఫోనో, ఛానల్ ఉన్న చాలామంది అగ్నిగుండాలకి సమిధలు తయారు చేస్తున్నారు. ‘ఫలానా స్త్రీ ఎవరితో శారీరక సంబంధంలో ఉందీ, ఆమె బిడ్డకి ఎంతమంది డాడీలు, ఆమెకి ఎంతమంది మగాళ్లతో సంబంధాలు ఉన్నాయి, ఆమె ఏ రోజు ఎవరితో ఏ హోటల్లో ఉందీ’ వంటి లక్షోపలక్షల ప్రశ్నలు సమాజాన్ని ఉద్ధరించడం కోసం మీడియా వేస్తూ ఉంటుంది.



అంతేకాదు అటువంటి స్త్రీలకి ఎటువంటి శిక్షలు విధించాలో కూడా రచ్చబండలు, బతుకు జట్కాబండులతో పాటు పిల్లా పీచుకా యూట్యూబర్లు, పెద్ద మీడియా సంస్థలు, రాజకీయ పార్టీల డిజిటల్ విభాగాలు నిర్ణయిస్తాయి. ‘కామాంధురాలి కళ్ళు పీకాలి’, ‘పరాయి మగాడితో కులికిన స్త్రీని గుడ్డలూడదీసి కొట్టాలి’, ‘అక్రమ సంబంధం పెట్టుకున్న ఆమెని చెట్టుకు కట్టేసి తన్నాలి’ వంటి అనేక శిక్షలను సజెస్టివ్‌గా చెప్పడంతో పాటు, ఆ యా శిక్షలను అభినయించి చూపగల ధీరులు వారు. స్త్రీ పురుష శారీరక సంబంధాలు వ్యక్తిగతం. వాటిని చర్చించడానికి కొద్దిమందికి మాత్రమే హక్కు ఉంది. అటువంటి వివాదాల్లోని వ్యక్తులు, ఆ యా సంబంధాలలోని అవకాశవాదాన్ని, మోసాన్ని, హింసని గుర్తించి తీర్పు ఇచ్చే న్యాయవ్యవస్థ లేదా ఆ ఇరువురి సమ్మతంతో ప్రయత్నించే మధ్యవర్తులకి మాత్రమే ఆ హక్కు ఉంది. అంతే తప్ప ఎవరు పడితే వారు, వారి సంబంధాలలోకి తొంగి చూసి, చకచకా అడుగులు వేసి వ్యాఖ్యానించడం కుసంస్కారం. తమ రక్తం పంచుకు పుట్టినవారికే ఆస్తి ఇవ్వడం కోసం, బయలాజికల్ తండ్రులుగా తమ స్థితిని నిర్ధారించుకోవడం కోసం స్త్రీ మొలకు ఇనుప కచ్చడాలు బిగించి, తాళాలు వేసిన ఘనత పితృస్వామ్య సమాజానిది. ఇపుడు మీడియా, సోషల్ మీడియా సామాజిక, రాజకీయ రంగాలలో ఉన్న స్త్రీలకు అటువంటి వర్చువల్ కచ్చడాలు బిగించే ప్రయత్నం చేస్తున్నాయి.


డియర్ మీడియా– సోషల్ మీడియా! అవినీతిని వెలికి తీయడమే మీ అత్యున్నత లక్ష్యం అయినపుడు అవినీతే ప్రమాణం కావాలి తప్ప ఎవరి వ్యక్తిగతాలయినా మీకెందుకు! వేల కోట్ల సంపన్నుల మీద పెద్ద చూపు, పీడిత వర్గాల వ్యక్తిత్వం మీద చిన్నచూపుతో ఉన్న విషయానికి వంద మసాలా దినుసులు కలిపి వార్తలను వండి వడ్డించే హక్కు మీకుందా? ఒక స్త్రీ ఎంతమందితో తిరిగితే, ఎవరితో ఏ సంబంధంలో ఉంటే, ఎవరితో బిడ్డని కంటే మీకేమిటి నొప్పి? స్త్రీలుగా, పోరాట కులాల స్త్రీలుగా, పౌరులుగా, మనుషులుగా మాకు ఉండే హక్కుల పట్ల ఎలానూ అక్కర లేదు. ఏ రాజకీయాలతో ఎలాంటి సంబంధం లేని పసిబిడ్డల పట్ల మానవ సహజమైన తడి కూడా మీకు లేదు. ‘తల్లి వాస్తవం, తండ్రి నమ్మకం’ అన్న నానుడి పాతదే కానీ దాని నిజార్థాన్ని, ‘పిల్లలు మన ద్వారా వస్తారు తప్ప మనకోసం రారు’ అన్న ఖలీల్ గిబ్రన్ తాత్వికార్థాన్ని గ్రహించగలిగితే స్త్రీ పురుష సంబంధాల పట్ల మీ చూపు మారుతుంది. ఒక బిడ్డకు ఎంతమంది డాడీలు అంటూ చర్చ చేసిన ప్రతి మీడియా సంస్థా ఈ రోజు స్త్రీల, బాలల హక్కులను ఉల్లంఘించాయి. వ్యూస్ కోసం ఎంతకైనా తెగించే మిమ్మల్ని చూస్తుంటే, మా శరీరాల చుట్టూ కెమెరాలు బిగించినట్లు, రాబందుల మైకుల చప్పుడు మా తలల మీదుగా వీస్తున్నట్లు ఉంది. దయ చేసి ఆపండి!

వ్యాసకర్త కార్యదర్శి, ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక, ఏపీ
malleswari.kn2008@gmail.com

అప్రియమైన సత్యమైనా...

సత్యం బ్రూయాత్ ప్రియం బ్రూయాత్ – న బ్రూయాత్ సత్యమప్రియం– అని అంటుంటారు. అంటే సత్యాన్ని చెప్పాలి. ప్రియమైనదాన్ని పలుకాలి, అప్రియమైన సత్యాన్ని పలుకరాదు అని అర్థం. కానీ అత్యుత్తముడైన రామకృష్ణ పరమహంస కొన్ని సందర్భాలలో అప్రియమైన సత్యాన్నే చెప్పేవారు. కొన్ని సందర్భాలలో కఠినమైన మాటలే శ్రేయస్సును కల్గిస్తాయి.

పరమహంస ఒక రోజు సురేంద్రతో జయగోపాల్ సేన్ గురించి ఇలా చెప్పాడు– ‘జయగోపాల్ సేన్ సంపన్నుడు. అతడు దాన ధర్మాలు చేయాలి... ఆ రోజు జయగోపాల్ ఇక్కడకు గుర్రబ్బండిలో వచ్చాడు. బండిలోని లాంతరు పగిలి పోయి ఉంది. గుర్రం శ్మశానం నుంచి తప్పించుకొని బతికి వచ్చినట్లు ఉంది. బండి తోలేవాడు అప్పుడే మెడికల్ కళాశాల ఆస్పత్రి నుంచి బయటపడ్డ వ్యక్తిలా ఉన్నాడు. అతడు ఇక్కడకు తీసుకొచ్చింది కుళ్లిన రెండు దానిమ్మ పళ్ళు!’



జ్యోతిర్మయం

ఒక వ్యక్తి లేనప్పుడు ఆ వ్యక్తిని గూర్చి చెడుగా మాట్లాడరాదనేది రామకృష్ణునికి తెలీకనా? ఆ వ్యక్తి ఉన్నా కపటం లేని రామకృష్ణుడు పిసినారితనం పనికి రాదనీ; గుర్రాన్నీ, బండి తోలేవాడిని కూడా ఇంకా బాగా చూసుకొమ్మని చెప్పి ఉండేవాడు. ఎదురుగా కూర్చొన్న సురేంద్రతోనే, ‘నువ్వు నీ కార్యాలయంలో అబద్ధాలు చెబుతుంటావు. అలాంటప్పుడు నువ్వు సమర్పించే ఆహారాన్ని నేను ఎందుకు తింటానో తెలుసా? నువ్వు దానధర్మాలు చేస్తుంటావు కాబట్టి. నేను పిసినారులు సమర్పించే వాటిని తినలేను. వారి సొమ్ము వ్యాజ్యాలలోను, దొంగల పాలవడంలోను, వైద్యం నిమిత్తం అయ్యే ఖర్చులకూ... ఇలా పలు రకాలుగా వ్యర్థమైపోతుంది. చివరకు తప్పుదారి పట్టిన పిల్లలు ఉన్న డబ్బంతా నాశనం చేస్తారు’ (పుట 233– శ్రీరామకృష్ణ లీలామృతం) అని అన్నారు. కాబట్టి ఎవరైనా మన బంధు, మిత్రులు అన్యాయంగా సంపాదిస్తూ పిల్లికి భిక్షం పెట్టకుండా ఉంటే... వారిని దానధర్మాలు చేయమని చెప్పాలి. రామకృష్ణుని జీవితం నుంచి మనం నేర్చుకొని, ఆచరించవలసినది ఇదే!

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం: దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** బ.పాడ్యమి ప.2.41 వరకు; తదుపరి విదియ, **నక్షత్రం:** శ్రవణం రా.12.58 వరకు; తదుపరి ధనిష్ఠ; **వర్జ్యం:** తె.4.46 నుండి 6.17 వరకు (తెల్లవారితే మంగళవారం); **దుర్ముహూర్తం:** ప.12.31 నుండి 1.23 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.58 వరకు; **అమృత ఘడియలు:** ప.2.56 నుండి 4.24 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 5.39; **సూర్యాస్తమయం:** 6.33

రావును రప్పించగలరా?

అమెరికాలో తలదాచుకున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు
అక్రమ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఈయనే అత్యంత కీలకం
వెనక్కు రప్పించడానికి అధికారుల ప్రయత్నాలు
బ్లూ కార్నర్ నోటీసు జారీ అయినా డిపోర్టేషన్ ప్రక్రియ ప్రహసనమే

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక సూత్రధారిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావును అమెరికా నుంచి వెనక్కు రప్పించడం అంత తేలిక కాదని తెలుస్తోంది. ఆయన వైద్యపరమైన కారణాలతో ఆ దేశంలో ఉండటం, ఇంటర్‌పోల్ కేవలం బ్లూకార్నర్ నోటీసు మాత్రమే జారీ చేసే అవకాశం ఉండటంతో దర్యాప్తు అధికారులు ఆయన డిపోర్టేషన్ (బలవంతంగా రప్పించడం) పై మల్లగుల్లాలు పడుతున్నారు. సుదీర్ఘకాలం ఎస్ఐబీ చీఫ్‌గా వ్యవహరించిన ప్రభాకర్‌రావు గత డిసెంబర్ 4న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను చూసి రాజీనామా చేశారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు, తదితర పరిణామాలను గమనించిన ఆయన తిరుపతికి ప్రయాణమై కనీసం కుటుంబీకులకు కూడా చెప్పకుండా అటు నుంచే చెన్నై మీదుగా అమెరికా వెళ్లిపోయారు. ప్రస్తుతం ఆయన టెక్సాస్‌లో వైద్యం చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. గత నెల 12న ప్రభాకర్‌రావు కుమారుడిని విచారించిన పోలీసులు ఆయన తిరిగి ఎప్పుడు వస్తారని ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రభాకర్‌రావు ఇటీవల ఈ–మెయిల్ ద్వారా దర్యాప్తు అధికారికి లేఖ రాశారు. జూన్ నాటికి పూర్తిగా కోలుకుని తిరిగి వచ్చేస్తానని భావించానని, నిరాధార ఆరోపణలతో కలిగిన మానసిక వేదన కారణంగా ఆరోగ్యం మరింత క్షీణించిందని ఆ లేఖలో పేర్కొన్నారు.

బ్లూ కార్నర్ నోటీసు జారీ అయినప్పటికీ...

హైదరాబాద్ పోలీసులు ప్రభాకర్‌రావుపై తొలుత ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసు జారీ చేయించాలని భావించారు. అయితే ఆ విభాగం దృష్టిలో ఈ కేసు అంత తీవ్రమైంది కాదనే ఉద్దేశంతో బ్లూ కార్నర్ నోటీసుల జారీ కోసం సీబీఐని ఆశ్రయించారు. ఇవి జారీ అయినా ఇంటర్‌పోల్ ప్రభాకర్‌రావు ఆచూకీ కనిపెట్టి, ఆయన కదలికలపై నిఘా ఉంచుతుంది తప్ప బలవంతంగా తిప్పి పంపదు. ఒకవేళ ఏదో ఒకవిధంగా డిపోర్టేషన్ ఉత్తర్వులు పొందినా.. అవి అమెరికా న్యాయవ్యవస్థ ఆమోదం పొందాలి. అమెరికా న్యాయవ్యవస్థ వద్ద వెయ్యికి పైగా వివిధ నోటీసులు పెండింగ్‌లో ఉండగా.. ఇప్పటివరకు కేవలం 56 నోటీసుల అమలుకే అనుమతి ఇచ్చింది. అమెరికా వంటి దేశాల్లో వ్యక్తుల ప్రాణాలు, ఆరోగ్యానికి విలువ ఎక్కువ. ప్రభాకర్‌రావు అక్కడ మెడికల్ గ్రౌండ్స్‌పై ఉంటున్నందున ఆయనపై నోటీసు జారీ అయినా డిపోర్టేషన్‌కు అనుమతించే అవకాశాలు చాలా తక్కువే.



వీసా గడువులో మతలబులు ఎన్నో...

తరచూ అమెరికాకు వెళ్లి వస్తున్న ఆయా వ్యక్తుల కుటుంబీకులు, అక్కడే ఉంటున్న ప్రభాకర్‌రావు వంటి వారికి సాధారణంగా 10 నుంచి 15 ఏళ్ల గడువుతో కూడిన వీసాలు లభిస్తుంటాయి. అయితే ఒకసారి ఆ దేశంలో అడుగుపెట్టిన తర్వాత గరిష్ఠంగా 180 రోజులలోపు తిరిగి బయటకు వచ్చేయాలనే నిబంధన ఉంది. దీంతో ప్రస్తుతం ఆయన 179 రోజులు అక్కడ ఉండి, ఆపై కెనడా లేదా మరో దేశానికి కొన్ని రోజులు వెళ్లి వస్తే.. మళ్లీ 179 రోజులు అమెరికాలో ఉండే అవకాశం దక్కుతుంది. ప్రభాకర్‌రావు వైద్యం చేయించుకుంటున్న నేపథ్యంలో వీసా గడువు తేలిగ్గా పొడిగించుకునే అవకాశం ఉంది. రీజనల్ పాస్‌పోర్టు కార్యాలయం ద్వారా ఆయన పాస్‌పోర్టు రద్దుకు ప్రయత్నాలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. అయితే ఇది కూడా ఆశించిన ఫలితం ఇవ్వదని కొందరు నిపుణులు చెబుతున్నారు.

7న అమృత్ సర్‌లో జాతీయ ఓబీసీ మహాసభలు

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



ఓబీసీ మహాసభల వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

హిమాయత్‌నగర్: మండల్ కమిషన్ కృషి వల్ల ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించిన రోజైన ఆగస్టు 7న పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో 9వ అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభలను నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న ఓబీసీల సమస్యలపై, రాజకీయ భవిష్యత్తుపై ఆ మహాసభలలో తీర్మానం చేస్తామని ఆయన వెల్లడించారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో విలేకరుల సమావేశంలో 9వ జాతీయ ఓబీసీ మహాసభల 'హలో బీసీ చలో అమృత్‌సర్'వాల్ పోస్టర్‌ను సంఘం నేతలతో కలిసి జాజుల ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఓబీసీలకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి, బడ్జెట్‌లో 50% నిధులు కేటాయించాలన్నారు. వేలాదిమందితో నిర్వహించే ఈ సభలలో పార్టీలకతీతంగా ఓబీసీ ఎంపీలు, ప్రజాప్రతినిధులు, 29 రాష్ట్రాల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని జాజుల కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో శ్రీచైతన్య ప్రతిభ



మ్యాథ్స్ ఒలింపియాడ్ జట్టుకు ఎక్స్‌లో ప్రధాని మోదీ అభినందనల సందేశం

హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా ఎన్నో వేల మంది ప్రతిభ గల విద్యార్థులు పోటీపడే ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్–24లో భారత జట్టు అద్భుత ప్రతిభా పాటవాలు ప్రదర్శించి ప్రపంచవ్యాప్తంగా నాలుగోస్థానంలో నిలిచిందని శ్రీచైతన్య టెక్నో స్కూల్ వెల్లడించింది. భారత్‌కు చెందిన ఆరుగురు సభ్యుల విద్యార్థి బృందం నాలుగు బంగారు పతకాలు, ఒక రజత పతకంతో నాలుగో స్థానంలో నిలిచింది. ఈ ఆరుగురు బృందంలో శ్రీచైతన్య టెక్నో స్కూల్ బావదాన్ పుణేకు చెందిన విద్యార్థి ఎం.వి.ఆదిత్య అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడని సంస్థ తెలిపింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బాత్‌లో ఇటీవల ముగిసిన 65వ ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ఈ అరుదైన గౌరవం దక్కింది. ఈ చారిత్రాత్మక విజయం సాధించిన విద్యార్థి ఆదిత్య మాంగుడిని ప్రధాని నరేంద్రమోదీ 'ఎక్స్'వేదికగా అభినందించారు. ఈ విజయం సాధించిన ఆరుగురు విద్యార్థులకు శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ, శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ అభినందనలు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సత్వరంగా చేపట్టాలని, ఏఈల నియామకం పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ..విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు విజ్ఞప్తి చేసింది. రామగుండం–బీ థర్మల్ విద్యుత్ కేంద్రం స్థానంలో కొత్త విద్యుత్ కేంద్రాన్ని జెన్‌కో ఆధ్వర్యంలోనే నిర్మించాలని కోరింది. అసోసియేషన్ నేత పి.రత్నాకర్‌రావు నేతృత్వంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో చర్చించి పలు తీర్మానాలు చేశారు. త్వరలో అసోసియేషన్ ఎన్నికలు జరపాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో రివర్షన్‌కు గురైన ఉద్యోగులకు మళ్లీ పాత హోదాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ.వెంకటనారాయణ రెడ్డి, సెక్రటరీ జనరల్ పి.సదానందం, అడిషనల్ సెక్రటరీ జనరల్ కె.అంజయ్య, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల కట్టడికి యువరక్తం!

ఐబీని బలోపేతం చేయాలన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

- యువ అధికారులను ఎంపిక చేసుకోవాలని మ్యాక్‌కు సూచన
- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ టూల్స్‌కు ప్రాధాన్యం
- 'మ్యాక్' సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్న ఏజెన్సీలు
- ఇతర మెట్రోలతోపాటు హైదరాబాద్‌కు కలిసిరానున్న ఈ నిర్ణయాలు



మ్యాక్ సమావేశంలో మాట్లాడుతున్న అమిత్ షా

సాక్షి, హైదరాబాద్: ఉగ్రవాదులపై నిఘా పెట్టడంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పాత్ర అత్యంత కీలకం. దేశంలోని అనేక నగరాలతోపాటు హైదరాబాద్‌లోనూ ముష్కరమూకల కుట్రలను తిప్పికొట్టడంలో ఐబీ తన మార్కు చూపించింది. ప్రస్తుతం నెలకొన్న పరిణామాలు, 'ఆన్‌లైన్ ఉగ్రవాదం' నేపథ్యంలో ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని కేంద్రం నిర్ణయించింది. తాజాగా ఢిల్లీలో జరిగిన మల్టీ ఏజెన్సీ కమిటీ (మ్యాక్) సమావేశంలో దీనికి సంబంధించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కీలక ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర పరిధిలో ఉన్న వివిధ ఏజెన్సీల అధినేతలు ఈ ఉన్నతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఐబీ వంటి నిఘా విభాగాల్లో అనుభవానికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని ఆపరేషన్లు సక్సెస్ కావడం అనేది అందులో పనిచేసిన వారి అనుభవం మీదే ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న అనుభవజ్ఞులకు తోడు సాంకేతిక సవాళ్లను ఎదుర్కోవడానికి యువ అధికారులను ఎంపిక చేయాలని నిర్ణయించారు.

టెర్రర్ రిక్రూట్‌మెంట్‌లో పంథా మారింది

పుష్కరకాలంగా ఉగ్రవాదుల పంథా పూర్తిగా మారింది. ఒకప్పుడు దేశంలో విధ్వంసాలు సృష్టించడానికి అవసరమైన వారిని రిక్రూట్ చేసుకోవడానికి పాకిస్తాన్ నుంచి ఏజెంట్లు వచ్చేవారు. 1998లో హైదరాబాద్ పాతబస్తీలో పట్టుబడిన మహ్మద్ సలీం జునైద్ ఆ కోవకు చెందినవాడే. ఇలా అనేకమంది ఏజెంట్లు పట్టుబడ్డారు. యువతను ఆకర్షించి, సరిహద్దులు దాటించి, శిక్షణ ఇచ్చి, తిప్పి పంపడంతోపాటు పేలుడు పదార్థాలు సైతం సరిహద్దు ఆవలి నుంచే పంపడంలో ఈ ఏజెంట్లు కీలకంగా వ్యవహరించేవారు. అయితే దశాబ్దకాలంగా ఉగ్రమూకలు అప్‌డేట్ అయ్యాయి. యవతను ఆకర్షించి రిక్రూట్ చేసుకోవడం, వారిని ప్రేరేపించడం, శిక్షణ ఇవ్వడం, స్థానికంగా పేలుడు పదార్థాలు సమీకరించుకునే మార్గాలు సూచించడం... ఇవన్నీ ఆన్‌లైన్‌లోనే సాగుతున్నాయి. ప్రధానంగా ఐసిస్ ప్రాబల్యం పెరిగిన తర్వాత ఈ ధోరణి మరింత పెరిగింది. దీనికోసం ముష్కరమూకలు వివిధ రకాలైన సోషల్‌మీడియా ప్లాట్‌ఫామ్స్‌తో పాటు డార్క్ వెబ్ వాడుతున్నాయి. హైదరాబాద్‌లో పట్టుబడిన అనేక మంది ఉగ్రవాదులు ఇదే అంశాన్ని స్పష్టం చేశారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే వారికి చెక్ చెప్పేలా...

హైటెక్ ఉగ్రవాదులకు సాంకేతిక పరిజ్ఞానం వినియోగించడం ద్వారానే చెక్ చెప్పవచ్చని కేంద్రం నిర్ణయించింది. ఇదే అంశాన్ని శుక్రవారంనాటి మ్యాక్ సమావేశంలో అమిత్‌షా స్పష్టం చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తోపాటు మిషన్ లెర్నింగ్ టూల్స్ వినియోగించడం ద్వారా ఉగ్రవాదులు, వారి కార్యకలాపాలపై పటిష్ట నిఘా ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. దీనికోసం ఆ విభాగంలో ప్రస్తుతం ఉన్న అధికారులకు తోడు సాంకేతిక పరిజ్ఞానంపై పట్టున్న యువకులను ఎంపిక చేసుకొని బృందాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉగ్రవాదుల కంటే ఒక అడుగు ముందు ఉండటానికి ఇది అవసరమని అమిత్‌షా అభిప్రాయపడ్డారు. ఏ మాత్రం కాలయాపనకు ఆస్కారం ఇవ్వకుండా వీలైనంత త్వరగా ఈ సంస్కరణలను అమలులోకి తీసుకురావాలని అమిత్‌షా స్పష్టం చేశారు. ఈ నిర్ణయాలు నిత్యం ముష్కరుల టార్గెట్‌లో ఉండే హైదరాబాద్ సహా అనేక మెట్రో నగరాలకు కలిసి వచ్చే అంశమని ఓ ఉన్నతాధికారి 'సాక్షి'తో అన్నారు.

కులవృత్తిదారులను పాలకులు ఆదుకోవాలి

- హక్కుల సాధన కోసం విశ్వబ్రాహ్మణులు ఐక్యంగా పోరాడాలి
- ఎంపీలు ఈటల, ఆర్ కృష్ణయ్య పిలుపు
- కమ్మరి, వడ్రంగి కులవృత్తుల సమస్యలపై మహాధర్నా



మహాధర్నాలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో జాజుల, మధుసూదనాచారి తదితరులు

కవాడిగూడ: కమ్మరి, వడ్రంగి కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్నవారిని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని పలు వురు వక్తలు డిమాండ్ చేశారు. వారి హక్కుల కోసం తెలంగాణ వ్యాప్తంగా ఉన్న విశ్వబ్రాహ్మణులు ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకోజు కృష్ణమాచార్య ఆధ్వర్యంలో కమ్మరి, వడ్రంగి కులవృత్తుల సమస్యలపై మహాధర్నా చేపట్టారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, తెలంగాణ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పీఎం విశ్వకర్మ యోజన పథకం ద్వారా కమ్మరి, వడ్రంగి సామాజిక వర్గాలకు అధిక ప్రాధాన్యత కల్పించేందుకు తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ... విశ్వ బ్రాహ్మణ కులాల అభివృద్ధికోసం బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్సీ మధుసూదనాచారి మాట్లాడుతూ... కమ్మరి, వడ్రంగి కులవృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న 50శాతం ఉచిత కరెంటును పూర్తిగా ఉచితంగా అమలు చేయాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షు డు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. కమ్మరి, వడ్రంగి చేతివృత్తిదారులకు టెక్నాలజీతో కూడిన పనిముట్లను అందజేయాలని, జిల్లా బీసీ వెల్ఫేర్ శాఖద్వారా ప్రతి కుటుంబానికి రైతు బీమా తరహాలో విశ్వబ్రహ్మణ బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ భూములలో టేకు, జిట్రేగి చెట్ల పెంపు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం ప్రధాన కార్యదర్శి రాళ్లబండి విష్ణుచారి, కోశాధికారి తాటికొండ శ్రీరాములు చారి, తెలంగాణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేముల వాడ మదన్ మోహన్, బీసీ ఐక్యకులాల వేదిక చైర్మన్ కుందారపు గణేష్ చారి పాల్గొన్నారు.

ఓడినా సంబురాలు చేసుకున్న పార్టీ కాంగ్రెస్

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఎద్దేవా
- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని దేశవ్యతిరేక శక్తులు కుట్రపన్నాయి
- అయినా ప్రజలు మూడోసారి మా పార్టీని గెలిపించారు



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

పంజగుట్ట (హైదరాబాద్): గత పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యతిరేక శక్తులు బీజేపీని అధికారంలోకి రాకుండా చేసేందుకు కుట్రలు పన్నాయని, కానీ ప్రజలు ఆ శక్తుల కుట్రలను తిప్పికొట్టి బీజేపీని మూడోసారి అధికారంలోకి తీసుకువచ్చారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సోమాజిగూడలోని జయాగార్డెన్స్‌లో బీజేపీ సికింద్రాబాద్ సెంట్రల్ జిల్లా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారం, ఎన్నికలతో సంబంధం లేకుండా ముందుకు వెళ్లే పార్టీ బీజేపీ అని అన్నారు. నెహ్రూ తరువాత వరుసగా మూడోసారి ప్రధాని అయిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు కూడా సాధించలేదని, కానీ రాహుల్ గాంధీ ప్రధాని అయినట్లు ఆ పార్టీ నాయకులు ఊహాగానాల్లో తేలిపోయారని, ఎన్నికల్లో ఓడిపోయి కూడా సంబురాలు చేసుకున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని ఎద్దేవా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు.. రాజ్యాంగాన్ని మారుస్తారు, రిజర్వేషన్లు తొలగిస్తారు అని తప్పుడు ప్రచారాలు చేశారని గుర్తు చేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌ను పలు మార్లు అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదే అని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కుటుంబ పాలన వస్తుందని, ఉగ్రవాదం, అవినీతి పెరిగిపోతాయని ప్రజలు గ్రహించారని, అందుకే బీజేపీని మూడోసారి గెలిపించారని పేర్కొన్నారు. లోక్‌సభ కార్యకలాపాలు జరగకుండా అడ్డుకోవడం, రాజ్యాంగం గురించి తప్పుడు ప్రచారం చెయ్యడమే లక్ష్యంగా కాంగ్రెస్ పనిచేస్తుందన్న విషయాన్ని ప్రజలు గ్రహించాలని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, పార్టీ నేతలు ఆనంద్ గౌడ్, ఎస్.వి.సుభాష్, శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూసీ సుందరీకరణకు రూ.1.50లక్షల కోట్ల ఖర్చా?

- అనూహ్యంగా అంచనాలు ఎందుకు పెంచారు?
- పాలమూరు కంటే మూసీకి ఎందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు?: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: మూసీ సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనల పట్ల బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కె.టి.రామారావు ఆందోళన వ్యక్తం చేశా రు. ఈ ప్రాజెక్టు వ్యయాలు అనూహ్యంగా పెరిగాయని, రూ.50వేల కోట్లని, ఆ తర్వాత రూ.70వేల కోట్లని సవరించిన ప్రాజెక్టుకు ఇప్పుడు రూ.1.50లక్షల కోట్లు ప్రతిపాదించారని, దీనిపై ప్రజల్లో సందేహాలు తలెత్తుతున్నాయని ఆదివారం 'ఎక్స్'వేదికగా ఆయన వెల్లడించారు. మూసీ ప్రాజెక్టు వల్ల ఎంతమంది రైతులకు లబ్ధి చేకూరుతుంది? నిల్వ సామర్థ్యం ఎంత? ఎన్ని ఎకరాలకు సాగునీరు వస్తుంది? పంట దిగుబడి ఎంత పెరుగుతుంది? ఏ పారిశ్రామిక అవసరాలు తీరుతాయి? కొత్తగా ఎన్ని భారీ రిజర్వాయర్లు నిర్మిస్తారు? పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు కంటే మూసీ ప్రాజెక్టుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాధాన్యత ఎందుకిస్తున్నారు అని ప్రశ్నలు సంధించారు. తక్కువ బడ్జెట్, శ్రమతో పూర్తి చేయగల ఇతర నీటిపారుదల ప్రాజెక్టులను వదిలిపెట్టి మూసీని లండన్ యొక్క థేమ్స్ నదికి సమానమైన నదిగా మార్చడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. మూసీ అంచనా వ్యయం మూడు రెట్లు పెరగడం ఆర్థిక అవకతవకలకు నిదర్శనమని, మూసీ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయాలే కానీ, అవినీతి, నిధుల దుర్వినియోగాన్ని మాత్రం సహించేది లేదని తేల్చిచెప్పారు. మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధిపై తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉందని, నిధులను అపహరించాలనే ఎలాంటి ప్రయత్నమైనా తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

సినారె పురస్కారానికి యాకూబ్



యాకూబ్

సుల్తాన్‌బజార్(హైదరాబాద్): తెలంగాణ సారస్వత పరిషత్తు ఏటా ప్రదానం చేసే డాక్టర్ సి.నారాయణరెడ్డి సాహితీ పురస్కారానికి ఈసారి కవి డాక్టర్ యాకూబ్ ఎంపికయ్యారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ లోని సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి 93వ జయంతి సందర్భంగా పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురస్కారం కింద రూ.25 వేలు, జ్ఞాపిక, శాలువాతో యాకూబ్‌ను సత్కరించనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా, ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న, డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి, మంత్రి రామారావులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని వెల్లడించారు.

ఈ ముగ్గురి మరణం.. మిస్టరీ

బాత్‌రూమ్‌లో నిర్జీవంగా కొడుకుతో సహా భార్యా భర్తలు



వెంకటేష్, మాధవి, హరికృష్ణ (ఫైల్). (ఇన్‌సెట్‌లో) మృతదేహాలు

సనత్‌నగర్(హైదరాబాద్): ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు బాత్‌రూంలో నిర్జీవంగా పడి ఉండటం కలకలం రేపింది. మానసిక స్థితి సరిగా లేని కుమారుడికి స్నానం చేయించేందుకు బాత్‌రూమ్‌లోకి వెళ్లిన భార్యభర్తలు.. కొడుకుతో సహా విగతజీవులుగా మారడం సంచలనం రేకెత్తించింది. అయితే వీరు విద్యుదాఘాతానికి గురయ్యారా? లేక కొడుకు మానసిక పరిస్థితి తట్టుకోలేక మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడ్డారా.. ? అనేది మిస్టరీగా మారింది. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జెక్‌కాలనీలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా.. జెక్ కాలనీ నాల్గో వీధిలోని ఆకృతి ప్రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ ఫ్లాట్ నంబర్ 204లో ఆర్.వెంకటేష్ (59), భార్య మాధవి (52), కుమారుడు హరికృష్ణ (25) నివాసం ఉంటున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వెంకటేష్ బంజారాహిల్స్ రోడ్డునెంబర్–2లోని సిగ్నోడ్ ట్రాన్సిట్ ప్యాకేజింగ్ సొల్యూషన్స్‌లో బిజినెస్ యూనిట్ హెడ్‌గా పనిచేస్తున్నాడు. 2004 నుంచి జెక్‌కాలనీలోనే నివాసముంటున్నారు. కుమారుడు హరికృష్ణ మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో దగ్గరుండి తల్లిదండ్రులే అతని బాగోగులు చూసుకుంటున్నారు. ప్రతిరోజూ వారే కుమారుడికి స్నానం చేయిస్తుంటారు. ఈ క్రమంలోనే ఆదివారం ముగ్గురూ బాత్‌రూంలో మృత్యువాత పడగా, వారి మృతికి కారణం ఏమై ఉంటుందా? అన్నది మిస్టరీగానే ఉంది. బాత్‌రూమ్‌లో గ్యాస్ ఆధారిత గీజర్ ఉండటంతో షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. బాత్‌రూమ్ డోర్ క్లోజ్ చేసి ఉండడాన్ని బట్టి చూస్తే ముగ్గురూ ఒకేసారి బాత్‌రూమ్‌లోకి వెళ్లారని తెలుస్తోంది.

ఇలా వెలుగులోకి వచ్చింది..

ఇంట్లో పనిచేసే వరలక్ష్మి ఉదయం 11.30 గంటలకు వచ్చి ఇంట్లో ఎవరూ కనిపించకపోవడంతో ముగ్గురూ బయటకు వెళ్లి ఉంటారేమోనని భావించి యధావిధిగా క్లీన్ చేసి వెళ్లిపోయింది. బాత్‌రూమ్ డోర్ ఓపెన్ చేసి లేకపోవడంతో అటువైపు ఆమె వెళ్లలేదు. తిరిగి సాయంత్రం 4 గంటలకు వరలక్ష్మి మళ్ళీ రాగా..పాల ప్యాకెట్, ఉదయం తాను చూసిన ఇతరత్రా వస్తువులు అలాగే ఉండడాన్ని చూసి ఇంకా వారు రాలేదేమోనని వెళ్లిపోయింది. సాయంత్రం 6 గంటలకు తోటి పనిమనిషి విజయలక్ష్మితో కలిసి మళ్లీ వచ్చింది. అయితే అనుమానం వచ్చిన వారికి వాచ్‌మన్ సత్యనారాయణను పిలిచి బాత్‌రూమ్ డోర్ తెరిచేందుకు ప్రయత్నించగా డోర్‌కు అడ్డంగా హరికృష్ణ బట్టలు లేకుండా పడిఉన్నాడు. ఆ పక్కనే వెంకటేష్, మాధవి మృతదేహాలు పడి ఉన్నాయి. స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం అందించగా క్లూస్ టీమ్‌తో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ముగ్గురి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కవితతో కేటీఆర్ ములాఖత్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణంపై సీబీఐ నమోదు చేసిన కేసులో తనకు డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం రౌస్ ఎవెన్యూ కోర్టు విచారణ చేపట్టనుంది. ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపై కోర్టు విచారించనుంది. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం ఢిల్లీకి చేరుకున్నారు. సోమవారం కవితతో ములాఖత్ కానున్న నేపథ్యంలో.. ఆమె కేసును వాదిస్తున్న న్యాయవాదులతో ఆదివారం రాత్రి భేటీ అయి బెయిల్ అంశంపై చర్చించినట్లు తెలిసింది. పార్టీ ఫిరాయింపులపైనా సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తున్నట్లు ఇప్పటికే కేటీఆర్ ప్రకటించడం తెలిసిందే. గతంలో ఇతర రాష్ట్రాల్లో ఎమ్మెల్యేల అనర్హత కోసం సుప్రీంకోర్టులో వాదించిన న్యాయవాదులతోనూ కేటీఆర్ సోమవారం భేటీ కానున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు కోసం హైకోర్టు, స్పీకర్‌తో పాటు తెలంగాణ గవర్నర్‌ను బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు కలవడం తెలిసిందే.

కార్టూన్లు, కార్టూనిస్టులను కాపాడుకోవాలి

- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి




నర్సింకు కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డు 2024 అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి . చిత్రంలో విమలక్క, కార్టూనిస్ట్ శంకర్ తదితరులు

పంజగుట్ట(హైదరాబాద్): కార్టూన్ వృత్తి అంతరించిపోయే ప్రమాదముందని, కార్టూన్లు, కార్టూనిస్టులను కాపాడుకోవాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కార్టూనిస్టు శేఖర్ మెమోరియల్ అవార్డు –2024 ప్రదానోత్సవ సభ ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాస్‌రెడ్డి హాజరై కార్టూనిస్టు పి.నర్సింకు శేఖర్ మెమోరియల్ అవార్డు–2024 ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఒక పొలిటికల్ కార్టూన్‌లో వ్యంగ్యం, హాస్యం, ఎన్నో పలికించవచ్చని తెలిపారు. కార్టూనిస్ట్ శేఖర్ పేరుమీద ప్రభుత్వం ఒక అవార్డు ప్రకటించాలని కార్టునిస్టులు ప్రతిపాదించగా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంపాదకులు వీరయ్య, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమల, సాక్షి కార్టూనిస్టు శంకర్, బార్‌కౌన్సిల్ సభ్యుడు చలకాని వెంకట్‌యాదవ్, కూరెళ్ల శ్రీనివాస్, శేఖర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అమెరికా అధ్యక్ష రేసు నుంచి బైడెన్ ఔట్

పోటీ నుంచి వైదొలుగుతున్నానని ప్రకటన ● దేశ ప్రయోజనాల కోసమే ఈ నిర్ణయమని వెల్లడి ● కమలా హ్యారిస్ అభ్యర్థిత్వానికి మద్దతు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తాను వైదొలుగుతున్నానని డెమొక్రటిక్ పార్టీ నేత, ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం రాత్రి (భారత కాలమాన ప్రకారం) 'ఎక్స్' ఖాతాలో ఒక లేఖను పోస్టు చేశారు. దేశ ప్రయోజనాల కోసం, తమ పార్టీ ప్రయోజనాల కోసమే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తేల్చిచెప్పారు. గత మూడున్నరేళ్లలో ఒక దేశంగా మనం గొప్ప ముందడుగు వేశామని అమెరికా ప్రజలను ఉద్దేశించి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో అమెరికా అత్యంత శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థగా మారిందన్నారు. ఎన్నో ఘనతలు సాధించామని తెలిపారు. అమెరికా అధ్యక్షుడిగా ప్రజలకు ఇప్పటిదాకా సేవలందించడం అతి గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. మరోసారి పోటీ చేయాలన్న ఆలోచన లేదని, అధ్యక్షుడిగా మిగిలిన పదవీ కాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యతలపై దృష్టి పెడతానని పేర్కొన్నారు. వచ్చే వారం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తానని, తన నిర్ణయాన్ని పూర్తిగా తెలియజేస్తానని వెల్లడించారు. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్‌కు బైడెన్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆమె అసాధారణమైన భాగస్వామి అని ప్రశంసల వర్షం కురిపించారు. అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా భారతీయ అమెరికన్ మహిళ కమలా హ్యారిస్ అభ్యర్థిత్వాన్ని బైడెన్ బలపరిచారు. ఇదిలా ఉండగా ఎన్నికల్లో ట్రంప్‌ను ఓడించటానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎన్నికల్లో పోటీ చేయడం తథ్యమని ఇన్నాళ్లూ చెబుతూ వచ్చిన బైడెన్ అనూహ్యంగా వైదొలగడం చర్చనీయాంశంగా మారింది. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌తో గత నెలలో జరిగిన డిబేట్‌లో బైడెన్ తడబడిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా వయసు కారణంగా మతిమరుపు సమస్యను ఎదుర్కొంటున్నారు. దీంతో ఎన్నికల పోటీ నుంచి తప్పుకోవాలంటూ బైడెన్‌పై సొంత పార్టీ నాయకులు ఒత్తిడి పెంచారు. అందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ముంచిన డిబేట్

సీఎన్ఎన్ ఛానల్ వేదికగా జూన్ 27న డొనాల్డ్ ట్రంప్– జో బైడెన్‌ల మధ్య తొలి అధ్యక్ష చర్చ జరిగింది. ఈ చర్చలో బైడెన్ పదేపదే తడబడటం, మాటల కోసం తడుముకోవడం, మతిమరుపుతో పేలవ ప్రదర్శన కనబరిచారు. దాంతో 81 ఏళ్ల బైడెన్ మానసిక ఆరోగ్యంపై అమెరికన్లలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. సొంత డెమొక్రాటిక్ పార్టీలోనూ ఆయన సామర్థ్యంపై సందేహాలు తీవ్రమయ్యాయి. ట్రంప్‌ను బైడెన్ ఓడించలేడనే బలమైన అభిప్రాయం పార్టీలో నెలకొంది. ప్రతినిధుల సభ మాజీ స్పీకర్ నాన్సీ పెలోసీ... బైడెన్‌తో మాట్లాడుతూ డెమొక్రాటిక్ పార్టీ ప్రయోజనాల దృష్ట్యా అధ్యక్ష రేసు నుంచి తప్పుకోవడమే మేలని కుండబద్దలు కొట్టారు. ప్రతినిధుల సభ, సెనేట్‌లలోనూ డెమొక్రాట్లకు అపజయాలు ఎదురవుతాయని హెచ్చరించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా సైతం పలువురు డెమొక్రాటిక్ కీలక నాయకులతో ప్రైవేటు సంభాషణల్లో బైడెన్ వైదొలిగితేనే ట్రంప్‌ను ఓడించే అవకాశాలుంటాయని చెప్పారు. ఐదుగురు చట్టసభ సభ్యులు బైడెన్ వైదొలగాలని బాహాటంగానే డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా డెమొక్రాటిక్ పార్టీకి విరాళాలు ఇస్తున్న దాతలు.. బైడెన్ తప్పుకోవాలని షరతు పెడుతూ విరాళాలను నిలిపివేశారు. దాంతో నాన్సీ పెలోసీ రంగంలోకి దిగి తెరవెనుక పెద్ద ఎత్తున లాబీయింగ్ చేశారు. బైడెన్ శిబిరానికి వాస్తవాన్ని తెలియజెప్పారు. అన్నివైపులా నుంచి ఒత్తిడి పెరిగిపోవడంతో కోవిడ్‌తో డెలావెర్‌లోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న బైడెన్ ఆదివారం అర్ధరాత్రి (భారత కాలమానం ప్రకారం) అధ్యక్ష రేసు నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించారు. **- సాక్షి, నేషనల్ డెస్క్**

ఇప్పుడేంటి?

ఓపెన్ కన్వెన్షన్.. కమలకు ఛాన్స్

బైడెన్ అధ్యక్ష రేసు నుంచి వైదొలగడంతో నవంబరు 5 జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి ఎవరవుతారనే ఆసక్తి నెలకొంది. ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు మొగ్గు కనపడుతున్నా.. పార్టీ నిబంధనావళి ప్రకారం ఓపెన్ కన్వెన్షన్ (ఎవరైనా పోటీపడవచ్చు) జరుగుతుంది. డెమొక్రాటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకోవడానికి రాష్ట్రాల వారీగా నిర్వహించిన ప్రైమరీల్లో బైడెన్ తిరుగులేని మెజారిటీని కూడగట్టుకున్నారు. 4,000 పైచిలుకు డెలిగేట్లలో 3,900 మంది డెలిగేట్లను బైడెన్ గెల్చుకున్నారు. నిబంధనల ప్రకారం ఆగస్టులో అధ్యక్ష అభ్యర్థిని ఖరారు చేయడానికి జరిగే జాతీయ కన్వెన్షన్‌లో వీరిందరూ బైడెన్‌కు బద్ధులై ఉండాలి. ఇప్పుడాయనే స్వయంగా రేసు నుంచి వైదొలిగారు కాబట్టి.. డెమొక్రాటిక్ టికెట్ కోసం పార్టీ సభ్యులెవరైనా పోటీపడొచ్చు. దీన్నే ఓపెన్ కన్వెన్షన్ అంటారు. కమలా హారిస్‌కు అవకాశాలు మెరుగ్గా ఉన్నా.. డెమొక్రాటిక్ పార్టీలోని ముఖ్యనేతలైన కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్, మిషిగాన్ గవర్నర్ గ్రెట్చెన్ విట్మర్‌లు ఆమెకు ప్రధాన పోటీదారులుగా ఉంటారని భావిస్తున్నారు. నామినేషన్ జాబితాలో పేరు లేనప్పటికీ డెలిగేట్లు తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే వీలు కూడా ఉంది. నాలుగు వేల పైచిలుకు డెలిగేట్లు ఆగస్టులో తమ తదుపరి అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకుంటారు. తొలిరౌండ్‌లో ఫలితం తేలకపోతే 700 మంది సూపర్ డెలిగేట్లను ఓటు వేయడానికి అనుమతిస్తారు. డెమొక్రాటిక్ నామినీ ఎన్నికయ్యేదాకా ఓటింగ్ కొనసాగుతుంది. ముమ్మర లాబీయింగ్, తెరవెనుక మంత్రాంగాలు జరగడం ఖాయం.

- సాక్షి, నేషనల్ డెస్క్

నేటి నుంచే బడ్జెట్ సమావేశాలు

- నేడు ఉభయ సభల ముందుకు సామాజిక, ఆర్థిక సర్వే
- రేపు లోక్‌సభలో బడ్జెట్
- సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించండి
- అఖిలపక్ష సమావేశంలో పార్టీలకు ప్రభుత్వం విజ్ఞప్తి
- తమ రాష్ట్రాలకు ప్రత్యేక హోదా కోరిన వైఎస్సార్‌సీపీ, జేడీ(యూ), బీజేడీ

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల 12వ తేదీ వరకు 19 రోజులపాటు కొనసాగుతాయి. సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశాలు ప్రారంభం కానుండగా, తొలి రోజు పశ్చిమ బెంగాల్‌లోని అసన్‌సోల్ నియోజకవర్గం నుంచి గెలిచిన శత్రుఘ్న సిన్హా లోక్‌సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం ప్రశ్నోత్తరాలు నిర్వహిస్తారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024–25 సామాజిక, ఆర్థిక సర్వే నివేదికను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుత సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 6 బిల్లులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. జమ్మూకశ్మీర్ బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం తెలిపే అవకాశాలున్నాయి. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు.

ఈసారి వాడీవేడిగానే చర్చలు

2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు నరేంద్ర మోదీ ప్రభుత్వం ఓ వైపు సన్నాహాలు చేస్తుండగా, మరోవైపు వివిధ కీలక అంశాలపై కేంద్రాన్ని నిలదీసేందుకు విపక్షాలు సన్నద్ధమవుతున్నాయి. నీట్–యూజీ పేపర్ లీకేజీ, యూపీఎస్సీ పరీక్షల్లో అవకతవకలు, రైల్వే భద్రత, డిప్యూటీ స్పీకర్ పదవి, నిరుద్యోగం, అగ్నివీర్ పథకం, ఆర్థిక వ్యవస్థ, కేంద్ర దర్యాప్తు సంస్థల దుర్వినియోగం, మణిపూర్‌లో శాంతి భద్రతలు వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని నిర్ణయానికొచ్చాయి.

ప్రత్యేక హోదాపై గళం విప్పిన వైఎస్సార్‌సీపీ

కేంద్ర ప్రభుత్వం ఆదివారం ఢిల్లీలో అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జేపీ నడ్డా నేతృత్వంలో నిర్వహించిన ఈ భేటీకి ఆర్జేడీ, జేడీయూ, బీజేడీ, టీడీపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, శివసేన తదితర 44 పార్టీల సభాపక్ష నేతలు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాల్లో ఉభయ సభల కార్యకలాపాలు సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కేంద్ర మంత్రులు కోరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా అంశాన్ని వైఎస్సార్‌సీపీ రాజ్యసభాపక్ష నేత విజయసాయిరెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ పాలనలో ప్రతిపక్ష నేతలపై దమనకాండ సాగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ జేడీ(యూ), ఒడిశాకు ప్రత్యేక హోదా కల్పించాలని బిజూ జనతాదళ్(బీజేడీ) సైతం తమ డిమాండ్లను ప్రభుత్వం ముందుంచాయి. నీట్–యూజీ పేపర్ లీకేజీ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడేందుకు విపక్షాలకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ తరఫున హాజరైన గౌరవ్ గొగోయ్ కోరారు. లోక్‌సభలో కాంగ్రెస్‌కు డిప్యూటీ స్పీకర్ పదవి కట్టబెట్టాలని డిమాండ్ చేశారు.

ఆరు బిల్లులివే..

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ఆరు కొత్త బిల్లులు ప్రవేశపెట్టనుంది. 90 ఏళ్ల క్రితం నాటి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో భారతీయ వాయుయాన్ విధేయక్–2024ను తీసుకొస్తోంది. విమానయాన రంగంలో సులభతర వాణిజ్యానికి పెద్దపీట వేయనున్నారు. అలాగే ఫైనాన్స్ బిల్లు, విపత్తు నిర్వహణ(సవరణ) బిల్లు, బాయిలర్స్ బిల్లు, కాఫీ(ప్రోత్సాహం, అభివృద్ధి) బిల్లు, రబ్బర్(ప్రోత్సాహం, అభివృద్ధి) బిల్లును కేంద్రం ప్రవేశపెట్టనుంది.

హోదాపై టీడీపీ మౌనమెందుకో?: జైరాం

అఖిలపక్ష సమావేశంపై కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో స్పందించారు. ''రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష భేటీలో ఆంధ్రప్రదేశ్, బిహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, జేడీ(యూ) డిమాండ్ చేశాయి. విచిత్రంగా తెలుగుదేశం పార్టీ మాత్రం ఈ అంశంపై మౌనం దాల్చింది'' అని పేర్కొన్నారు.

అస్తిత్వాన్ని తాకట్టు పెట్టారు

- పిరికిపందలు, నిస్సిగ్గుగా వ్యవహరించారు
- మంత్రి పదవుల్లో రాజీపడ్డారు
- ఎన్డీఏ మిత్రపక్షాలపై మమత ధ్వజం



ర్యాలీలో పాల్గొన్న మమత, అఖిలేశ్

కోల్‌కతా: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఎక్కువకాలం కొనసాగదని, త్వరలోనే కూలిపోతుందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ అన్నారు. బెదిరించి, భయపెట్టి బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మమత ఏ పార్టీ పేరు తీసుకోకపోయినప్పటికీ ఆమె పరోక్షంగా ఎన్డీఏ కీలకపక్షాలను ఉద్దేశించే పలు ఘాటు విమర్శలు చేశారు. అమరువీరుల దినోత్సవ భారీ ర్యాలీలో మమత ఆదివారం మాట్లాడారు. 'పిరికిపందలు, అత్యాశాపరులైన నాయకులు ఆర్థిక తాయిలాలకు లొంగిపోయారు. మంత్రిపదవులకు బదులుగా డబ్బు ఇస్తామనడం ఎప్పుడైనా విన్నామా? పార్టీలు డబ్బుకు అమ్ముడు పోవడం చూశామా? వాళ్లు (ఎన్డీఏ మిత్రపక్షాలు) పిరికిపందలు, సిగ్గులేని వారు. అత్యాశాపరులు. అస్తిత్వాన్ని తాకట్టు పెట్టారు' అని మమత ధ్వజమెత్తారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ర్యాలీలో పాల్గొన్నారు. కేంద్రంలోని ఎన్డీఏ సర్కారు ఎక్కువకాలం కొనసాగదని, మతతత్వశక్తులకు విజయం లభించినా.. ఓటమి తప్పదని అఖిలేశ్ అన్నారు.

కేరళలో నిఫా వైరస్ కలకలం..

బాలుడు మృతి

చికిత్స పొందుతున్న మరో ముగ్గురు

కేరళ: కేరళలో నిఫా వైరస్ కలకలం రేపుతోంది. నిఫా ఇన్ఫెక్షన్‌తో చికిత్స పొందుతున్న 14 ఏళ్ల బాలుడు ఆదివారం మరణించాడు. ఆదివారం ఉదయం బాలుడికి గుండెపోటు వచ్చిందని, అతడిని బతికించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని, 11.30 గంటలకు మృతి చెందాడని రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. బాలుడు చికిత్స పొందుతున్న కోజికోడ్ మెడికల్ కాలేజీలో ప్రస్తుతం ముగ్గురు వ్యక్తులు ఐసోలేషన్‌లో ఉన్నారని తెలిపారు. అయితే 246 మంది బాలుడితో కాంటాక్ట్ అయ్యారని, వారిలో 63 మంది హై–రిస్క్ కేటగిరీ కింద ఉన్నారని తెలిపింది. నిఫా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేరళకు తమ పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది.

గ్రీన్‌విచ్ కంటే ముందే మనకో కాలమానం!

న్యూఢిల్లీ: నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ) ఆరో తరగతి సాంఘిక శాస్త్రం కొత్త పుస్తకంలో పలు మార్పులు చేసింది. గ్రీన్‌విచ్ కాలమానం కంటే ముందే మన దేశానికి సొంత కాలమానం ఉందని, దీనిని 'మధ్య రేఖ' అని పిలుస్తారని పేర్కొంది. బీఆర్ అంబేద్కర్ అనుభవాలను, ఎదుర్కొన్న కుల వివక్ష పాఠాన్ని కూడా కుదించింది. హరప్పా నాగరికతను కొత్త పాఠ్య పుస్తకంలో 'సింధు–సరస్వతి'గా పేర్కొంది. నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా పాఠశాల విద్య కోసం కొత్త జాతీయ పాఠ్యప్రణాళిక ఫ్రేమ్ వర్క్–2023కు అనుగుణంగా ఎన్సీఈఆర్టీ కొత్త సిలబస్‌ను సిద్ధం చేస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో 6వ తరగతి సాంఘిక శాస్త్ర పుస్తకంలో పలు మార్పులు చేసింది. గ్రీన్‌విచ్ కాలమానమే ప్రధాన కాలమానం కాదని, దానికంటే శతాబ్దాల ముందు యూరప్, భారత్‌లకు సొంత కాలమానాలున్నాయని పేర్కొంది. దానిని మధ్య రేఖ (మిడిల్ లైన్) అని పిలిచేవారని, అది ఖగోళ శాస్త్రానికి ప్రసిద్ధి చెందిన ఉజ్జయినీ నగరం (ఉజ్జయిన్) గుండా వెళ్లిందని వివరించింది. అలాగే కొత్త పాఠ్యపుస్తకంలో 'భారత నాగరికత ప్రారంభం' అనే అధ్యాయంలో సరస్వతి నదికి ప్రముఖ స్థానం ఉందని, ప్రజలను వర్ణాలుగా విభజించారని, శూద్రులను, స్త్రీలను వేదాలను అధ్యయనం చేయనీయలేదని పాత పాఠ్య పుస్తకంలో ఉండగా.. వ్యవసాయదారుడు, నేత, కుమ్మరి, బిల్డర్, వడ్రంగి, వైద్యుడు, నర్తకి, మంగలి, పూజారివంటి వృత్తులను వేదాల్లో పేర్కొన్నట్లు కొత్త పుస్తకాల్లో పేర్కొంది. పాత పుస్తకంలోని నాలుగు అధ్యాయాల్లో ఉన్న చాణక్యుడి అర్థశాస్త్రం, గుప్తులు, పల్లవులు, చాళుక్యుల రాజవంశాలు, అశోకుడు చంద్రగుప్త మౌర్యుల రాజ్యాల కథనాలను కొత్త పుస్తకంలో తొలగించింది.

బంగ్లాదేశ్‌లో కోటా కట్

- సుప్రీంకోర్టు సంచలన తీర్పు
- 56 శాతం ఉన్న రిజర్వేషన్లు 7 శాతానికి తగ్గింపు
- స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు 5 శాతమే
- 30 శాతం నుంచి భారీగా కుదింపు
- వెనుకబడిన జిల్లాల ప్రజలు, మహిళలకు రిజర్వేషన్లు రద్దు
- న్యాయస్థానం స్పష్టీకరణ.. విద్యార్థులకు పాక్షిక విజయం

ఢాకా: బంగ్లాదేశ్‌ను అగ్నిగుండంగా మార్చిన రిజర్వేషన్ల వివాదానికి ముగింపు పలికే దిశగా సుప్రీంకోర్టు ఆదివారం సంచలనాత్మక తీర్పు వెలువరించింది. 1971లో బంగ్లా విముక్తి ఉద్యమంలో పాల్గొన్నవారి వారసులకు, కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఇప్పటిదాకా కల్పిస్తున్న 30 శాతం కోటాలో భారీగా కోత విధించింది. కేవలం 5 శాతానికి పరిమితం చేసింది. వెనుకబడిన జిల్లాల ప్రజలకు, మహిళలకు 10 శాతం చొప్పున రిజర్వేషన్లు అమల్లో ఉండగా, న్యాయస్థానం వాటిని రద్దు చేసింది. గిరిజనులు/మైనార్టీలకు కల్పిస్తున్న 5 శాతం రిజర్వేషన్లను ఒక శాతానికి తగ్గించింది. దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు అమల్లో ఉన్న ఒక శాతం రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మొత్తంగా 56 శాతం ఉన్న కోటాను ఏకంగా 7 శాతానికి కుదించడం గమనార్హం. 93 శాతం ప్రభుత్వ ఉద్యోగాలను కేవలం ప్రతిభ ఆధారంగానే భర్తీ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేసి, ప్రతిభావంతులకే ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా తీవ్రంగా పోరాడుతున్న విద్యార్థులకు పాక్షిక విజయమే దక్కినట్లయ్యింది.

రిజర్వేషన్లకు షేక్ హసీనా అనుకూలం

ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో అధికారంలో ఉన్న అవామీ లీగ్ పార్టీ బంగ్లా విముక్తి ఉద్యమానికి సారథ్యం వహించింది. సహజంగానే ఆ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ప్రభుత్వ ఉద్యోగాల్లో కోటా విధానంతో లబ్ధి చేకూరుతోంది. ఈ రిజర్వేషన్లను ప్రధానమంత్రి షేక్ హసీనా పరోక్షంగా సమర్థిస్తున్నారు. సొంత దేశం కోసం పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో త్యాగాలు చేసిన సమరయోధుల కుటుంబాలకు సమున్నత గౌరవం ఇవ్వాలని ఆమె వాదిస్తున్నారు. అయితే, ఇది పూర్తిగా వివక్షతో కూడిన విధానమని విద్యార్థులు మండిపడుతున్నారు. రిజర్వేషన్లు పూర్తిగా పక్కనపెట్టి, కేవలం ప్రతిభ ఆధారంగా నియామకాలు చేపట్టాలని పట్టుబడుతున్నారు. బంగ్లాదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు క్రమంగా తగ్గిపోతుండడం, అందుబాటులో ఉన్న కొద్దిపాటి ఉద్యోగాలు రిజర్వేషన్ల పేరిట కొన్ని కుటుంబాలకే దక్కుతుండడం, తమకు అన్యాయం జరుగుతుండడంతో విద్యార్థుల్లో అసహనం మొదలైంది. అదే చివరకు రిజర్వేషన్ల వ్యతిరేక పోరాటంగా మారింది. ప్రతిపక్ష బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ(బీఎన్‌పీ) సైతం విద్యార్థులకు అండగా నిలిచింది.



ఢాకాలోని ప్రధాన రోడ్డుపై బారికేడ్లు ఏర్పాటు చేసిన పోలీసులు

ఎందుకీ ఆందోళనలు?

1971లో జరిగిన బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమంలో వేలాది మంది పాల్గొన్నారు. ఆస్తులు పోగొట్టుకున్నారు. ప్రాణత్యాగాలు సైతం చేశారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత వారి కుటుంబాలకు న్యాయం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రిజర్వేషన్ల విధానం తీసుకొచ్చింది. విముక్తి ఉద్యమంలో భాగస్వాములైన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు కల్పించింది. 2018లో ఈ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. దేశవ్యాప్తంగా అలజడి సృష్టించారు. దాంతో అప్పటి ప్రభుత్వం దిగివచ్చింది. రిజర్వేషన్లను నిలిపివేసింది. స్వాతంత్య్ర సమరయోధుల బంధువుల విజ్ఞప్తి మేరకు రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ ఈ ఏడాది జూన్‌లో బంగ్లాదేశ్ హైకోర్టు తీర్పు ప్రకటించడంతో విద్యార్థులు మళ్లీ భగ్గుమన్నారు. రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలంటూ పోరుబాట పట్టారు. వీధుల్లోకి వచ్చి పోలీసులతో ఘర్షణకు దిగారు. ఈ నేపథ్యంలో షేక్ హసీనా ప్రభుత్వంలో కలవరం మొదలైంది. ఘర్షణల్లో విద్యార్థులు మరణిస్తుండడం, శాంతి భద్రతలు అదుపు తప్పుతుండడంతో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రిజర్వేషన్లపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు రిజర్వేషన్లు పూర్తిగా రద్దు చేయకుండా, అన్ని రకాల రిజర్వేషన్లను 7 శాతానికి పరిమితం చేస్తూ తీర్పు వెల్లడించింది. ఇందులో 5 శాతం బంగ్లా స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు, 2 శాతం ఇతరులకు కల్పిస్తూ ఆదేశాలు జారీ చేసింది.


బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్లు (శాతాల్లో)

	గతంలో	ఇప్పుడు
సమరయోధుల కుటుంబాలకు	30	5
వెనుకబడిన జిల్లాల ప్రజలకు	10	-
మహిళలకు	10	-
గిరిజనులు/మైనార్టీలకు	5	1
దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లకు	1	1

ఆందోళనలు ఆపేదిలేదన్న విద్యార్థులు

తమ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేవరకూ ఆందోళన కొనసాగిస్తామని విద్యార్థి సంఘాల నేతలు తేల్చిచెప్పారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని, హింసకు కారణమైన అధికారులను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత బంగ్లాదేశ్‌లో పరిస్థితి కొంత అదుపులోకి వచ్చింది. కర్ఫ్యూ నిబంధనలను ఇంకా సడలించలేదు. కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించలేదు. ఈ ఘటనలో మృతిచెందినవారు 150కి చేరినట్లు సమాచారం. ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటించింది. ప్రజలు బయటకు రావొద్దని సూచించింది.

వారసత్వ సంపదతో మెరుగైన ప్రపంచం



న్యూఢిల్లీ: పూర్వీకుల నుంచి వచ్చిన ఘనమైన వారసత్వం అనేది కేవలం ఒక చరిత్ర కాదని, అదొక శాస్త్రం, వివిధ వర్గాల ప్రజలను కలిపే వారధి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. మరింత మెరుగైన ప్రపంచాన్ని సృష్టించడానికి వారసత్వ సంపదను ఉపయోగించుకోవాలని సూచించారు. శనివారం ఢిల్లీలోని భారత్ మండపంలో 46వ వరల్డ్ హెరిటేజ్ కమిటీ(డబ్ల్యూహెచ్‌సీ) సదస్సు ప్రారంభోత్సవంలో మోదీ ప్రసంగించారు. చరిత్రాత్మక కట్టడాలు వారసత్వంగా వస్తుంటాయని, వాటిని చూసినప్పుడు అప్పటి కాలంలోకి వెళ్తామని ఉద్ఘాటించారు. ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ ఆలయం, తమిళనాడులోని బృహదీశ్వరాలయం ఘనమైన వారసత్వానికి ప్రతీక అని కొనియాడారు. ప్రపంచంలో అత్యంత ప్రాచీన నాగరికతను నిలయమైన మన దేశంలో ఈ సదస్సు జరుగుతుండడం ఆనందంగా ఉందన్నారు. యునెస్కో ఆధ్వర్యంలో జరుగుతున్న డబ్ల్యూహెచ్‌సీ సదస్సుకు భారత్ తొలిసారిగా ఆతిథ్యం ఇస్తోంది. ఈ నెల 31 దాకా ఈ సదస్సు జరుగనుంది. యునెస్కో డైరెక్టర్ జనరల్ ఆడ్రీ అజౌలే, కేంద్ర మంత్రులు ఎస్.జైశంకర్, గజేంద్రసింగ్ షెకావత్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను జైల్లోనే చంపేందుకు బీజేపీ కుట్ర: ఆప్



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను జైలులోనే చంపేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఆరోపించింది. జూన్ 3–జూలై 7వ తేదీల మధ్య కేజ్రీవాల్ షుగర్ స్థాయిలు 26 రెట్లు పడిపోయినట్లు ఆరోగ్య నివేదికలు స్పష్టం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాలు కేజ్రీవాల్ జీవితంతో ఆడుకుంటున్నారని మండిపడ్డారు. కేజ్రీవాల్‌కు ఏ క్షణమైనా ప్రమాదం జరగొచ్చని అధికారిక నివేదికలే చెబుతున్నాయన్నారు. కేజ్రీవాల్ ఆరోగ్యంపై బీజేపీ, ఎల్జీ పదే పదే వెలువరిస్తున్న తప్పుడు నివేదికలు, చేస్తున్న తప్పుడు వ్యాఖ్యలు ఈ అనుమానాలను బలపరుస్తున్నాయన్నారు. 'కేజ్రీవాల్ పూరీలు, స్వీట్లు తదితరాలను అతిగా తింటున్నారని, అవసరం లేకున్నా ఇన్సులిన్ అడుగుతున్నారని వీరే గతంలో ఆరోపించారు. కోర్టు జోక్యంతో ఎయిమ్స్ వైద్యులు పరీక్షలు జరిపి ఆయనకు ఇన్సులిన్ ఇచ్చారు. ఇప్పుడేమో కేజ్రీవాల్ వైద్యులు సూచించిన మోతాదు కంటే తక్కువగా తింటున్నారని, అందుకే షుగర్ లెవెల్స్ పడిపోయాయని అంటున్నారు' అని సంజయ్ సింగ్ వివరించారు. దీని వెనుక కేజ్రీవాల్ ప్రాణాలు తీసేలా భారీ కుట్ర ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

ప్రధానిగా ఓలి రెండేళ్లు.. దేవ్‌బా ఒకటిన్నరేళ్లు

నేపాల్ సంకీర్ణంలోని ప్రధాన పార్టీల మధ్య ఒప్పందం



కఠ్మాండు: నేపాల్‌లో కొత్తగా ప్రధాని కేపీ శర్మ ఓలి సారథ్యంలో ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వంలో ప్రధాన పార్టీల మధ్య అధికార పంపిణీ ఒప్పందం ఖరారైంది. దీని ప్రకారం కేపీ శర్మ ఓలి ప్రధానిగా రెండేళ్లు కొనసాగుతారు, ఆ తర్వాత మిగతా ఏడాదిన్నర కాలంలో నేపాలీ కాంగ్రెస్(ఎన్‌సీ) చీఫ్ షేర్ బహదూర్ దేవ్‌బా ప్రధానిగా పగ్గాలు చేపడతారు. ఈ మేరకు తమ మధ్య కీలకమైన ఏడు అంశాలపై అంగీకారం కుదిరినట్లు నేపాల్–యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్(సీపీఎన్–యూఎంఎల్) చీఫ్, ప్రధాని ఓలి ఆదివారం పార్లమెంట్‌లో వెల్లడించారు. దీంతో, సంకీర్ణ ప్రభుత్వంలోని కీలక భాగస్వామ్యపక్షాలైన ఎన్‌సీ, సీపీఎన్–యూఎంఎల్‌ల మధ్య కుదిరిన రహస్య ఒప్పందంపై వస్తున్న అనేక ఊహాగానాలకు ఆయన చెక్ పెట్టినట్లయింది. పార్లమెంట్‌లో బల నిరూపణలో విఫలమైన ప్రచండ స్థానంలో గత వారం ఓలి ప్రధానిగా ప్రమాణం చేయడం తెల్సిందే. దీంతో, ఆదివారం ఓలి పార్లమెంట్ దిగువ సభలో ప్రవేశపెట్టిన విశ్వాసతీర్మానానికి అనుకూలంగా 188 ఓట్లు, వ్యతిరేకంగా 74 ఓట్లు పడ్డాయి. దీంతో, ఓలి ప్రభుత్వం సభ విశ్వాసాన్ని పొందినట్లు స్పీకర్ దేవ్ రాజ్ ఘిమిరే ప్రకటించారు.

రాహుల్‌కి ఊమెన్ చాందీ అవార్డు



తిరువనంతపురం: దివంగత కేరళ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత 'ఊమెన్ చాందీ పబ్లిక్ సర్వెంట్' మొట్టమొదటి అవార్డుకు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఎంపికయ్యారు. అవార్డు కింద రాహుల్‌కు రూ.లక్ష నగదుతోపాటు ప్రముఖ సినీ నిర్మాత నెమోమ్ పుష్పరాజ్ రూపొందించిన శిల్పాన్ని అందజేస్తారు. భారత్ జోడో యాత్ర ద్వారా ప్రజల కష్టాలను విని, వాటికి పరిష్కారాలు కనుగొన్న జాతీయ నేత రాహుల్ గాంధీ అని ఎంపిక కమిటీ పేర్కొంది. కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ సారథ్యంలోని కమిటీ ఈ అవార్డుకు ఎంపిక చేస్తుంది. మూడు రోజుల క్రితమే ఊమెన్ చాందీ మూడో వర్ధంతి జరిగింది.

యూజీసీ–నెట్‌కు..మళ్లీ పరీక్ష వద్దు

న్యూఢిల్లీ: యూజీసీ– నెట్ పరీక్షను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. జూన్ 18న యూజీసీ–నెట్‌ను నిర్వహించగా.. పరీక్షల సమగ్రతకు భంగం కలిగి ఉండొచ్చనే సమాచారంతో కేంద్రం 19న పరీక్షను రద్దు చేసింది. కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించింది. లీకేజీ ఆరోపణలపై సీబీఐ విచారణ ముగిసే దాకా పునఃపరీక్షను నిర్వహించవద్దని, ఆ మేరకు స్టే ఇవ్వాలని పిటిషనర్ కోరారు. సీబీఐ విచారణ పూర్తికాక ముందే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) యూజీసీ–నెట్‌ను మళ్లీ నిర్వహించడానికి ఆగస్టులో కొత్త తేదీలను ప్రకటించడం సరికాదని పిటిషనర్ విన్నవించారు. ఈ పిటిషన్ సోమవారం చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చే అవకాశముంది. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ ప్రధానం, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం, పీహెచ్‌డీల్లో ప్రవేశాల కొరకు యూజీసీ– నెట్‌ను అర్హత పరీక్షగా నిర్వహిస్తారు.

యూపీ, ఉత్తరాఖండ్..మధ్యప్రదేశ్..!

భోపాల్/ముజఫర్‌నగర్: హోటల్ యజమానులు తమ పేర్లు, ఫోన్ నంబర్లను కూడా బోర్డులపై ప్రదర్శించాలంటూ ఇచ్చిన ఆదేశాలపై ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని బీజేపీ ప్రభుత్వాలు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్న వేళ.. బీజేపీకే చెందిన మధ్యప్రదేశ్‌లోని మోహన్ యాదవ్ ప్రభుత్వం దాదాపు ఇలాంటి ఉత్తర్వులనే తాజాగా జారీ చేసింది. దీని ప్రకారం..ప్రముఖ పుణ్యక్షేత్రం ఉజ్జయినిలోని దుకాణదారులంతా తమ దుకాణాల వెలుపల పేర్లు, ఫోన్ నంబర్లను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ మేరకు బీజేపీ పాలిత ఉజ్జయిని మున్సిపల్ కౌన్సిల్ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. పేరు, ఫోన్ నంబర్ ప్రదర్శించని దుకాణదారులు మొదటి విడతగా అయితే రూ.2 వేలు, రెండో విడతగా రూ.5 వేలు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

ఆ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలి

కువర్ యాత్రా మార్గంలో ఉన్న హోటళ్ల వారంతా యజమానుల పేర్లను ప్రదర్శించాలంటూ యూపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను వెనక్కి తీసుకునేందుకు సమయం ఉందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ మిత్రపక్షం ఆర్‌ఎల్‌డీ పేర్కొంది. ఆ పార్టీ నేత జయంత్ చౌదరి ఆదివారం మీడియాతో మాట్లాడుతూ..ఆ యాత్రా మార్గం ఏ ఒక్క కులానికో, మతానికో చెందింది కాదన్నారు. ఈ ఆదేశాలను వెనక్కి తీసుకోవాలని, లేదా సడలించాలని ప్రభుత్వాన్ని కోరారు. కాగా, కువర్ యాత్ర మార్గంలోని హోటళ్ల యజమానులంతా తమ పేర్లను ప్రదర్శించాలన్న యూపీ ప్రభుత్వ ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై నేడు సుప్రీంకోర్టు విచారణ చేపట్టనుంది.

సాక్షి హైదరాబాద్

సోమవారం ı 22 ı జూలై ı 2024



సైబరాబాద్‌లో నేరం.. బెంగళూరులో కేసు

జీఎన్‌ఎస్‌ఎస్ అమలులోకి వచ్చిన 20 రోజులకు అందులోని నిబంధనల ఆధారంగా కర్ణాటక రాజధాని బెంగళూరు పోలీసులు తొలి జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. -8లో



దిక్కులేక.. బిక్కుబిక్కు

ఒకవైపు వర్షాలు.. మరోవైపు శిథిల గృహాలు.. పైకప్పుల పెచ్చులూడుతున్నాయి. ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. పేద కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ అక్కడే గడుపుతున్నాయి. -10లో


గరిష్టం/కనిష్టం
29.0/24.0

వాతావరణం

నగరంలో సోమవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలిక పాటి వర్షం కురవొచ్చు. గరిష్టంగా 29, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చు.




చార్మినార్: ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం పాతబస్తీలో అమ్మవారి ఘటస్థాపన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.








బోనం.. వైభవం..



సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయానికి బోనాలతో వస్తున్న మహిళలు

బోనమెత్తిన.. లష్కర్

ఉజ్జయినీ మహంకాళి దర్శనానికి పోటెత్తిన భక్తజనం

- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మంత్రులు, వీఐపీల రాకతో కిటకిటలాడిన సికింద్రాబాద్ పరిసరాలు

రాంగోపాల్‌పేట్: శివసత్తుల పూనకాలు.. పోతరాజుల విన్యాసాలు.. బాజాభజంత్రీల మధ్య లష్కర్ బోనమెత్తింది. సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించి మొక్కుల తీర్చుకున్నారు. ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర సందర్భంగా సికింద్రాబాద్‌లో ఎటు చూసినా భక్తజన కోలాహలమే కనిపించింది. ఉదయం 8.40 గంటలకు అమ్మవారి ఆలయానికి చేరుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, ఈఓ మనోహర్‌రెడ్డి, వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి సీఎం పట్టు వస్త్రాలను సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. సీఎం వెంట రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, శ్రీగణేష్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తదితరులు ఉన్నారు.

తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం..

అంతకుముందు తెల్లవారుజామున 4.05 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. కార్పొరేటర్ చీర సుచిత్ర, పీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ సభ్యుడు సురిటి కామేష్ తదితర అధికారులు, ప్రధాన అర్చకులు, వేద పండితులు అమ్మవారికి పూజలు చేశారు. పలువురు రాజకీయ ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.





కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి దంపతులు



ఉజ్జయినీ మహంకాళి దేవాలయంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి



అమ్మవారికి బోనం సమర్పించేందుకు వస్తున్న సీఎస్ శాంతికుమారి



దర్శనానికి వస్తున్న నగర సీపీ



అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం



పూజలు చేస్తున్న మంత్రి సీతక్క



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రి పొన్నం

ప్రాజెక్టులు పట్టాలెక్కేనా!

- నిధులు కేటాయిస్తేనే 'హైస్పీడ్'
- యాదాద్రికి ఎంఎంటీఎస్ వచ్చేనా..
- వందే మెట్రో కోసం సిటీ వెయిటింగ్
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాని ఎంఎంటీఎస్- 2
- నేటి నుంచి కేంద్ర బడ్జెట్ సమావేశాలు
- నగరవాసుల్లో మరోసారి చిగురిస్తున్న ఆశలు

సాక్షి, సిటీబ్యూరో: ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టు తుది దశకు చేరుకుంది. దాదాపు ఎంపిక చేసిన అన్ని లైన్‌లు పూర్తయ్యాయి. కానీ ఇప్పటి వరకు కొత్త రైళ్లను కొనుగోలు చేయలేదు. కనీసం 9 రైళ్లను కొత్తగా కొనుగోలు చేస్తే తప్ప కొత్త మార్గాల్లోకి ఎంఎంటీఎస్ సేవలను విస్తరించడం సాధ్యం కాని పరిస్థితి. గతంలో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం కొరవడడంతో ఎంఎంటీఎస్ రెండో దశకు నిధుల కొరత సవాల్‌గా మారింది. ఇప్పటికైనా రెండో దశకు నిధులు కేటాయిస్తే ఔటర్ చుట్టూ వివిధ ప్రాంతాల నుంచి నగరంలోకి రాకపోకలు సాగించేలా ఎంఎంటీఎస్ విస్తరణకు అవకాశం ఉంటుంది. ఘట్కేసర్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్‌ను పొడిగించే ప్రతిపాదన ఇప్పటికీ ఆచరణకు నోచలేదు. ఇటీవల ఈ ప్రాజెక్టు కోసం అవసరమైన భూమిని ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు ఈ ఏడాదైనా ఆచరణలోకి వస్తే నగరవాసులకు ఎంతో ఊరట. అలాగే.. వందే మెట్రో రైళ్లు, హైస్పీడ్ రైళ్లు వంటి అధునాతన సదుపాయాల కోసం నగరం ఎదురు చూస్తోంది. మరికొద్ది గంటల్లో కేంద్ర బడ్జెట్ సమావేశాలు ఆరంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో చేపట్టాల్సిన రైల్వే ప్రాజెక్టులపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఔటర్ వరకు ఎంఎంటీఎస్..

- మహా నగర విస్తరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జీహెచ్‌ఎంసీ పరిధిని ఔటర్ వరకు విస్తరించనున్నారు. ఈ క్రమంలో ప్రజా రవాణాను కూడా అన్ని వైపులా విస్తరించవలసిందే. మెట్రో రెండో దశ కోసం ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ చేపట్టింది. కానీ దక్షిణమధ్య రైల్వే రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపట్టిన ఎంఎంటీఎస్ రెండో దశ ఇప్పటికే పూర్తయింది.
- మేడ్చల్, పటాన్‌చెరు, ఉందానగర్, చర్లపల్లి, ఘట్కేసర్ తదితర నగర శివారు ప్రాంతాలను అనుసంధానం చేసేలా రెండో దశ లైన్‌ల నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం మౌలాలీ-సనత్‌నగర్ మధ్య కూడా పనులు తుది దశకు చేరుకున్నాయి. కానీ నగర విస్తరణకు అనుగుణంగా ఎంఎంటీఎస్ రైళ్లు లేకపోవడంతో.. అందుబాటులో ఉన్న వాటినే వివిధ మార్గాల్లో నడుపుతున్నారు.



- గతంలో లింగంపల్లి- ఫలక్‌నుమా, నాంపల్లి-లింగంపల్లి, ఫలక్‌నుమా-లింగంపల్లి మార్గాల్లో రోజుకు 121 సర్వీసులు నడిచాయి. కానీ ప్రస్తుతం సర్వీసుల సంఖ్య సగానికి తగ్గింది. ఎంఎంటీఎస్ రెండో దశలో భాగంగా 9 కొత్త రైళ్లను కొనుగోలు చేయాలని దక్షిణమధ్య రైల్వే ప్రతిపాదించింది. ఇప్పటి వరకు ఒక్క రైలు కూడా కొత్తగా పట్టాలెక్కలేదు.

యాదాద్రికి పొడిగిస్తారా..

సికింద్రాబాద్ నుంచి ప్రస్తుతం ఘట్కేసర్ వరకు చేపట్టిన ఎంఎంటీఎస్ రెండో దశ ప్రాజెక్టును రాయగిరి వరకు మరో 33 కిలోమీటర్లు పొడిగించేందుకు 2015లో ప్రణాళికలను సిద్ధం చేశారు. కానీ ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల ఈ ప్రాజెక్టు కోసం అవసరమైన భూమిని ఇచ్చేందుకు రాష్ట్రప్రభుత్వం సంసిద్ధతను వ్యక్తం చేసింది. ఈసారైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం ఏర్పడితే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కేందుకు అవకాశం ఉంది.

'హైస్పీడ్'ను పట్టాలెక్కించండి....

గంటకు 220 కిలోమీటర్‌లకు పైగా వేగంతో దూసుకెళ్లే హైస్పీడ్ రైల్ కారిడార్ కోసం తెలుగు రాష్ట్రాలు ఎదురు చూస్తున్నాయి. సుమారు 922 కిలోమీటర్‌ల దూరం చేపట్టనున్న హైస్పీడ్ రైల్ కారిడార్ ప్రాజెక్టులో.. శంషాబాద్ నుంచి ప్రారంభమై విజయవాడ మీదుగా విశాఖ వరకు ఒక రూట్.. మరో రూట్‌లో విశాఖపట్టణం నుంచి విజయవాడ మీదుగా కర్నూల్ వరకు మరో హైస్పీడ్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల మధ్య అత్యంత వేగంతో దూసుకెళ్లే రైలు సేవలు అందుబాటులోకి వస్తాయి. దీంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సుమారు 4 గంటల్లోనే విశాఖకు చేరుకునే అవకాశం ఉంటుంది.

వందే మెట్రో కోసం సిటీ వెయిటింగ్..

వందేమెట్రో రైళ్ల కోసం నగరవాసులు ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్ నుంచి 250 కిలోమీటర్‌ల వరకు ఈ రైళ్లను నడపాలనే ప్రతిపాదన ఉంది. సికింద్రాబాద్- గుంటూరు, సికింద్రాబాద్- సిర్పూర్‌కాగజ్‌నగర్, సికింద్రాబాద్-పెద్దపల్లి, కాచిగూడ-కర్నూల్, సికింద్రాబాద్-నాందేడ్, సికింద్రాబాద్-రాయచూర్, తదితర మార్గాల్లో ఈ రైళ్లకు డిమాండ్ ఉంది.

పాతబస్తీ మెట్రో సంగతేంటీ?

పాతబస్తీ మెట్రో మార్గానికి నిధుల కొరత సవాల్‌గా మారింది. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కిలోమీటర్‌ల మెట్రో కారిడార్ కోసం సుమారు రూ.2000 వరకు ఖర్చు కానున్నట్లు అంచనా. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా రూ.500 కోట్లు కేటాయించారు. కానీ.. ఇప్పటి వరకు నిధులు విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనున్న క్రమంలో పాతబస్తీ మెట్రోను పట్టాలెక్కించేందుకు నిధులు విడుదల చేస్తే పనులు పరుగులు పెట్టే అవకాశం ఉంది.



అనుమానంతో ప్రాణాలు తీశాడు

- భార్య, బిడ్డను చంపి తానూ ఆత్మహత్య
- బోయిన్‌పల్లిలో విషాదకర ఘటన



విగతజీవులుగా స్వప్న, చిన్నారి నక్షత్ర



గణేష్ (ఫైల్)

రసూల్‌పురా: భార్య ప్రవర్తనపై అనుమానంతో దారుణానికి తెగబడ్డాడు ఓ భర్త. కట్టుకున్న ఇల్లాలితో పాటు పదకొండు నెలల కన్నకూతురును చంపి తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన ఆదివారం బోయిన్‌పల్లి పరిధిలో వెలుగులోకి వచ్చింది. బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ డెక్లూర్‌కు చెందిన గణేష్ సంగ్రామ్ (35), స్వప్న దంపతులు. వీరికి ముగ్గురు కూతుళ్లు తరుణి (6), తరుణశ్రీ (4), నక్షత్ర (11 నెలలు) ఉన్నారు. గణేష్ సంగ్రామ్ జీవనోపాధి కోసం కొన్నాళ్ల క్రితం కుటుంబంతో సహా నగరానికి వలస వచ్చాడు. బోయిన్‌పల్లి ఆర్యసమాజ్ సమీపంలో అద్దె ఇంటిలో ఉంటూ ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ భార్యాపిల్లలను పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా గణేష్ సంగ్రామ్, స్వప్న దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న గణేష్ సంగ్రామ్.. శనివారం రాత్రి స్వప్నతో గొడవ పడ్డాడు. ఆవేశంలో ఆమె మెడకు తాడుతో ఉరి వేసి ప్రాణాలు తీశాడు. పదకొండు నెలల చిన్నారి నక్షత్ర గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం తానూ ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఇంటి యజమానురాలికి, డయల్ 100కు ఫోన్ చేసి చెప్పాడు. సుచిత్ర- అల్వాల్ మార్గంలోని ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా.. మిగతా ఇద్దరు చిన్నారులు మరో గదిలో నిద్రిస్తుండటంతో తండ్రి వారి జోలికి వెళ్లలేదు. సమాచారం అందుకున్న పోలీసులు బోయిన్‌పల్లిలోని ఇంటికి వెళ్లి చూడగా స్వప్న, చిన్నారి నక్షత్ర మృతదేహాలు కనిపించాయి. పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మేడిపల్లికి 'రాచకొండ'

- మరో 12 నెలల్లో పోలీస్ కమిషనరేట్
- శరవేగంగా భవన నిర్మాణ పనులు



భవన నిర్మాణ నమూనాలను పరిశీలిస్తున్న సీపీ సుధీర్ బాబు, ఇతర పోలీసు అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ నూతన పోలీసు కమిషనరేట్ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మరో 12 నెలల్లో కార్యాలయం అందుబాటులోకి వస్తుందని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. మేడిపల్లిలోని కమిషనరేట్ భవన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. సైబరాబాద్ మెట్రోపాలిటన్ పోలీసులోని సైబరాబాద్ ఈస్టును విభజించి 2016 జూన్‌లో రాచకొండ పోలీసు కమిషనరేట్‌ను ఏర్పాటైంది. ప్రస్తుతం నేరేడ్‌మెట్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న రాచకొండ.. దేశంలో విస్తీర్ణంలోనే అతి పెద్ద పోలీసు కమిషనరేట్. నూతన భవన నిర్మాణం కోసం ప్రభుత్వం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా మేడిపల్లిలో 56 ఎకరాల స్థలాన్ని కేటాయించిన సంగతి తెలిసిందే. నిర్మాణ పనుల కోసం రూ.78 కోట్ల బడ్జెట్‌ను కేటాయించారు. నగర, పట్టణ ప్రాంతాలతో రాచకొండ సమ్మిళిత ప్రాంతాల కలయికతో ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కమిషనరేట్‌లో అన్ని రకాల వసతులు, ఆధునిక వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నారు.



బషీర్‌బాగ్‌లో..

వదలని చినుకు..

మహానగరాన్ని ముసురు వర్షం వీడటంలేదు. మూడు రోజులుగా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. వాతావరణంలో మార్పులతో సిటీజనులు చలితో వణుకుతున్నారు. ఆదివారం నగటున రెండు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరుస వానలతో నగరంలోని ప్రధాన రహదారులు, బస్తీల్లోని అంతర్గత దారులు చిత్తడిగా మారాయి. దీంతో వాహనదారులు, ఆయా బస్తీవాసులు ఇబ్బందుల పాలవుతున్నారు. మరో రెండురోజుల పాటు తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. -సాక్షి, సిటీబ్యూరో




టెడ్ ఎక్స్ వేదికగా 'గాడియం' వార్షికోత్సవం



సాక్షి, సిటీబ్యూరో: ప్రతిష్టాత్మక టెడ్ ఎక్స్ వేదికగా 'ద గాడియం స్కూల్' ఆధ్వర్యంలో పదవ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేదికగా ప్రముఖ వక్తలు సృజనాత్మక విద్యపై ప్రత్యేకంగా చర్చించారు. విశ్వాంతర అంశాలపైన కార్ల్ సాగన్ చెప్పిన ప్రసిద్ధ ప్రతిబింబం నుంచి ప్రేరణ పొందిన 'పేల్ బ్లూ డాట్' థీమ్‌తో వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భారత బ్యాడ్మింటన్ జట్టు చీఫ్ నేషనల్ కోచ్ పుల్లెల గోపీచంద్ తన ప్రయాణాన్ని, విజయ పరంపరలో నిబద్ధతను, పట్టుదలకు ఉండే ప్రాధాన్యాన్ని వివరించారు. ఆయనతో పాటు ప్రముఖ పర్యావరణ ఉద్యమకారిణి కల్పనా రమేష్...సుస్థిర జీవనం కోసం తన ఉద్వేగభరితమైన చర్చతో ప్రేక్షకులను ఆలోచింపజేశారు. ద గాడియం స్కూల్ విద్యార్థులు శ్లోకా మధు, ఆగం మెహతా, హన్షిక జొన్నల చేసిన ప్రసంగాలకు అతిథులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కీర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ లీకేజీలపై అప్రమత్తం

- క్షేత్ర స్థాయిలో ఈఆర్టీ, ఎస్పీటీల పర్యటన
- ప్రతి సెక్షన్‌లో ఒక బృందం
- ఎప్పటికప్పుడు నీరు, వ్యర్థాల తొలగింపు
- వర్షాకాలం నేపథ్యంలో పకడ్బందీ చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సీవరేజి ఓవర్ ఫ్లో కాకుండా జలమండలి ప్రత్యేక చర్యలు చేపట్టింది. వర్షంతో నిలిచిన నీటిని ప్రత్యేకంగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్పీటీ)లు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలతో పాటు వాహనాలను సైతం ఏర్పాటు చేసింది. ఎయిర్‌టెక్ మిషన్లతో డ్రైనేజీలో వ్యర్థాలు (సిల్ట్) తొలగిస్తున్నారు. నగరంలో గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్లలో నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. నగరంలో సుమారు 140 వాటర్ లాగింగ్ పాయింట్లను గుర్తించి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేవిధంగా చర్యలు చేపట్టారు. మరోవైపు వాటర్‌లాగింగ్ పాయింట్ల వద్ద ప్రత్యేక సంపుల నిర్మాణాలకు సన్నహాలు జరుగుతున్నాయి. రోడ్లపై నిలిచిన నీటిని తొలగించేందుకు 238 స్టాటిక్, 154 మాన్సూన్ ఎమర్జెన్సీ బందాలు పనిచేస్తున్నాయి. మరోవైపు హైడ్రా ద్వారా 30, సీఆర్ఎంపీ ద్వారా 29 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నారు.

డీప్ మ్యాన్‌హోళ్లపై పర్యవేక్షణ

డీప్ మ్యాన్‌హోళ్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతినిత్యం వాటిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా సీవరేజీ సూపర్‌వైజర్లకు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే లోతైన 25 వేలకు పైగా మ్యాన్ హోళ్లపై సేఫ్టీ గ్రిల్స్ బిగించారు. ప్రధాన రహదారుల్లో ఉన్న వాటిని కవర్స్‌తో సీల్ చేసి, రెడ్ పెయింట్ వేశారు. ఎప్పటికప్పుడు మ్యాన్ హోళ్ల నుండి పూడిక, వ్యర్థాలను బయటికి తోడేందుకు ఎయిర్‌టెక్ యంత్రాలను అందుబాటులో ఉంచారు. డైలీ సిచువేషన్ రిపోర్ట్ (డీఎస్ఆర్) ఆధారంగా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు.



సైబరాబాద్‌లో నేరం.. బెంగళూరులో కేసు

- తొలి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అక్కడి కాప్స్
- హెచ్ఐసీసీలో కాన్ఫరెన్స్‌కు వచ్చిన ప్రైవేట్ ఉద్యోగి
- ల్యాప్‌టాప్, నగదు ఉన్న బ్యాగ్ చోరీ చేసిన దొంగలు
- స్వస్థలానికి వెళ్లి కూబన్ పార్క్ పోలీసులకు ఫిర్యాదు



సాక్షి, సిటీబ్యూరో: భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) అమలులోకి వచ్చిన 20 రోజులకు అందులోని నిబంధనల ఆధారంగా కర్ణాటక రాజధాని బెంగళూరు పోలీసులు తొలి జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అక్కడి కూబన్ పార్క్ పోలీసుస్టేషన్‌లో శనివారం నమోదైన ఈ కేసు సైబరాబాద్ పరిధిలో జరిగిన నేరంపై కావడం గమనార్హం. ఈ కేసును ఇక్కడి పోలీసులకు బదిలీ చేయడానికి ఆ పోలీసులు సన్నాహాలు చేస్తున్నారు. బెంగళూరులోని వసంత్‌నగర్‌కు చెందిన అపూర్వ ప్రకాష్ అక్కడి విఠల్ మాల్యాలోని ఓ ప్రైవేట్ సంస్థ ఉద్యోగి. ఈ నెల 9న గచ్చిబౌలిలోని హెచ్ఐసీసీలో జరిగిన ఓ సదస్సుకు ఆయన హాజరయ్యారు. తన ల్యాప్‌టాప్, రూ.70 వేల నగదుతో కూడిన బ్యాగ్ తస్కరణకు గురైనట్లు సదస్సు పూర్తయిన తర్వాత గమనించారు. ఆ రోజు సాయంత్రమే బెంగళూరు తిరిగి వెళ్లాల్సి ఉండటం, విమాన టిక్కెట్లు సైతం బుక్ కావడంతో వెంటనే పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయలేకపోయారు. దీంతో బెంగళూరు వెళ్లిన ప్రకాష్ శనివారం కూబన్ పార్క్ ఠాణాలో కంప్లైంట్ ఇచ్చారు. బీఎన్ఎస్ఎస్ అమలులోకి రాక ముందు క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ) అమలులో ఉండేది. దీని ప్రకారం జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడం తప్పనిసరి కాదు. దీంతో బాధితులు నేరం జరిగిన ప్రాంతం ఏ ఠాణా పరిధిలోకి వస్తే అక్కడకే ఫిర్యాదు చేయాల్సి వచ్చేది. అయితే బీఎన్ఎస్ఎస్‌లోని సెక్షన్ 173 ప్రకారం దేశంలోని ఏ ప్రాంతంలో బాధితుడిగా మారినా తమకు ఉన్న అవకాశాన్ని బట్టి ఏదైనా ఠాణాలో ఫిర్యాదు చేయవచ్చు. దీని ప్రకారం కేసు నమోదు చేయడం ఫిర్యాదు స్వీకరించిన పోలీసుల బాధ్యత. దీంతో ప్రకాష్ శనివారం కూబన్ పార్క్ ఠాణాకు వెళ్లి సైబరాబాద్‌లోని హెచ్ఐసీసీలో తస్కరణకు గురైన బ్యాగ్‌పై ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా కూబన్ పార్క్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 305 (ఎ) ప్రకారం జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసును సైబరాబాద్‌కు పంపాలని బెంగళూరు పోలీసులు నిర్ణయించారు. అక్కడ నుంచి గచ్చిబౌలి ఠాణాకు ఈ కేసు చేరిన తర్వాత ఎఫ్ఐఆర్ నెంబర్‌తో రీ-రిజిస్టర్ చేసే పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో పాటు ఘటనాస్థలి సందర్శన, పంచనామా నిర్వహణ తదితర ప్రక్రియలు పూర్తి చేయాల్సి ఉంటుంది.

ప్రశాంతంగా న్యాయవాద సహకార సంఘం ఎన్నికలు



గిరి తోర్నాల | కోడూరు రవీందర్ రెడ్డి | రామయ్య నాయుడు | సునీల్ భాస్కర్

సిటీ కోర్టులు: న్యాయవాద పరస్పర సహకార సంఘం డైరెక్టర్ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లా కోర్టు నుంచి గిరి తోర్నాల, సిటీ సివిల్ కోర్టు హైదరాబాద్ నుంచి జి.సునీల్ భాస్కర్, నాంపల్లి క్రిమినల్ కోర్టు నుంచి కోడూరు రవీందర్ రెడ్డి, సిటీ సివిల్ కోర్టు సికింద్రాబాద్ నుంచి జీవీఎస్ రామయ్య నాయుడు డైరెక్టర్లుగా విజయం సాధించారు.

ఏ కోర్టులో ఎంత మంది?

- రంగారెడ్డి జిల్లా కోర్టు నుంచి గిరి తోర్నాల 1095 ఓట్లతో గెలుపొందగా.. అరవిందర్ రెడ్డికి 899 ఓట్లు, జి. శ్రీనివాస్ రెడ్డికి 513 ఓట్లు వచ్చాయి.
- సిటీ సివిల్ కోర్టు హైదరాబాద్ నుంచి జి.సునీల్ భాస్కర్ 1923 ఓట్లతో గెలుపొందగా.. టి.ఎస్.కె. త్రిలోక్ రాజ్ 531 ఓట్లు సాధించారు.
- నాంపల్లి క్రిమినల్ కోర్టు నుంచి కోడూరు రవీందర్ రెడ్డి 1385 ఓట్లతో గెలుపొందగా.. కరికే మల్లేశ్ 1082 ఓట్లు సాధించారు.
- సిటీ సివిల్ కోర్టు సికింద్రాబాద్ నుంచి జీవీఎస్. రామయ్య నాయుడు 648 ఓట్లతో గెలుపొందగా.. చామల శ్రీనివాస్ 632 ఓట్లు, అనిల్ కుమార్ వైద్య 611 ఓట్లు, ఏ.విక్రమ్ కుమార్ 571 ఓట్లు సాధించారు.
- గత నెల రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహించిన న్యాయవాదులు..ఆదివారంతో ఎన్నికలు ముగియడంతో గెలుపొందిన వారి పక్షాన సంబరాలు చేసుకున్నారు.

సరికొత్త కేన్సర్ చికిత్స..కార్-టి థెరపీ

సాక్షి, సిటీబ్యూరో: కేన్సర్ వ్యాధిపై పరిశోధన, చికిత్సలకు పేరొందిన సన్‌యాక్ట్ కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ కేన్సర్ రోగుల కోసం అత్యాధునిక చికిత్స విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. దాతల కణాలతో కార్-టి (సిఎఆర్-టి) సెల్ థెరపీ అనే ఈ కేన్సర్ చికిత్సా విధానం దేశంలోనే సరికొత్త వైద్య విధానమని, ఇది చికిత్స వ్యవధిని 6వారాలకు కుదిస్తుందని వివరించారు. ప్రస్తుతం ముంబయిలోని థానెలో ఉన్న తమ ఇన్‌స్టిట్యూట్‌లో దీన్ని అందుబాటులోకి తెచ్చామని త్వరలోనే దేశంలోని ప్రధాన నగరాలన్నింటికీ విస్తరిస్తామన్నారు.

కాటేదాన్‌లో దొంగల బీభత్సం

బ్యాటరీల కంపెనీ నుంచి రూ.50 లక్షలు దోపిడీ



పరిశ్రమలోని బీరువాను పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్

మైలార్‌దేవ్‌పల్లి: కాటేదాన్ పారిశ్రామికవాడలో దొంగలు బీభత్సం సృష్టించారు. కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లారు. డీసీపీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మహేందర్..భవానీ కాలనీలో నివసిస్తూ కాటేదాన్‌లోని బుద్వేల్ ప్రాంతంలో పదేళ్లుగా భారతి ట్రేడర్స్ కంపెనీ నడుపుతున్నాడు. అందులో పాడైన బ్యాటరీలను కొనుగోలు చేస్తూ వాటి భాగాలను విడిగా చేసి ఇతర కంపెనీలకు అమ్మకాలు చేస్తుంటాడు. కంపెనీలో ఐదుగురు వర్కర్స్ పని చేస్తుంటారు. కంపెనీ వ్యాపారానికి సంబంధించి శుక్ర, శనివారాల్లో మొత్తం రూ.50 లక్షలు రూపాయలు కలెక్షన్ వచ్చింది. దీన్ని కంపెనీలోని వర్కర్స్ విశ్రాంతి తీసుకునే రూమ్‌లో ఉన్న బీరువాలో పెట్టి వెళ్లారు. శనివారం అర్ధరాత్రి సుమారు 2.30 ప్రాంతంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి అక్కడే వున్న రాజస్థాన్‌కు చెందిన వర్కర్లను కత్తితో బెదిరించి, బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. వర్కర్స్ యజమానికి ఫోన్ ద్వారా విషయం తెలుపగా..పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ నరేందర్, రాజేంద్రనగర్ ఏసీపీ, డీసీపీకి సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలికి క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో వచ్చి కంపెనీని పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

టీజీపీఈఏకు త్వరలో ఎన్నికలు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్(టీజీపీఈఏ)కు త్వరలోనే ఎన్నికలు నిర్వహించి, కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోవాలని ఆ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఈ మేరకు ఆదివారం తెలంగాణ జెన్‌కో ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యుల జనరల్ బాడీ సమావేశం టీజీపీఈఏ అధ్యక్షుడు పి.రత్నాకర్ రావు అధ్యక్షతన జరిగింది. విద్యుత్ సంస్థల్లో పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, జెన్‌కో ఆధ్వర్యంలో రామగుండం ప్లాంట్‌ను నిర్వహించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరే విద్యుత్ ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేసింది. ఈ సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ.వెంకటనారాయణ రెడ్డి, సెక్రటరీ జనరల్ పి.సదానందం, అడిషనల్ సెక్రటరీ జనరల్ కె.అంజయ్య, ముఖ్య సలహాదారు ఎం.శివశంకర్, సలహాదారు మంగీలాల్‌తో పాటు నాలుగు కంపెనీలకు చెందిన సుమారు 800 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న సుధీర్ రెడ్డి

అత్తాపూర్: సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ..గద్వాల్ ప్రాంతానికి చెందిన పట్ల సుధీర్‌రెడ్డి, శ్వేతారెడ్డి భార్యా భర్తలు. ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసుకుంటూ అత్తాపూర్ కేటీఆర్ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం వీరికి పెళ్లయింది. శ్వేత శనివారం సాయంత్రం అత్తాపూర్‌లో ఉంటున్న తల్లి వద్దకు వెళ్లింది. సుధీర్ రెడ్డి అదేరోజు రాత్రి 10 గంటల సమయంలో ఇంటి ఓనర్ నారాయణకు మా ఊరికి వెళ్లొస్తాను అని చెప్పి బయటికి వెళ్లాడు. ఆ తర్వాత అర్ధరాత్రి దాదాపు ఒకటిన్నర గంటల సమయంలో అత్తాపూర్ పోలీసులు నారాయణ ఇంటికి చేరుకున్నారు. మీ ఇంట్లో అద్దెకు ఉంటున్న సుధీర్‌రెడ్డి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయం అతని స్నేహితుడికి ఫోన్ ద్వారా తెల్పగా..100కు డయల్ చేసి పోలీసులకు తెల్పినట్లు వెల్లడించారు. కాగా సుధీర్ రెడ్డి రాత్రి 10 గంటల సమయంలో గజ్వేల్‌కు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లాడని, తిరిగి ఇంటికి ఎప్పుడు వచ్చాడో తాము గమనించలేదని నారాయణ దంపతులు పోలీసులకు తెలిపారు. అనంతరం పోలీసులు ఇంటి ఓనర్ సహాయంతో తలుపులు పగులగొట్టి చూడగా అప్పటికే సుధీర్‌రెడ్డి ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని శవ పరీక్ష నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యార్థి దశలోనే మంచి విద్యార్థిగా పేరు తెచ్చుకున్న సుధీర్ రెడ్డి చాలా మంచివాడని, ఎలాంటి వ్యసనాలు లేవని స్నేహితులు శ్రీకాంత్, కిరణ్‌లు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆక్రమించి.. షెడ్లు వేసి!

సర్కారు స్థలంలో అక్రమార్కుల పాగా



పెద్ద అంబర్‌పేట్ సర్వే నంబర్ 244/34లో వెలసిన అక్రమ నిర్మాణాలు

- ఎన్‌హెచ్ 65కి ఆనుకుని ఉన్న విలువైన భూములు అన్యాక్రాంతం
- పెద్ద అంబర్‌పేట్ సర్వే నంబర్ 244/34లో అక్రమ నిర్మాణాలు
- ఇటు కూల్చివేతలు.. అటు షెడ్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ భూముల అన్యాక్రాంతానికి అడ్డు కట్ట పడడం లేదు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న విలువైన భూములు కబ్జా అవుతున్నా.. రాత్రికి రాత్రే అక్రమ నిర్మాణాలు, భారీ షెడ్లు వెలుస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడు. ఫలితంగా రూ.కోట్ల విలువ చేసే సర్కారు భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. కంటికిరెప్పలా కాపాడాల్సిన క్షేత్రస్థాయిలోని కొంతమంది పంచాయతీ అధికారులు పాత తేదీల్లో ఇంటి నంబర్లు, ఆస్తి పన్ను చెల్లింపు రసీదులు జారీ చేస్తుండటం విశేషం. వీరికి రాజకీయ ప్రముఖుల సహకారం కూడా ఉండటంతో వారి ఆక్రమణలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది.

సర్వే నంబర్ 244లో ఆక్రమణలు

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట్ కలాన్ సర్వే నంబర్ 244లో వందకుపైగా ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇటు ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి అటు విజయవాడ జాతీయ రహదారికి ఆనుకుని అబ్దుల్లాపూర్‌మెట్ శివారులోని గండిమైసమ్మ దేవాలయం వరకు విస్తరించి ఉన్నాయి. ప్రభుత్వం ఏళ్ల క్రితమే పేదలకు ఈ భూమిని అసైన్డ్ చేసింది. ఆ తర్వాత ప్రభుత్వ అవసరాల కోసం పీఓటీ కింద ఆయా భూములను వెనక్కి తీసుకుంది. దీనిలో కొంత భూమిని ఓఆర్ఆర్‌లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారంగా ఎకరాకు వెయ్యి గజాల చొప్పున ప్లాట్లు ఇచ్చింది. వీటికి ఆనుకునే మరికొంత ప్రభుత్వ భూమి మిగిలి ఉంది. తాజాగా జాతీయరహదారి విస్తరణ పనులు కొనసాగుతుండటంతో ఈ భూములకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. సర్వే నంబర్ 244/34లోని భూమిని కూడా పీఓటీ కింద వెనక్కి తీసుకుంది. దీనికి ఎలాంటి పాసుపుస్తకాలు కూడా జారీ చేయలేదు. స్థానికంగా ఉన్న ఓ ప్రజాప్రతినిధి గత రికార్డుల్లో ఉన్న భూమికి మించి ఆక్రమించారు. నిజానికి ఈ భూములు అమ్మడం, కొనడం నిషేధం. నిర్మాణాలకు కూడా అనుమతులు లేవు. కానీ సదరు ప్రజాప్రతినిధి తన కున్న రాజకీయ పలుకుబడిని అడ్డుపెట్టుకుని ఆయా భూముల్లో అక్రమ నిర్మాణాలకు తెరలేపారు. మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉండగా గుట్టుగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటిపై ఫిర్యాదులు అందడంతో రెవెన్యూ అధికారులు రెండు నెలల క్రితమే కూల్చివేశారు. అయినా ఆయన మాత్రం ఆక్రమణలను ఆపలేదు.

ఖాళీ ప్లాట్లకు ఇంటి నంబర్లు

తారామతిపేట సర్వే నంబర్ 215,216,217లో 39 ఎకరాల భూదాన్ భూమి ఉంది. ఈ భూముల్లో ఎలాంటి నిర్మాణాలకు అనుమతులు లేకున్నా ఇక్కడ పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శి అడ్డగోలుగా పర్మిషన్లు జారీ చేశారు. ఏకంగా 21 ఖాళీ ప్లాట్లకు ఇంటి నంబర్లు జారీ చేయడంతో పాటు వాటి నుంచి ఇంటి పన్ను కూడా వసూలు చేయడం విశేషం. అదే గ్రామంలో ఓ కమర్షియల్ భూమిలో ఫంక్షన్ హాల్‌కు అనుమతిచ్చారు. బాటసింగారం పంచాయతీ కార్యదర్శి సింగరేణి కాలనీలో కూడా ఓపెన్ ప్లాట్లకు ఇంటి నంబర్లు జారీ చేసి, ఇంటి పన్ను చెల్లించినట్లు రసీదులు జారీ చేశారు. వీరి అక్రమాలపై ఇటీవల పలువురు స్థానికులు రెవెన్యూ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ అంశంపై తహసీల్దార్ విచారణ చేపట్టి, జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. ఎంపీఓ ఫిర్యాదు మేరకు ఆయా పంచాయతీ కార్యదర్శులపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది.

ఆక్రమణలను ఉపేక్షించేది లేదు

ప్రభుత్వ భూములను ఆక్రమించి, అక్రమ నిర్మాణాలు చేపట్టే వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోం. ఇప్పటికే గొర్రెల్లి సర్వే నంబర్ 238లోని భూమి నుంచి వెంచర్‌కు రోడ్డు వేసిన వారిపై కేసు నమోదు చేయించాం. రెండు వైపులా కందకాలు తవ్వి, వెంచర్‌లోకి వెళ్లే ప్రధాన రహదారులను మూసివేయించాం. భూదాన్ భూముల్లో నిర్మాణాలకు అండగా నిలిచిన పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఇప్పటికే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. సర్వే నంబర్ 244/34లోని భూమిని పరిశీలిస్తాం. అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగిస్తాం. – రవీందర్‌దత్తు, తహసీల్దార్, అబ్దుల్లాపూర్‌మెట్

ఫుట్‌పాత్‌ను ఢీకొన్న బైకు: ఒకరి మృతి

- ఖైరతాబాద్ ఫ్లై ఓవర్‌పై ప్రమాదం



గాయాలతో ఫుట్‌పాత్‌పై పడిపోయిన యువకులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృత్యు వాతపడ్డారు. ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం ..బంజారాహిల్స్‌లోని గౌరీశంకర్ కాలనీలో నివాసముండే రాజ్‌కుమార్ (18) అమీర్‌పేట్‌లోని ఓ జ్యూవెలరీలో పనిచేస్తున్నాడు. సాయంత్రం 4 గంటల ప్రాంతంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న వివేక్ (25)తో కలిసి బైక్ (టిఆర్ నెంబర్)పై ఖైరతాబాద్ చౌరస్తా నుంచి ఐమాక్స్ చౌరస్తా వైపు బయలుదేరారు. ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మధ్యలోకి రాగానే బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్‌ను ఢీ కొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే లక్డీకాపూల్‌లోని ఓ హాస్పిటల్‌కు చికిత్సకోసం తరలించగా..వివేక్ మృతిచెందాడు. వీరి వెనుకే బైక్‌పై వస్తున్న మరో స్నేహితుడు నితీష్ ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దేవాలయ భూములకు జియో ట్యాగింగ్

తుర్కయంజాల్: దేవాలయ భూములను కాపాడటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని.. రాష్ట్రంలోని అన్ని దేవాలయ భూములకు జియో ట్యాగింగ్ చేపట్టనున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీ మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన శ్రీవైష్ణవ సేవా సంఘం రజోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్చకుల బదిలీలను చేపట్టబోమని, పెండింగ్‌లో ఉన్న ఓవర్‌సీస్ ఎడ్యుకేషన్ లోన్స్ అన్నింటినీ క్లియర్ చేస్తామని తెలిపారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్ స్వామి మాట్లాడుతూ.. ఆలయాల భూములను రక్షించడంతో పాటు అన్యాక్రాంతమైన వాటి విషయంలోనూ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి బ్రాహ్మణ కుటుంబంలో ఒక్కరినైనా వైదిక మార్గంలో నడిచేలా చూడాలని అన్నారు.

చిలుకూరు ఆలయంలో ఆర్మీ మేజర్ జనరల్

మొయినాబాద్: బైసన్ డివిజన్ ఆర్మీ మేజర్ జనరల్ అఖిలేష్‌కుమార్ ఝా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మండల పరిధిలోని చిలుకూరు బాలాజీని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి గర్భగుడిలోకి వెళ్లి స్వామి వారిని దర్శించుకున్నారు. రంగరాజన్ స్వామి వారి పూలమాలతో వారికి ఆశీర్వాదం అందజేశారు. ఆలయ విశిష్టతను వివరించారు.



భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి

• సాయిబాబా ఆలయాలకు పోటెత్తిన భక్తులు • బంజారాహిల్స్ ఆలయంలో సాయి వ్రతం • ఆలయాల్లో హోమాలు, ప్రత్యేక పూజలు

గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే సాయిబాబా ఆలయాల్లో స్వామివారికి విశేష అభిషేకాలతో పాటు అర్చనలు, పూజాదికాలు నిర్వహించారు. ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్, ఫిలింనగర్, ముక్తిధామం, పంజగుట్ట ద్వారకాపురి కాలనీ, వెంగళరావుకాలనీ, రహమత్‌నగర్ తదితర సాయిబాబా ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల వద్ద భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమాలను నిర్వాహకులు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని విశ్వసాయి మందిరంలో స్వామివారికి ఉదయం 4.30 గంటలకు ధూపసేవ, సంకల్పం, గణపతి పూజ, శ్రీ దత్తారాధన, క్షీరాభిషేకం, విశేష అలంకరణ, అర్చన, నక్షత్ర హారతి, కుంభ హారతి, నీరాజన మంత్రపుష్పం, సాయిబాబా ప్రయుక్త దత్తాత్రేయ మూల మంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, సాయి వ్రతం పూజాదికాలు నిర్వహించారు. ఎన్టీటీ నగర్ అయ్యప్ప స్వామి ఆవరణలో కొలువుదీరిన సాయిబాబా ఆలయంలో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి హోమం, పూజలు నిర్వహించారు.

– బంజారాహిల్స్


ఫిలింనగర్ దైవసన్నిధానంలో..


పంజగుట్ట ద్వారకాపురి కాలనీ సాయిబాబా ఆలయంలో




ఎన్టీటీనగర్ పూజల్లో పాల్గొన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



బంజారాహిల్స్‌లోని విశ్వసాయి మందిరంలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు




ఫిలింనగర్ ముక్తిధామంలో..


పంజగుట్ట ఆలయంలో..




బోరబండలో అన్నదానంలో కార్పొరేటర్


జీటీఎస్ దేవాలయంలో పూజలు


శ్రీకృష్ణానగర్‌లోని సాయిబాబా దేవాలయంలో


హేమావతినగర్‌లో పూజల్లో పాల్గొన్న భక్తులు

శాకంబరిగా కనకదుర్గా దేవి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన శ్రీ కనకదుర్గా దేవి అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకరించారు. ఆషాఢ మాసం సందర్భంగా ప్రతియేటా అమ్మవారికి శాకంబరి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని ఆలయ అర్చకులు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వచ్చి పూజల్లో పాల్గొన్నారు.


శాకంబరి అలంకరణలో అమ్మవారు

తపో జ్ఞాని భగీరథ మహర్షి


భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాల వేస్తున్న సగర సంఘం నాయకులు

బంజారాహిల్స్: గురుపౌర్ణమి సందర్భంగా సగర ఉప్పర కుల గురువైన భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాల వేసి ఆయన చేసిన సేవలను పలువురు కీర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగీరథ మహర్షి తపో జ్ఞాని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఫిలింనగర్ సగర (ఉప్పర) సంఘం నాయకులు ఎస్వీ శ్రీను సాగర్, ఎస్. మధుకర్‌సాగర్, ఆవుల రాజన్నసాగర్, గుంటి నగేష్ సాగర్, కల్లేపల్లి ఈశ్వర్ సాగర్, చీర్ల నాగరాజు సాగర్, ఏ.కృష్ణ, తిరుపతయ్య సాగర్, మోడల విష్ణుసాగర్, గోపీసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన మువ్వా విజయ్‌బాబు


మువ్వా విజయ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

బంజారాహిల్స్: తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం లంకపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత మువ్వా విజయ్‌బాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నెం. 13లోని నీటి పారుదల శాఖ కార్యాలయంలో అట్టహాసంగా జరిగింది. దీంతో ఆయనకు ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పలువురు నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు


పూజల్లో పాల్గొన్న రచయిత పరుచూరి గోపాలకృష్ణ

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవసన్నిధానంలో శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి వ్రతాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఆదివారం జరిగిన ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతినెల పౌర్ణమి రోజు రమా సమేత సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. ఈ వేడుకల్లో రచయిత పరుచూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేరు కులస్తులను బీసీ-ఏలో చేర్చాలి

తెలంగాణ మేర సంఘాల జేఏసీ

హిమాయత్‌నగర్: కుల వృత్తి మీద ఆధారపడి జీవిస్తున్న మేర కులస్తులను బీసీ-డీ నుంచి సవరించి బీసీ-ఏలో చేర్చాలని తెలంగాణ మేర సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మునిగాల రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ డిమాండ్ల పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని మేర కులస్తులు బట్టలు కుట్టే పని వృత్తి మీదనే ఆధారపడి జీవిస్తున్నారని, పాఠశాల యూనిఫాంలను కుట్టే టెండర్లను ప్రభుత్వం మేర కులస్తులకే కేటాయించి తమను ఆదుకోవాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలలో వివిధ స్థాయిలో ఉన్న మేర కులస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని, నామినేటెడ్ పదవులు ఇచ్చి ఆదుకోవాలని జేఏసీ వ్యవస్థాపకులు సంఘం వెంకట్రాజం విజ్ఞప్తి చేశారు. రజకులకు మాదిరిగా తమకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేరక జేఏసీ కో కన్వీనర్లు విష్ణు, మేడిగ సంతోష్, శ్రీనివాస్,కొత్త కొండ శ్రీనివాస్,కందుల ఉమా పతి రావు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యవాణి చెప్పిన అపర మేధావి శ్రీపోతులూరి



పంజగుట్ట: ఎన్నో ఏళ్లకంటే ముందే భవిష్యవాణి చెప్పిన అపర మేధావి శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని పలువురు వ్యక్తులు అ న్నారు. తాత్విక చింతనకు 400 సంవత్సరాలకు ముందే పునాదులు వేసిన మహానుభావుడు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని అన్నారు. ఆదివారం గురు పౌర్ణమి పురస్కరించుకుని విశ్వకర్మ ఫౌండేషన్ సేవా సమితి ఆధ్వర్యంలో వీరబ్రహ్మేంద్ర స్వామి చిత్రపటానికి పూలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ తాటికొండ వెంకట రాజయ్య, సమితి అధ్యక్షులు ఎ.రవీంద్రాచారి, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి ప్రొఫెసర్ రఘువీర్‌లు మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్ర స్వామి సమాజానికి స మానత్వం, శాంతి చేకూర్చేందుకు తాత్విక చింతనతో మార్గదర్శనం చేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు విఠలాచార్యులు, రాజేంద్రప్రసాద్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'అన్‌శాట్' షెడ్యూల్ విడుదల

బంజారాహిల్స్: పేద విద్యార్థుల కలలను నెరవేర్చే దిశగా అన్ అకాడమీ సంస్థ వరుసగా నాలుగోసారి అన్‌శాట్ (అన్ అకాడమీ నేషనల్ స్కాలర్‌షిప్ అండ్ ఆప్టిట్యూట్ టెస్ట్)ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బంజారాహిల్స్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఆర్ గ్రూప్ స్కూల్ డైరెక్టర్ లావణ్య, సాధు వాస్వానీ ఇంటర్నేషనల్ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ నిహిత, న్యాయవాది వంశీధర్‌రెడ్డిలతో పాటు ఎల్‌టీ కల్నల్ ఆర్మీ ఆఫీసర్ మృత్యుంజయ్‌కుమార్, గైనకాలజిస్ట్ శశికళ తదితరుల చేతుల మీదుగా అన్‌శాట్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఐఐటీ జేఈఈ, నీట్ యూజీ కోసం సిద్ధమవుతున్న విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా అతిపెద్ద స్కాలర్‌షిప్ పరీక్షగా వారు పేర్కొన్నారు. అగ్రశ్రేణి విద్యార్థులు, దేశంలో ఉన్న మెరికల్లాంటి విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్ కోసం పోటీ పడుతుంటారన్నారు. రౌండ్-1 సెప్టెంబర్ 22– అక్టోబర్ 20 వరకు (రెండు స్లాట్లు : ప్రతిరోజూ మధ్యాహ్నం 12 నుంచి 1 వరకు), రౌండ్ 2 నవంబర్ 10 నుంచి ఉంటుందని వివరించారు. రౌండ్-1లో ఆన్‌లైన్ విధానంలో, రౌండ్-2లో అన్ అకాడమీ కేంద్రాల్లో జరుగుతాయని తెలిపారు. 6 నుంచి 12వ తరగతి వరకు, ఐఐటీ, నీట్‌కి ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు ఈ పరీక్షలకు అర్హులుగా పేర్కొన్నారు. ఎలాంటి పరీక్ష రుసుం ఉండదన్నారు. నవంబర్‌లోనే ఫలితాల ప్రకటన ఉంటుందని వివరించారు.

జలమండలి ఎండీకి వినతి

బంజారాహిల్స్: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జలమండలిలో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేయాలని జలమండలి ఓసీ, బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఓసీ అసోసియేషన్ అధ్యక్షులు కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జలమండలి ఓసీ, బీసీ ఉద్యోగుల సంఘం ఎండీ అశోక్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేశారు. అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆదేశాలపరంగా రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను అమలు చేయడం లేదని ఈ సందర్భంగా వారు ఎండీకి వివరించారు. అమలులో ఆలస్యం చేయడం వల్ల చాలా మంది అధికారులు, ఉద్యోగులు ఫలాలు అనుభవించకుండా పదవీ విరమణ చేస్తున్నారని, వెంటనే చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. పదోన్నతుల్లో తీవ్రంగా నష్టపోతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఓసీ అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలను సైతం జలమండలి బేఖాతరు చేస్తూ ఓసీ, బీసీ ఉద్యోగుల పదోన్నతులకు తీవ్ర నష్టం చేకూర్చేవిధంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. జలమండలి యాజమాన్యం వెంటనే కోర్టు ఆదేశాలను అమలు చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు.


జలమండలి ఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఓసీ, బీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

జయరాజుకు మంత్రి పొన్నం పరామర్శ

లక్డీకాపూల్: తీవ్ర అస్వస్థతతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కవి, గాయకుడు జయరాజ్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరామర్శించారు. హైపర్ టెన్షన్‌తో బాధపతున్న జయరాజ్ స్వల్ప బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో ఆయనకు నిమ్స్ కార్డియాలజీ, న్యూరాలజీ విభాగాలు మెరుగైన వైద్యసేవలను అందిస్తున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో జయరాజ్ త్వరగా కొలుకుని బయటకు రావాలని పొన్నం ఆకాంక్షించారు. జయరాజ్‌ను పరామర్శించినలో సినీ దర్శక, నిర్మాత బి. నర్సింగరావు తదితరులు ఉన్నారు. కాగా నిమ్స్‌లోని మెట్టు రంగారెడ్డి బ్లాక్‌లో చికిత్స పొందుతున్న జయరాజ్ ఆరోగ్య పరిస్థితిపై ఇప్పటికే రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారని, ఆయనకు అత్యాధునిక వైద్యసేవలను అందించాలని ఆదేశించినట్లు నిమ్స్ వైద్య వర్గాలు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, మరో రెండు, మూడు రోజుల్లో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసే అవకాశం ఉందని నిమ్స్ అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. రాకేష్ తెలిపారు.


జయరాజును పరామర్శిస్తున్న మంత్రి

మద్యం తాగించి బైక్, ఫోన్ చోరీ

వెంగళరావునగర్: మద్యం తాగించి రాపిడో డ్రైవర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి బైక్, ఫోన్ చోరీ చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నెల్లూరు ప్రాంతానికి చెందిన కె. సురేష్ మధురానగర్‌కాలనీ హాస్టల్‌లో ఉంటూ ర్యాపిడో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తుంటాడు. ఈనెల 19న సాయంత్రం విధులు ముగించుకుని యూసుఫ్‌గూడ కల్లు కాంపౌండ్ ప్రాంగణంలో తన వాహనాన్ని నిలిపి కల్లు సేవించాడు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి కలసి విస్కీ కూడా తాగుదామని సలహా ఇచ్చాడు. దీంతో ఇద్దరూ వాటిని సేవించిన తర్వాత సురేష్‌కు ఫోన్ రాగా పక్కకు వెళ్ళి ఫోన్ మాట్లాడి వచ్చేలోగా గుర్తు తెలియని వ్యక్తి కనిపించ లేదు. తన వాహనం కోసం పార్కింగ్ స్థలానికి వెళ్ళగా వాహనంతో పాటుగా అందులో ఉంచిన మరో ఫోన్ కనిపించ లేదు. కంగారుగా అతని కోసం చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆదివారం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆకట్టుకున్న 'ఫ్యాషన్ జిరాఫీ ఎగ్జిబిషన్'


ఎగ్జిబిషన్‌లో కొనుగోళ్ళ దృశ్యాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 1లోని పాప అప్ స్పేస్‌లో ఫ్యాషన్ జిరాఫీ సీజన్ 4 పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఎగ్జిబిషన్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రసిద్ధి గాంచిన చేనేత ఉత్పత్తులు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వారణాసి, కాంచీపురం, గద్వాల్, పోచంపల్లి ఇలా ప్రఖ్యాతి గాంచిన చేనేత ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. డిజైనరీ ఆభరణాలు సైతం ప్రదర్శించారు. స్వయం ఉపాధి మహిళలను, చేనేత కార్మికులను, హస్తకళ కార్మికులను ప్రోత్సహించేందుకు ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు స్నేహ, మానస, స్నిగ్ధ తెలిపారు. మరికొన్ని రోజుల్లో సీజన్ 4 ఎగ్జిబిషన్‌ను ప్రకటిస్తామని తెలిపారు.

ప్రమాణ స్వీకారం..

వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసింది. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎం.ప్రతాప్‌రెడ్డితో పాటు ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, కోశాధికారి, జాయింట్ సెక్రటరీలుగా విజయం సాధించిన కోడె సాంబశివరావు, ఎం.వి.మనోహర్ రావు, కె.సుగుణ, సి.హనుమంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఏ.సాంబశివరావు, ఐ.రాజేంద్రప్రసాద్, కోనేరు ఓం ప్రకాశ్, జి.నాగేశ్వరరావు, ఎం. ఉప్పలయ్య, కె.సత్యసాయి కుమార్, పి.శ్రీనివాస్, గాలి గోపాల్‌రెడ్డి తదితరులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. వీరితో పాటుగా 8 బ్లాకుల నుంచి 16 మంది ఎగ్జిక్యూటీవ్ కమిటీ మెంబర్లు ప్రమాణం చేశారు. వీరి పదవీ కాలం రెండేళ్ళ పాటు ఉంటుంది. ఈ సందర్భంగా నూ తన కమిటీ నేతలు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి ఐక్యంగా ముందుకు నడుస్తామని పేర్కొన్నా రు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాలనీవాసుల సహకారంతో సమస్యలు లేకుండా తీర్చిది ద్దుతామని హామీనిచ్చారు. కాలనీవాసులందరూ గతంలో మాదిరిగానే నూతన కార్యవర్గానికి కూ డా సహకరించాలని కోరారు.

కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

హిమాయత్‌నగర్: రైల్వే సర్వీస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల కార్యవర్గాన్ని రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం నారాయణగూడలో జరిగిన సమావేశంలో ఈ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు అన్నారెడ్డి జైపాల్‌రెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బురుగు మోహన్‌రెడ్డి, కోశాధికారి మారం రెడ్డి విష్ణుభాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడుగా గుంటి కుమారస్వామిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా సి.మధుసూదన్, దూళిమూడి కృష్ణమోహన్, నాంపల్లి అనురాధలు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యవర్గం రెండేళ్ళపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఉద్యమకారులపై స్పష్టమైన ప్రకటన చేయాలి

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డా.చీమ శ్రీనివాస్

హిమాయత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీల అమలుకు రానున్న అసెంబ్లీ సమావేశాలలో స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డా.చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన 250 ఇంటి స్థలం, పెన్షన్ హామీలను ఈనెల 23 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులను గుర్తించడానికి ఒక కమిటీ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి పది వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. సెప్టెంబర్ 14న తెలంగాణ ఉద్యమకారుల సన్మాన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డిని ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి సురేందర్ రెడ్డి, జానకి రెడ్డి, నరేందర్ గౌడ్, ఇంద్ర కుమార్, యాదిరెడ్డి, వీరస్వామి, రామచందర్, కీర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చీమ శ్రీనివాస్

గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి



పంజగుట్ట: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు వెంటనే గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి రూ. 500 కోట్ల నిధులు కేటాయించాలని గల్ఫ్ జేఏసీ ప్రభుత్వాన్ని కోరింది. ప్రతీ సంవత్సరం గల్ఫ్ కార్మికులు సుమారు 300 మంది వరకు మృతి చెందుతున్నారని వారిని ఆదుకునే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు. టీపీసీసీ ఎ న్‌ఆర్‌ఐ విభాగం చైర్మన్ బి.ఎమ్.వినోద్ కుమార్, టీపీసీసీ గల్ఫ్ ఎన్‌ఆర్‌ఐ కన్వీనర్ సింగిరెడ్డి నరేందర్ రెడ్డి, స్వదేశ్, మురళీధర్ రెడ్డి, మంద భీంరెడ్డి, దాసు సురేష్‌లు మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో వెంటనే గల్ఫ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చెయ్యాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఏప్రిల్ 16వ తేదీన గల్ఫ్ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం రేవంత్‌రెడ్డి గల్ఫ్ దేశాలతో పాటు, ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల్లో పనిచేస్తున్న తెలంగాణ ప్రవాసీయుల సంక్షేమానికి ఒక ప్రత్యేక వ్యవస్థను నెలకొల్పుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గల్ఫ్ మృతుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు టి.ధర్మేందర్, బషీర్ హమీద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తొలగింపుతో పంజగుట్ట కూడలి విశాలం

హర్షం వ్యక్తం చేస్తున్న వాహనదారులు

బంజారాహిల్స్: ఇన్నాళ్లూ పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు గేటుకు రెండు వైపులా నిబంధనల ఉల్లంఘన కింద సీజ్ చేసిన వాహనాలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడంతో రోడ్డంతా నిండిపోయి అస్తవ్యస్తంగా ఉండేది. ఏళ్లతరబడి సీజ్ చేసిన వాహనాలతో చెత్తా చెదారం, వ్యర్థాలు పేరుకుపోయి పారిశుద్ధ్య సమస్య తలెత్తడమే కాకుండా పంజగుట్ట పోలీస్‌స్టేషన్ వైపు నుంచి బంజారాహిల్స్ నాగార్జున సర్కిల్ వైపు ఫ్రీ లెఫ్ట్ కూడా సమస్యగా ఉండేది. వెస్ట్‌జోన్ ట్రా ఫిక్ ఏసీపీగా కట్టా హరిప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన తరువాత పేరుకుపోయిన ఈ వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించా రు. ఈ సమస్యను పరిష్కరించే దిశలో ఆయన ఈ వాహనాలను అగర్వాల్ కంటి ఆస్పత్రి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో భద్రపరిచి సెంట్రీలను ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు రోడ్డంతా విశాలమైంది. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ప్రముఖులు రాకపోకలు సాగించే పంజగుట్ట చౌరస్తాను సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో ఇక్కడి నుంచి వాహనాలన్నింటినీ తరలించిన పోలీసులు బీటీ రోడ్డు వేయించి ఫుట్‌పాత్ నిర్మించి మొక్కలు నాటాలని ప్రణాళికలు కూడా రూపొందించారు. ఇక్కడ ఉన్న ఆటోస్టాండ్‌ను కూడా పక్కనే ఉన్న సందులోకి మార్చడం ద్వారా ఈ చౌరస్తా విశాలమవడమే కాకుండా సుందరంగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంటుందని యోచిస్తున్నారు. ఖైరతాబాద్ జెడ్సీ అనురాగ్ జయంతితో ఇటీవల ఏసీపీ హరిప్రసాద్ సమావేశమై ఈ చౌరస్తాను తీర్చిదిద్దేందుకు సహకరించాలని, ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నుంచి బీటీ రోడ్డును వేయడంతో పాటు ఫుట్‌పాత్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి పీఎస్ ముందు బీటీ రోడ్డు వేయడంతో పాటు ఫుట్‌పాత్ నిర్మించి వన మహోత్సవంలో మొక్కలు నాటితే నగరంలోనే ప్రముఖమైన ఈ కూడలి మరింత ఆకర్షణీయంగా మారుతుంది.


పంజగుట్ట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ముందు వాహనాలు తొలగించడంతో విశాలంగా మారిన రోడ్డు



లష్కర్ బోనాల ఉత్సవాల్లో భక్తుల సందడి

వెల్లువెత్తి.. బోనమెత్తి..!



అమ్మవారికి మొక్కుతున్న ఈటల

లష్కర్ బోనాలకు తరలిన లక్షల జనాలు

- ఎడతెరిపి లేకుండా వానలు..
- ఎక్కడ చూసినా బోనాలు..
- మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు



కిషన్‌రెడ్డితో దానం కరచాలనం

రాంగోపాల్‌పేట్: ఎడతెరిపి లేకుండా వానలు... ఎక్కడ చూసినా బోనాలు... అమ్మవారు ఆవహించిన శివసత్తుల పూనకాలు.. డప్పుల దరువులు.. యువతీ, యువకుల నృత్యాల కోలాహలు... తరలివచ్చిన మహిళాభక్తులు... తలపై బోనాలు... తలపుల్లో కోర్కెలు.. బోనం, సాక సమర్పించేందుకు కదిలిన భక్తజనసంద్రం... కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి మహంకాళి అమ్మవారిని దర్శించుకుని తరించాలని క్యూ లైన్లలో బారులు తీరిన వైనం.. ఇదీ సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర సన్నివేశం. ఆదివారం లష్కర్ భక్తజనసంద్రమైంది.. అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేపట్టారు. భక్తులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించారు. ఈ ప్రాంతం మొత్తం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీసమేతంగా వచ్చి బంగారు బోనాన్ని అమ్మవారికి సమర్పించారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నంద, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి అమ్మవారికి బోనం సమర్పించారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎంపీ ఈటల రాజేందర్, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మల్లారెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హన్మంతరావు, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, పీసీసీ నాయకులు మహేష్‌కుమార్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు, ముఖ్యమంత్రి సోదరుడు తిరుపతిరెడ్డి కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.



ఉత్సవాలకు హాజరైన దత్తాత్రేయ



బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లు చేపట్టాం. ఎక్కడ ఎలాంటి చిన్న అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 1500 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బందితో ఏర్పాట్లు చేపట్టాం.

ప్రశాంతంగా ఉత్సవాలు
కమిషనర్ శ్రీనివాసరెడ్డి

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని..: పొన్నం

సకాలంలో వర్షాలు కురిసి, రైతాంగం బాగుండాలని, రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నా. జంటనగరాల్లో జరుగుతున్న ఈ బోనాల ఉత్సవాల్లో పాల్గొనే భక్తులందరికీ హైదరాబాద్ ప్రజలు గొప్ప ఆతిధ్యాన్ని అందిస్తున్నారు.

ప్రభుత్వం సహకరిస్తుంది: సీతక్క

ఎన్ని రంగాల్లో ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకున్నా మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి. తెలంగాణ ప్రజలు భావి తరాలకు ఈ బోనాల ఉత్సవాలను అందిస్తున్నారు. దానికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోంది.

సంస్కృతికి ప్రతీక బోనాలు: దత్తాత్రేయ

ఆషాఢ మాసం వచ్చిందంటే జంటనగరాల్లో బోనాల ఉత్సవాల ప్రత్యేకత ఎంతో ఉంటుంది. ఈ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే బాధ్యత మనపై ఉంది.

అమ్మవారి ఆశీస్సులు ఉండాలి: కిషన్‌రెడ్డి

కొన్ని వందల సంవత్సరాల నుంచి బోనాల ఉత్సవాలు ప్రజలు జరుపుకుంటున్నారు. ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నా. బోనాల జాతరను ప్రాశస్త్యాన్ని గుర్తించి ప్రత్యేక నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రికి అభినందనలు.

బోనాలు తెలంగాణకే ప్రత్యేకం: లక్ష్మణ్

ఈ బోనాల ఉత్సవాలు తెలంగాణకే ప్రత్యేకం. ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది, ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ ఇదివరకు ఈ ఆలయాన్ని దర్శించుకున్నారు.

స్త్రీలను గౌరవించుకోవాలి: ఈటల

స్త్రీలను గౌరవించడం భారతీయ సంస్కృతి. అందులో భాగమే ఈ బోనాలు. గోల్కొండ నుంచి లాల్‌దర్వాజా వరకు లక్షల మంది మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు. రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నా.

సింహవాహిని... జనవాహిని..

పాతబస్తీలో అంగరంగ వైభవంగా ఘటాల సామూహిక ఊరేగింపు



చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలలో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి సామూహిక ఘటస్థాపన ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఓవైపు వర్షం కురుస్తున్నా భక్తులు ఘటస్థాపన ఊరేగింపును తిలకించడానికి అత్యధిక సంఖ్యలో హాజరయ్యారు. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఊరేగింపు మేళతాళాలు... డప్పు దరువులు... బ్యాండ్ మేళాలు....వేప కొమ్మలతో శివసత్తులు, పోతురాజులు, కళాకారుల నృత్యాలు దారి పొడవున భక్తులను ఆకట్టుకున్నాయి. శాలిబండలోని కాశీవిశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ఘటస్థాపన ఊరేగింపు లాల్‌దర్వాజా మోడ్ మీదుగా అమ్మవారి దేవాలయాల వరకు కొనసాగింది. ఊరేగింపు అనంతరం ఆయా దేవాలయాల్లో ఘటస్థాపన జరిగింది. ఆదివారంరాత్రి అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపుకు లాల్‌దర్వాజా మోడ్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి రాజ్యసభ సభ్యులు మందడి అనీల్ కుమార్ యాదవ్‌తో పాటు ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య, మాజీ చైర్మన్ రాకేష్ తివారి, ఉపాధ్యక్షులు మధుసూదన్ యాదవ్ తదితరులు ఘటాలకు స్వాగతం పలికారు. 22 దేవాలయాలకు చెందిన ఘటాలు భక్తుల కోలాహలం నడుమ ముందుకు కదిలాయి.





ఆదివారం పాతబస్తీలో ఘటాల ఊరేగింపు దృశ్యాలు

చైతన్యాన్ని అందించాల్సిన బాధ్యత రచయితలదే..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సామాజిక, సాంస్కృతిక చైతన్యాన్ని అందించాల్సిన బాధ్యత రచయితలు, కళాకారులదేనని పలువురు వక్తలు అన్నారు. సాహిత్యోద్యమంలో రచయిత నిర్మలానంద జీవితాంతం నిబద్ధతతో శ్రమించిన కలంయోధులని కొనియాడారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రజాసాహితీ పత్రిక సంపాదకులు నిర్మలానంద 6వ వర్ధంతి సందర్భంగా నేటి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు-సాహితీ సాంస్కృతిక ఉద్యమ కర్తవ్యాలు అనే అంశంపై ఆ సంస్థ కార్యదర్శి డాక్టర్ భట్టు లక్ష్మీనారాయణ అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న రచయిత్రి షీలా సుభద్రాదేవి, రచయిత నాళేశ్వరం శంకరం, జనసాహితీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బి.అరుణ, స్త్రీ సంఘటన ఎడిటర్ లక్ష్మి తదితరులు మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో అణచివేత, దురాగతాలకు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా, నిరంతరంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సాహితీ, సాంస్కృతిక రంగాల్లో యువతరాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత నేటి రచయతలకు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసాహితీ జంట నగరాల అధ్యక్షుడు కె.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను చంపేందుకు బీజేపీ కుట్ర

ఢిల్లీ ఆప్ నేత దిలీప్ పాండే ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న దిలీప్ పాండే, డాక్టర్ దిడ్డి సుధాకర్

హిమాయత్‌నగర్: ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను బీజేపీ ప్రభుత్వం చంపేందుకు కుట్రలు చేస్తోందని, ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తోందని ఢిల్లీ అసెంబ్లీ చీఫ్ విప్, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి దిలీప్ పాండే, అన్నారు. అందులో భాగంగానే దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ ఆప్ నాయకులను జైళ్లలో పెడుతోందని ఆరోపించారు. ఆదివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తో కలసి ఆయన మాట్లాడారు.బీజేపీకి సరైన ప్రత్యామ్నాయం ఆమ్ ఆద్మీ పార్టీ అని గుర్తించి, దానిని నామరూపాలు లేకుండా చేయాలని చూస్తోందన్నారు. కేజ్రీవాల్ మనిషి కాదని, ఓ ఆలోచన అని సుధాకర్ అన్నారు. సమావేశంలో ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు డా.సల్మాన్ రాజ్, ఎంఏ మజీద్, మహిళా విభాగం అధ్యక్షురాలు హేమ జిల్లోజు, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ యమునా గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు విజయ్ ముల్లంగి తదితరులు పాల్గొన్నారు.

గానసభ భవనం దృఢంగా ఉంది

జేఎన్‌టీయూ నిపుణుల బృందం



సమావేశంలో మాట్లాడుతున్న జనార్దనమూర్తి, శంకరనారాయణ

చిక్కడపల్లి: త్యాగరాయ గానసభ భవనం అన్ని విధాలుగా దృఢంగా ఉందని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ విభాగం నిపుణుల బృందం యోగ్యతాపత్రాన్ని అందజేసిందని గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలిపారు. ఆదివారం సాయంత్రం గానసభలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రముఖ హాస్యావధాని శంకరనారాయణతో కలసి వివరాలను వెల్లడించారు. భవన నిర్మాణంపై నిపుణుల సలహాను కోరగా, వారు పరిశీలించి శనివారం పత్రాన్ని అందజేశారన్నారు. భవన నాణ్యతపై అనుమానాలుంటే ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు చక్రపాణి, బండి శ్రీనివాస్, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

షెడ్డు కింద పార్కింగ్.. రోడ్డుపై కూరగాయలు



రేకుల షెడ్డు కింద వాహనాల పార్కింగ్



రోడ్డుపైనే కూరగాయల విక్రయం

సాక్షి, సిటీ బ్యూరో: సరూర్‌నగర్ (ఎన్టీఆర్ నగర్) కూరగాయల మార్కెట్‌లో రైతుల కోసం నిర్మించిన రేకుల షెడ్డు కింద వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రైతులు కూరగాయలు పెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో ఆరుబయట వాటిని విక్రయిస్తున్నారు. మరోవైపు హైదరాబాద్-విజయవాడ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం సర్వీస్ రోడ్డు పొడవునా కూరగాయల అమ్మకాలు సాగుతున్నాయి. ఫలితంగా ఉదయం ఆ దారిలో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. మరోవైపు మార్కెట్ కమిటీకి రావాల్సిన ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది.



భాగ్యనగర్‌కాలనీలోని శ్రీ షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి ధనసరి అనసూయ(సీతక్క), జగదీశ్వర్ గౌడ్ తదితరులు



దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయంలో ఆదివారం జరిగిన గురుపూర్ణిమ ఉత్సవాల్లోపాల్గొన్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

దిక్కులేక.. బిక్కుబిక్కు



మాన్గార్ బస్తీలోని వాంబే గృహాల దృశ్యం

- శిథిలావస్థలో మాన్గార్ బస్తీ వాంబే గృహాలు
- ఎప్పుడు కూలుతాయో తెలియక జనం బెంబేలు
- ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

నాంపల్లి: ఒకవైపు ఎడతెరపి లేని వర్షాలు... మరోవైపు శిథిలగృహాలు.. పైకప్పుల పెచ్చులూడుతున్నాయి. ఒక్కొక్కటిగా కూలిపోతున్నాయి. ఇంత ప్రమాదకర పరిస్థితుల్లోనూ పేద కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ అక్కడే గడుపుతున్నాయి. ఇంత దయనీయపరిస్థితులున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటంలేదు. నాంపల్లి నియోజకవర్గంలోని మల్లేపల్లి డివిజన్ మాన్గార్ బస్తీలోని వాంబే గృహాల దుస్థితి ఇది. వాటిల్లో ఉండటం ప్రమాదమని తెలిసినా ఏమి చేయలేని నిస్సహాయత బస్తీవాసులది. వీరికి పునరావాసం కల్పిద్దామనే ఆలోచన ప్రభుత్వానికి లేకుండాపోయింది. గతంలో వీరి కోసం ప్రభుత్వం నిర్మించతలపెట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఆచరణకు నోచుకోలేదు. గత రెండు రోజులుగా నగరంలో వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఈ వర్షాలకు వాంబే గృహాల పైపెచ్చులు ఒక్కొక్కటీ ఊడిపోతున్నాయి. మరికొన్ని ఊడి వేలాడుతున్నాయి. అవి ఎవరి మీద పడతాయోననే భయాందోళనలో పేదలు ఉన్నారు. జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులు తరచూ బస్తీకి రావడం, ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేసి వెళ్తున్నారే కానీ, ప్రత్యామ్నాయాలు చూపడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ముగ్గురు చిన్నారులు మృత్యువాత..

శిథిల భవనాల పైపెచ్చులు ఊడి మీదపడటంతో గతంలో ముగ్గురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. నిద్రలోనే ప్రాణాలు వదిలారు. బస్తీలో ఏదైనా ప్రమాదం జరిగితేనే అధికారులు సంఘటనాస్థలాన్ని సందర్శిస్తుంటారు. బాధితులను పరామర్శిస్తూ హడావిడి చేస్తారు. సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామంటూ ఉత్తుత్తి ప్రకటనలు చేస్తారు. ఆ తర్వాత మళ్ళీ అటువైపు కన్నెత్తి కూడా చూడరు. ఇక స్థానిక రాజకీయ నేతలు అక్కడ ఫొటోలు దిగి ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో అప్‌లోడ్ చేసుకుంటారే తప్ప శాశ్వత పరిష్కారం మాత్రం చూపడంలేదు. గత ఏడాది కురిసిన వర్షానికి ఒక భవనం కూలిపోవడంతో బస్తీవాసులను సమీపంలోని ఓ కమ్యూనిటీ హాలులోకి తరలించారు. వారం రోజుల పాటు అక్కడే జాగారం చేశారు. వర్షం బెడద తగ్గగానే మళ్లీ కూలే భవనాల్లోకి చేరుకుని జీవనం సాగించడం ప్రారంభించారు.

వాంబే గృహాల్లో నాణ్యతాలోపం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ఆసిఫ్‌నగర్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హయాంలో 1996లో మాన్గార్‌బస్తీలో వాంబే గృహాలను నిర్మించారు. బహుళ అంతస్తుల తరహాలో మొత్తం నాలుగు బ్లాకుల్లో 318 ఇళ్లు ఉన్నాయి. నాటి కాంట్రాక్టర్లు చేసిన తప్పిదాలకు నేడు మాన్గార్ బస్తీ పేదలు అనుభవించాల్సి వస్తోంది.



ఊడిపడుతున్న పెచ్చులను చూపుతున్న బాధితులు



వేలాడుతున్న సిమెంటు దిమ్మెలు

నిర్లక్ష్యవైఖరి మారాలి



అధికారులు వాంబేగృహాలను ఖాళీ చేయాలంటూ హడావిడి చేస్తున్నారు. పైగా భవనాలకు నోటీసులు జారీ చేశారు. ఉన్నపళంగా వెళ్లాలంటే ఎక్కడికి వెళ్లాలి. ప్రభుత్వం కొత్తగా నిర్మించిన ఇళ్లలోకి తరలించాకే ఖాళీ చేస్తాం. లేదంటే మా బతుకులు రోడ్డుపాలవుతాయి. ప్రభుత్వం కూడా మానవతా దృక్పథంతో ఆలోచన చేయాలి. పునరావాస చర్యలను చేపట్టాలి.

\- దయానంద్, స్థానికుడు

నరకాన్ని అనుభవిస్తున్నాం



శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో నరకాన్ని అనుభవిస్తున్నాం. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోజులను వెళ్లదీస్తున్నాం. మా కష్టాలు అధికారులకు, రాజకీయనేతలకు కనిపించడం లేదు. పేదల కష్టాలు ఎన్నికలప్పుడే కనిపిస్తాయి. ఇలా ముప్పు పొంచి వున్న సమయాల్లో కనిపించవు. మా బాధలను ప్రభుత్వం అర్థం చేసుకుని తక్షణ చర్యలు చేపడుతుందని భావిస్తున్నాం.

\- పృథ్వీరాజ్, స్థానికుడు

నగరంలో నేడు..

- రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య శత జయంతి ఉత్సవాలను సాయంత్రం 6 గంటలకు రవీంద్ర భారతిలో నిర్వహిస్తుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా సాహితీ పురస్కార ప్రదానోత్సవం జరుగుతుంది.
- సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా ఉదయం 9.30 గంటలకు రంగం కార్యక్రమం జరుగుతుంది. పచ్చికుండపై స్వర్ణలత నిలబడి అమ్మవారి భవిష్యవాణి వినిపిస్తారు.
- పెగా సిస్టమ్స్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 1.45 నుంచి 2.30 గంటల వరకు మాదాపూర్‌లోని హైటెక్స్‌లో పెగా ఇన్నోవేటీవ్2024 సదస్సు జరుగుతుంది.
- తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'విభజన ఒప్పందచట్టం కుట్ర – ఆధిపత్యం'పై రౌండ్‌టేబుల్ సమావేశం జరుగుతుంది.
- తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో కళాసిల్క్ చేనేత వస్త్ర ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు జరుగుతుంది.

నేడు 'ఉజ్జయినీ'లో రంగం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రంగం కార్యక్రమం జరగనుంది. బోనాల ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారికి బోనాలు సమర్పించడం, రెండో రోజు రంగంలో భవిష్యవాణి వినిపించడం ఆనవాయితీ. సోమవారం ఉదయం 9.30 గంటలకు అమ్మవారి గర్భగుడికి ఎదురుగా ఉన్న మాతంగేశ్వరీ దేవాలయం ముందు అవివాహిత అయిన స్వర్ణలత పచ్చికుండపై నిలబడి అమ్మవారిని ఆవహించి భవిష్యవాణిని వినిపిస్తారు. అనంతరం పోతురాజుల వీరంగాలు, అంబారీ ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత సాగనంపుతో అమ్మవారి బోనాల జాతర ముగుస్తుంది.

రెవెన్యూ శాఖలో బదిలీలు

తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లకు స్థానచలనం

సాక్షి,సిటీబ్యూరో: రెవెన్యూ శాఖ భారీగా తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. హైదరాబాద్ జిల్లాలో నాలుగేళ్లు, రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారితోపాటు స్పౌస్ గ్రౌండ్ కింద పలువురు బదిలీలయ్యారు. హైదరాబాద్ పనిచేస్తున్న 15 మంది తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు ఇతర జిల్లాలకు బదిలీకాగా, ఇతర జిల్లాల నుంచి 23 మందిని హైదరాబాద్‌కు కేటాయించారు. ఇక్కడి నుంచి 39 మంది సీనియర్ అసిస్టెంట్లు బదిలీ కాగా, ఇతర జిల్లాల నుంచి 34 మందిని హైదరాబాద్‌కు కేటాయించారు.

సాక్షి 11
హైదరాబాద్, సోమవారం, 22, జూలై, 2024
సిటీ ప్లస్



ఎక్స్‌ప్లోరింగ్

ది హిడెన్ టాలెంట్!

- ట్రీ హగ్గర్స్ పేరిట క్లబ్ ఏర్పాటు
- 11 ఏళ్లుగా యువత కళలకు ప్రోత్సాహం

సాక్షి, సిటీబ్యూరో: కొందరికి హాబీ.. మరి కొందరికి ప్యాషన్.. ఇంకొందరికి అభిలాష.. కారణమేదైనా వారందరినీ ఒకే దగ్గరికి చేర్చింది. వారి టాలెంట్‌ను ప్రపంచానికి పరిచయం చేసుకునే అవకాశం కల్పించింది. వారి ఐడియాలను షేర్ చేసుకునే వీలునిచ్చింది. అదే ది మూన్‌షైన్ ప్రాజెక్టు వేదికగా ఆదివారం ట్రీ హగ్గర్స్ క్లబ్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్లేఅఫేయిర్ ప్రోగ్రాం.

టాలెంట్‌ను వెలికితీసేందుకు..



యువతలోని టాలెంట్‌ను ప్రోత్సహించేందుకు ఈ క్లబ్ ఏర్పాటు చేశాం. ఎంతోమంది కళలకు సరైన ప్రోత్సాహం, అవకాశాలు దొరక్కపోవడంతో ఎంతోమంది తెర వెనుకే ఉండిపోతున్నారు. అలాంటి వారి అరుదైన కళలను వెలుగులోకి తీసుకురావాలనేదే మా కోరిక. కమర్షియల్‌గా కాకుండా ఆర్ట్‌లో ఉన్న ఫ్రీడమ్ వారు ఎంజాయ్ చేసేందుకు ఇలాంటి వేదికలు ఏర్పాటు చేస్తుంటాం.
– సుప్రీత ఆమంచెర్ల, ఫౌండర్, ట్రీ హగ్గర్స్ క్లబ్



ఫ్యాషన్‌తో ప్రారంభం



చిన్నప్పటి నుంచి చదువుతో పాటు ఏదో ఒక ఆర్ట్ వర్క్ చేయడం అలవాటు. ఎప్పుడూ ఏదో కొత్తగా ఆలోచిస్తూ ఉంటాను. ఆర్ట్‌లో ఒక ఫ్రీడమ్ ఉంటుందనేది నా భావన. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ నుంచి డిజైనింగ్ నేర్చుకున్నాను. ఇందులో భాగంగానే లిటిల్ బోటో పేరుతో ప్రాజెక్టు ప్రారంభించాను. కలరింగ్ బుక్స్‌ను స్వయంగా రూపొందిస్తుంటాను.
– విశ్వ సింధూరి నేతి, లిటిల్ బోటో ప్రాజెక్టు

టు షో ఆఫ్ స్కిల్స్..

యువతలో ఏదో ఒక టాలెంట్ ఉంటుంది. చదువుల వెంట పరుగెడుతూ.. వారిలోని ఔత్సాహికతను, నవ్యాలోచనలను బయటపెట్టే అవకాశం ఉండకపోవచ్చు. ఇంట్లోని నాలుగు గోడల మధ్యే మిగిలిపోకుండా ఉండేలా వారి స్కిల్స్‌ను చాటిచెప్పేందుకు ఇదో అద్భుతమైన అవకాశం అని చెప్పొచ్చు. గత 11 సంవత్సరాలుగా ట్రీ హగ్గర్స్ క్లబ్ పేరిట కమర్షియల్ వాసనలకు దూరంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సుప్రీత అనే ఔత్సాహికురాలు ఈ క్లబ్‌ను ఏర్పాటు చేశారు.

ఇంట్లోనే బేకరీ



చిన్నప్పటి నుంచి చెఫ్ కావాలనేది నా లక్ష్యం. అందుకు అనుగుణంగానే నా ఆలోచనలు ఉండేవి. కాకపోతే బేకరీ ఏర్పాటు చేయాలంటే ఆర్థికంగా ఇబ్బంది. అందుకే నేను నేర్చుకున్న కళతో ఇంటి నుంచే కేక్స్, పేస్టరీస్, కప్ కేక్స్ తయారు చేస్తుంటాను. చాలామంది వారికి నచ్చిన థీమ్‌తో కేక్స్ తయారు చేయించుకుంటారు. డబ్బుల కన్నా వాళ్లు నా పనితీరును మెచ్చుకున్నప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది.
–మనిక ఖట్టర్, ఇంపర్ఫెక్షన్ బేకర్స్

క్యారికేచర్స్‌గా డాక్టర్స్ ఫొటోలు..

ఆయా డిపార్ట్‌మెంట్ల ముందు డాక్టర్ల ఫొటోలను పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోల్లాగా కాకుండా లైటర్‌వేయిన్‌తో క్యారికేచర్స్‌గా ప్రత్యేకంగా రూపొందించి ఏర్పాటుచేశారు. ఈ ఫొటోలను చూసి హాస్పిటల్‌కు వచ్చిన వారు ఎంజాయ్ చేయడంతో పాటు ఉత్సాహంగా ఫోన్లో ఫొటోలు భద్రపరుచుకుంటున్నారు.



ఆరోగ్యమే మహాభాగ్యం.. ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా సాధించగలం.. అయితే మనలో చాలా మంది అనారోగ్యం పాలైనప్పుడు ఆస్పత్రులకు వెళ్లక తప్పదు..వెళ్లాలి కదా..! ఇప్పుడేమంటారు? అంటారా.. అదేనండి.. ఆస్పత్రులు అనగానే చాలా మంది బెదిరిపోతారు.. ఎందుకంటే ఓ వైపు మందుల వాసన, మరోవైపు ఫినాయిల్‌కంపు, ఎక్కడ చూసినా గోడలకు రోగాలకు సంబంధించిన పోస్టర్లు, చూట్టూ రోగులు.. అబ్బో నా వల్ల కాదు బాబోయ్ అంటారు. అలాంటి వారు కూడా ఈ ఆస్పత్రికి వెళ్లాలంటే మాత్రం ఎంచక్కా మ్యూజియంకో, ఎగ్జిబిషన్‌కో వెళ్తున్నట్లు రెడీ అయిపోతారు.. అదే నగరంలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్. ఆ వివరాలేంటో తెలుసుకుందాం..
- ఖైరతాబాద్

- మ్యూజియాన్ని తలపించే ఆస్పత్రి గోడలు
- ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు డాక్టర్ల కృషి
- పేషెంట్లకు కంఫర్ట్ ఇవ్వగలిగేలా వాతావరణం
- కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ వినూత్న ప్రయత్నం

వాల్స్.. వండర్స్

ప్రతి గోడా ఓ కళాఖండంలా..




ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలతో సతమతమౌతున్న మనిషికి ఆధునిక వైద్య విధానాలు ఎన్ని వచ్చినప్పటికీ ఆప్యాయంగా... ప్రేమగా పలకరించే వైద్యులు, వారి బాధలు చెప్పుకునేంత సమయం.. ఓర్పు, సహనం కలిగిన వైద్యులతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తలపించే హాస్పిటల్‌కు వెళ్లామనే ఫీలింగ్ పేషెంట్లకు కలిగించేందుకు కొత్త కొత్త ఏర్పాట్లు చేస్తున్నాయి పలు హాస్పటల్స్. ఈ తరహా ప్రయత్నమే చేస్తోంది నగరంలోని బేగంపేట కిమ్స్ సన్‌షైన్ హాస్పటల్. రొటీన్ వాతావరణానికి భిన్నమైన అనుభూతిని కల్పించేలా ఓ మ్యూజియంకు వెళ్లామనే అనుభూతి, పేషెంట్‌ను పేషెంట్‌గా కాకుండా ఒక గెస్ట్‌గా ఆహ్వానించే పద్ధతి, ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే హాజరై సలహాలు, సూచనలు చేసే సిబ్బంది ఉంటే ఆ రోగికి సగం జబ్బు నయమైపోయినట్లే అంటున్నారు విశ్లేషకులు.

హాస్పిటల్‌లోకి వెళ్లగానే బాబోయ్ హాస్పిటల్‌కు వచ్చామనే ఫీలింగ్ లేకుండా ఉండేవిధంగా లోపలికి అడుగు పెట్టగానే తెలుగు సాంప్రదాయ పద్ధతిలో చేతులు జోడించి నమస్కారంతో స్వాగతం పలికే సిబ్బంది మొదలుకొని డాక్టర్ల వరకూ ఎంతో ఆప్యాయంగా పలకరిస్తారు.

సంస్కృతిని ప్రతిబింబించేలా..

హాస్పిటల్‌లో డాక్టర్ ఓపి పరిసరాల్లో ఉండే గోడలపై భారతీయతను ప్రతిబింబించేలా తెలుగు పండగలు, అలనాటి క్రీడలు, అన్ని మతాలనూ ప్రబోధిస్తూ ఫొటోలు, తెలుగు రాష్ట్రాల చీరలు, రామాయణం, మహాభారతం, మనదేశ సంప్రదాయ నృత్యాలు, తల్లిప్రేమను ప్రతిబింబించే ఫొటోలు, మెడిసిన్ హిస్టరీని తెలియజేసే ఫొటో ఎగ్జిబిషన్, ఆయా డిపార్ట్‌మెంట్ల ప్రాముఖ్యతను తెలిపే ఫొటోలు, మన శరీరం ఆకృతిని నిర్దేశిస్తూ శరీరంలో ఉండే అస్థిపంజరం నమూనాలు, పెయింటింగ్స్ పరిజ్ఞానాన్ని పెంచడంతో పాటు మనస్సుకు ఎంతో ప్రశాంతతను చేకూరుస్తాయని చెప్పవచ్చు. ఇక్కడికి వచ్చే వారు ప్రతి ఫ్లోర్‌లో మనస్సు నింపుకొని వెళ్లే విధంగా ఉండటం కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ ప్రత్యేకత.



సిబ్బంది పద్ధతి నచ్చింది..



మేము ఉండేది కొండాపూర్, మా చుట్టుపక్కల ఎన్నో హాస్పిటల్స్ ఉన్నాయి. అయినా గంటన్నర ప్రయాణం చేసి బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌కు వస్తాం. ఇక్కడి వాతావరణం, నర్సులు, ఇతర సిబ్బంది పద్ధతి మాకు బాగా నచ్చింది. బాధ్యతతో వ్యవహరించే డాక్టర్లు, హాస్పిటల్‌లో ప్రతి ఫ్లోర్‌లో ప్రశాంతతను ఇచ్చే వాతావరణం మాలో బరోసాను పెంపొందిస్తుంది. – జే.సుమిత్ర, కొండాపూర్, గృహిణి

సేవా ధృక్పథంతో...



మేమంతా సేవా ధృక్పథంతో పని చేస్తున్నాం. మా అందరి గురువు డాక్టర్ గురవారెడ్డి. ఆయన అడుగు జాడల్లో రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి బాధలు చెప్పుకునేంత సమయం ఇస్తూ, వారి ఆనందంలో భాగస్వాములవడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఇక్కడి సిబ్బంది ఒక కుటుంబంలా పనిచేయడం ఎంతో సంతోషం.
– డాక్టర్ నివేదిత సాయిచంద్ర, న్యూరో ఫిజీషియన్



కంఫర్ట్ ఇవ్వగలగాలి..



రొటీన్ పద్ధతికి స్వస్తిచెప్పి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తలపించేలా మ్యూజియం, హార్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశాం.. రానున్న సంవత్సరంలో పేషెంట్‌ను గెస్ట్‌లా భావిస్తున్నాం. ఆస్పత్రిలో మంచి వాతావరణం ఉండటం వల్ల సగం జబ్బు నయమవుతుంది. గోడలను రకరకాల పెయింటింగ్స్, డిజైన్స్, ఫొటోలతో ఏర్పాటు చేశాం. అన్ని బాధలూ మేము తగ్గించకపోవచ్చు. కానీ అందరికీ ఆత్మస్థైర్యాన్ని, కంఫర్ట్‌ని ఇవ్వగలగాలి. ఇంగ్లిష్‌లో ఓక సామెత ఉంది 'యు మే నాట్ క్యూర్ ఆల్ ది టైం.. బట్ యు కెన్ కంఫర్ట్ ఆల్ ది టైం' అనేది నేను బలంగా నమ్ముతాను.
– డాక్టర్ ఏవీ గురవారెడ్డి, కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్.



'మిస్ యూనివర్స్ స్టేట్' గ్రాండ్ ఫినాలే 2024

క్యాట్ వాక్‌తో అలరించిన మూడు రాష్ట్రాల మోడల్స్

బ్యూటీ క్వీన్స్

సాక్షి, సిటీబ్యూరో: నగరం పై కురుస్తున్న తొలకరి చిరుజల్లులు ఓ వైపు... నగరం వేదికగా నిర్వహించిన మిస్ యూనివర్స్ స్టేట్ గ్రాండ్ ఫినాలే ర్యాంప్ పై నడుస్తున్న టాప్ మోడల్స్ సోయగాలు మరో వైపు. వెరసి ఆదివారం నగరం అందాల సోయగాలతో పులకించిపోయింది. శ్రీనగర్ కాలనీలోని విస్ఫోరాలో జరిగిన మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక స్టేట్ మొదటి ఎడిషన్ గ్రాండ్ ఫినాలేలో 3 రాష్ట్రాలకు చెందిన అందాల ముద్దుగుమ్మలు క్యాట్‌వాక్‌తో అలరించి విజేతలుగా నిలిచారు. ఇందులో భాగంగా మిస్ యూనివర్స్ తెలంగాణగా నిహారిక సూద్, మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ చందన జయరామ్, మిస్ యూనివర్స్ కర్ణాటకగా అవనీ కాకేకోచి టైటిల్ క్రౌన్ గెలుచుకున్నారు. ర్యాంప్ పై వాక్ చేసిన అందాల తారలను బ్యూటీ, ఫ్యాషన్ పరిశ్రమకు చెందిన ప్రముఖులు విజేతలుగా ఎంపిక చేశారు. ఈ ఫ్యాషన్ జ్యూరీలో మిస్ యూనివర్స్ స్టేట్ డైరెక్టర్ ప్రాచీ నాగ్‌పాల్, మిస్టర్ గ్లోబల్ 2023 జాసన్ డైలాన్, సెలబ్రిటీ డెంటిస్ట్ డాక్టర్ నిదా ఖతీబ్, ఫ్యాషన్ డిజైనర్ అంజలి ఝా, ఫౌండర్ చుర్రోల్టో నీహార్ బిసాబతేని పాల్గొన్నారు. మిస్ యూనివర్స్ స్టేట్ పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి 96 మంది పాల్గొనగా..వీరిలో ఒక్కో రాష్ట్రం నుంచి 7 మంది చొప్పున 21 మందిని ఫైనలిస్టులుగా ఎంపికచేశారు. 21 మందిలో ఒక్కో రాష్ట్రం నుంచి మిస్ యూనివర్స్ స్టేట్ విన్నర్‌తో పాటు, ఇద్దరు రన్నరప్‌లను ఈ గ్రాండ్ ఫినాలే విజేతలుగా ప్రకటించింది. బెస్ట్ స్మైల్, బెస్ట్ అటైర్ టైటిల్స్ ప్రత్యేకంగా ఎంపిక చేశారు. ఈ ఫినాలేలో యువతులు, కార్పొరేట్ ఉద్యోగులు, ఫ్యాషన్ మోడల్స్ సందడి చేశారు.





'బికనీర్‌వాలా' నూతన అవుట్‌లెట్స్..

సాక్షి, సిటీబ్యూరో: భారతీయ సంప్రదాయ స్వీట్లు, సావరీస్ తయారీలో ప్రసిద్ధి చెందిన బికనీర్‌వాలా ఆధ్వర్యంలో అరాంఘర్ వేదికగా నూతన అవుట్‌లెట్ ప్రారంభించింది. నగరంలో ఇది ఏడోది కాగా, దేశంలో 200వ అవుట్‌లెట్ అని సంస్థ డైరెక్టర్ చేతన్ అగర్వాల్ తెలిపారు. హైదరాబాద్‌తో పాటు యూఎస్‌ఏ, కెనడా, యూఏఈ, ఖతార్, న్యూజిలాండ్, సింగపూర్, నేపాల్ వంటి దేశాల్లో భారత సంస్కృతి, వారసత్వాన్ని ప్రదర్శించేలా ఔట్‌లెట్లు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియాతో పాటు యూరప్‌లలో మరో 50 ఔట్‌లెట్లకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బికనీర్‌వాలా స్వీట్స్, స్నాక్స్ తదితర పాన్-ఇండియన్ వంటకాలుకు వేదికగా మారిందని హైదరాబాద్ డైరెక్టర్ నవీన్ అన్నారు.



'లైఫ్‌స్పాన్' బ్రాండ్ అంబాసిడర్‌గా ఈషా సింగ్..

సాక్షి, సిటీబ్యూరో: భారత ప్రొఫెషనల్ షూటర్ ఈషా సింగ్ హైదరాబాద్ ఆధారిత లైఫ్‌స్పాన్ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నట్లు ప్రకటించారు. భారత ఒలింపిక్ జట్టులో అతి పిన్న వయస్కుల్లో ఒకరైన ఈషా సింగ్ లైఫ్‌స్పాన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారడం గర్వంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర రామ్ తెలిపారు. తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్‌తో పాటు ఈషా సింగ్ భాగస్వామ్యం కావడం క్రీడా రంగానికి కృషి చేయాలనే తమ నిబద్ధతకు నిదర్శనమన్నారు.

నీట్.. ర్యాంకుల 'షికార్'

పలు పరీక్ష కేంద్రాల్లో భిన్నమైన ఫలితాలు | **సికర్, నామకల్‌లోని కేంద్రాల్లో టాప్ స్కోర్** | **రీటెస్ట్ ఫలితాలు ఆశ్చర్యకరం** | **లోతుగా విశ్లేషించాల్సిన అవసరముంది**

నీట్ యూజీ–2024 పరీక్ష ఫలితాలపై వివాదం కొనసాగుతూనే ఉంది. మే 5న దేశవ్యాప్తంగా పరీక్ష నిర్వహించగా.. 23 లక్షల మందికిపైగా హాజరయ్యారు. గత నెలలో ఫలితాలు వెల్లడికాగా..పరీక్షలో అక్రమాలు జరిగాయంటూ ఆందోళన వ్యక్తమైంది. అనేకమంది సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు పరీక్ష నిర్వహణ సంస్థ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తాజాగా పట్టణాలు, పరీక్ష కేంద్రాల వారీగా ఫలితాలను వెల్లడించింది.

700+ స్కోర్‌తో ఆలిండియా కోటా సీటు..

నీట్‌లో 700+ మార్కులు స్కోర్ చేసిన 2,321 మంది విద్యార్థులకు ఆల్ ఇండియా కోటాలో అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) వంటి ప్రముఖ విద్యాసంస్థల్లో మెడికల్ సీటు లభిస్తుంది. అదేవిధంగా 650+ మార్కులు స్కోర్ చేసిన 30,204 మంది విద్యార్థులకు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ప్రవేశం దక్కుతుంది. అలాగే 600+ మార్కులు స్కోర్ చేసిన 81,550 మంది విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల్లో ఏదో ఒక చోట సీటు సొంతమయ్యే అవకాశముంది.


రీటెస్ట్ తర్వాత ఫలితం..

గ్రేస్ మార్కుల వివాదం నేపథ్యంలో సుప్రీంకోర్టు.. నీట్ రీటెస్ట్‌కు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ రీటెస్ట్ తర్వాత హరియాణాలోని ఒక పరీక్ష కేంద్రంలో ఆశ్చర్యకర ఫలితాలు వెల్లడయ్యాయి. హిస్సార్‌లోని హరదయాళ్ పబ్లిక్ స్కూల్ పరీక్ష కేంద్రంలో రీటెస్ట్‌కు ముందు వెల్లడించిన ఫలితాల్లో మొత్తం 8 మంది విద్యార్థులకు 720, 719, 718 మార్కులు వచ్చాయి. రీటెస్ట్ ఫలితాలు వెల్లడయ్యాక ఈ పరీక్ష కేంద్రంలో గరిష్ట స్కోర్ 682 మాత్రమే. అంతేకాకుండా కేవలం ఇద్దరు విద్యార్థులకు మాత్రమే 650+ మార్కులు వచ్చాయి. 13 మంది విద్యార్థులు 600+ మార్కులు స్కోర్ చేశారు. దీన్నిబట్టే చూస్తే రీటెస్ట్‌కు ముందు ఈ సెంటర్‌లో వెల్లడయిన ఫలితం ఆశ్చర్యకరమని చెప్పొచ్చు.

సికర్ ఫలితం.. ఆశ్చర్యకరం


- రాజస్తాన్‌లోని సికర్ పట్టణంలో మొత్తం 50 కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష జరిగింది. ఈ పట్టణంలోని కేంద్రాల్లో మొత్తం 27,216 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 149 మందికి 700+ స్కోర్ వచ్చింది. 650 + స్కోర్ చేసిన విద్యార్థుల సంఖ్య 2,037. అలాగే 4,297 మంది విద్యార్థులు 600 + స్కోర్ చేశారు. సికర్‌లో నీట్ రాసిన విద్యార్థుల సగటు మార్కులు 362.
- దేశవ్యాప్తంగా పరీక్ష రాసిన మొత్తం 23 లక్షల మందిలో 30,204 మంది విద్యార్థులు 650+ స్కోర్ చేశారు. కేవలం 1.3 శాతం మంది. కాని ఒక్క సికర్‌లోనే 2,087 మంది 650+ స్కోర్ చేశారు. ఇది 6.8 శాతం. అదేవిధంగా దేశవ్యాప్తంగా పరీక్ష రాసిన వారిలో 1.3 శాతం మందికి మాత్రమే ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు వచ్చే అవకాశం లభించగా.. సికర్‌లో పరీక్ష రాసిన వారిలో ఏకంగా 7.48 శాతం మందికి ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ దక్కుతోంది.
- ఇక్కడే చాలా మందికి సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ ఏదో జరిగిందని నేను అనడం లేదు. కాని కేవలం 50 పరీక్ష కేంద్రాలున్న ఒక్క సిటీలో ఇంత మందికి బెస్ట్ స్కోర్ ఎలా సాధ్యమనే ప్రశ్న చాలా మందికి ఎదురవుతోంది.

– కెరీర్స్360 ఫౌండర్ చైర్మన్ మహేశ్వర్ పెరి



- కోచింగ్‌కు పేరుగాంచిన కోటా పట్టణంలోని పరీక్ష కేంద్రాల్లో హాజరైన విద్యార్థుల డేటాను విశ్లేషించినా.. సికర్‌లో పరీక్ష రాసిన విద్యార్థులు ఎంతో ముందున్నారని అర్థమవుతోంది. కోటాలో 27,118 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైతే..700+ స్కోర్ చేసింది 74 మంది(0.27 శాతం) మాత్రమే. అదే సికర్‌లో ఆ సంఖ్య రెండింతలుగా ఉంది. 650+ స్కోర్ చేసిన విద్యార్థుల సంఖ్య 1,066(3.93 శాతం)గా ఉంది. అలాగే ఇక్కడ 2,599 విద్యార్థులు 600 + స్కోర్ చేశారు. 600+స్కోర్ చేసిన విద్యార్థులు కోటాలో 9.58 శాతం ఉండగా.. సికర్‌లో అది 16 శాతంగా ఉంది.

సికర్‌లో పరీక్ష రాసిన వారి వివరాలివీ...



ఒక్క కేంద్రంలో 12 మందికి 700+

- అహ్మదాబాద్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పరీక్ష కేంద్రంలో మొత్తం 676 మంది విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా.. ఏకంగా 12 మందికి 700 + స్కోర్ వచ్చింది.
- నామకల్‌లోని ద నవోదయా అకాడెమీ సీనియర్ సెకండరీ స్కూల్‌లో 659 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా.. 8 మందికి 700+ మార్కులు వచ్చాయి.
- సికర్‌లోని టాగోర్ పీజీ కాలేజీలో 356 మంది పరీక్ష రాయగా.. 5గురికి 700+ స్కోర్ వచ్చింది.


టాప్ 50లో 37 సికర్ నుంచే

- 650 మార్కుల కంటే ఎక్కువ స్కోర్ చేసిన టాప్ 50 పరీక్ష కేంద్రాల్లో 37 సికర్‌లోని పరీక్ష కేంద్రాలే. అలాగే దేశంలో బెస్ట్ ఫలితం వచ్చిన టాప్ 60 పరీక్ష కేంద్రాల్లో 43 సికర్ నుంచే ఉన్నాయి. టాప్ 50లో నామకల్‌లోని ఐదు పరీక్ష కేంద్రాలు, హర్యాన, హిస్సార్‌లోని జఝర్ వంటివి ఉన్నాయి.
- రాజ్‌కోట్‌లోని ఒక పరీక్ష కేంద్రంలో ఏకంగా 200 మంది విద్యార్థులకు 600 + మార్కులు వచ్చాయి.

రాజస్థాన్ బెస్ట్ ప్రదర్శన

- దేశ వ్యాప్తంగా నీట్ యూజీలో ఉత్తమ ఫలితాలు చూపిన టాప్ 10 సిటీలో.. ఐదు రాజస్థాన్ నుంచే ఉన్నాయి.
- రాష్ట్రాలు/కేంద్రాలు పాలిత ప్రాంత్రాల వారిగా చూసే.. నీట్‌లో ఉత్తమ ఫలితం చూపిన టాప్ పది రాష్ట్రాల్లో వరుసగా చండీగఢ్, రాజస్థాన్, హరియాణా కేరళ, ఢిల్లీ, పంజాబ్, ఒడిశా, గుజరాత్, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్ ఉన్నాయి.
- ఈశాన్య రాష్ట్రాల్లో నీట్ ఫలితాలు నిరాశజనకంగా ఉన్నాయి. కాగా కొన్ని పరీక్ష కేంద్రాలు, కొన్ని సిటీల్లో ఇలా ఎందుకు ఫలితం భిన్నంగా ఉంది. ఇక్కడ ఎక్కువ మందికి బెస్ట్ ర్యాంకులు ఎలా వచ్చాయి అనే సందేహం రావడం సహజం. అయితే దీనికి ఈ సిటీల్లో అందుబాటులో ఉన్న కోచింగ్ సౌకర్యాలు కారణం కావచ్చు. కోచింగ్ వల్ల కొన్ని చోట్ల విద్యార్థులు మంచి ఫలితం సాధించి ఉండొచ్చు.

కోటాలో పరీక్ష రాసిన వారి వివరాలివీ..



రాష్ట్రాలవారీగా 700కు పైగా మార్కులు వచ్చిన విద్యార్థులు

రాజస్థాన్	కేరళ	హరియాణా
482	194	146
మహారాష్ట్ర	ఉత్తరప్రదేశ్	తెలంగాణ
205	184	49

వైద్యారోగ్యశాఖలో బదిలీల రగడ

సాక్షి, హైదరాబాద్: వైద్యారోగ్యశాఖలో ఇటీవల జరిగిన బదిలీ లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీనియర్లను ఇప్పుడు వారి స్థాయిని తగ్గించేలా జిల్లాలకు బదిలీ చేయడం ఏంటని ప్రశ్ని స్తున్నారు. పెద్దస్థాయిలో బాధ్యతలు నిర్వర్తించిన వారిని, పెద్ద ఆస్పత్రుల నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన వారిని అంత గుర్తింపు లేని ఆస్పత్రులకు బదిలీ చేయడం విమర్శలకు తావి స్తోంది. మాజీ వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ రమే ష్‌రెడ్డి, మాజీ ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు, ఉస్మానియా, గాంధీ సూపరింటెండెంట్లు డాక్టర్ నాగేందర్, డాక్టర్ రాజారావులు కరోనా కాలంలో కీలకపాత్ర పోషించారు. వారిలో కొందరిపై కొన్ని విమర్శలు ఉన్నా కరోనా సమయంలో వేలాది మంది ప్రాణాలు కాపాడటంలో కృషి చేశారు.

- డాక్టర్ రాజారావును యాదాద్రి భువనగిరిలోని అతి చిన్న మెడికల్ కాలేజీ ఆస్పత్రికి సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. డాక్టర్ రమేష్‌రెడ్డిని అదే కాలేజీకి ప్రిన్సిపాల్‌గా వేశారు. • డాక్టర్ నాగేందర్‌ను మహేశ్వరం మెడికల్ కాలేజీకి ప్రిన్సి పాల్‌గా బదిలీ చేశారు. డాక్టర్ శ్రీనివాస్‌రావును నిర్మల్ లేదా మహబూబాబాద్‌కు బదిలీ చేస్తారని ప్రచారం జరుగుతోంది.
- నిలోఫర్ సూపరింటెండెంట్ ఉషారాణిని నిజామాబాద్‌కు బదిలీ చేశారు.

అసౌకర్యం లేకుండా బదిలీ చేయాలన్నది నిబంధన : రోగులు, పరిపాలనకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా కేడర్‌లోని 40 శాతం మందిని బదిలీ చేయాలన్నది నిబంధన. 40 శాతం బదిలీ చేయాలన్నది తప్పనిసరి కాదు. అంతకుమించకూడదన్నదే ఇక్కడ ఉద్దేశం. 20 శాతమైనా చేయవచ్చు. కానీ వైద్యారోగ్యశాఖలో ఈ నిబంధనను పట్టించుకోలేదు.

- ఉదాహరణకు నిలోఫర్‌లో ఏకంగా 20 మంది సీనియర్ ప్రొఫెసర్లను బదిలీ చేశారు. కానీ పూర్తిస్థాయిలో వాటిని భర్తీ చేయలేదు. దీంతో పిల్లల వైద్యానికి కీలకమైన ఇక్కడ అత్యాధునిక వైద్య సేవలు అందించే వారే లేకుండా పోయారు. • ఉస్మానియాలో అవయవ మార్పిడి చికిత్సలో కీలకంగా ఉండే డాక్టర్లను జిల్లాల్లోని మెడికల్ కాలేజీలకు పంపించడం కూడా విమర్శలకు తావిస్తోంది. మెడికల్ కాలేజీలకు పంపిస్తే ఇక్కడ అవయవ మార్పిడి చేసేవారెవరు? జిల్లాల్లో అవయవ మార్పిడికి అనుకూలమైన పరిస్థితులు లేనప్పుడు వారక్కడకు వెళ్లి ఏం చేస్తారన్నది ప్రశ్న.

స్టాఫ్ నర్సుల బదిలీల్లోనూ: స్టాఫ్ నర్సుల విషయంలో సీనియారిటీ విషయంలో చాలామందికి తక్కువ లేదా ఎక్కువ వేసినట్టు ప్రచారం జరుగుతోంది. కొందరి విషయంలో స్పౌజ్‌లు లేకున్నా ఉన్నట్టు పరిగణించారు. ఇక వైద్య సంఘాలకు చెందిన అనేకమంది నాయకులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వడంపైనా విమర్శలొచ్చాయి. ఏళ్ల తరబడి ఉస్మానియా, గాంధీలో పనిచేస్తున్న కొందరు స్టాఫ్‌నర్సులు... యూనియన్లు, కొందరు అధికారులతో కుమ్మక్కై సర్వీసును తక్కువ రాయించుకున్నట్లు సమాచారం. ఇలా ఆ ఆస్పత్రులకు చెందిన 50 మంది నర్సులు ఇలా తప్పుడు వివరాలను సీనియారిటీ జాబితాలో నమోదు చేయించుకున్నట్లు సమాచారం. ప్రభుత్వం ప్రకటించిన 40%లో తమ పేరు లేకుండా చేసేందుకు కొందరు పైరవీలు చేసి, లక్షల్లో ముడుపులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.

బదిలీలు బద్నామ్!

▶ మొదటి పేజీ తరువాయి

కూడా సేకరించింది. వీటిపై నిర్ణయం తీసుకునేందుకు ఈ నెల 18న ఉప సంఘం సమావేశమవాల్సి ఉన్నా జరగలేదు. దీంతో 53 వేల మంది ఉద్యోగుల వినతులు పెండింగ్‌లో పడిపోయాయి. అవన్నీ ఇంకా పెండింగ్‌లో ఉండగానే.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సాధారణ బదిలీలకు తెరలేపింది. మంత్రివర్గ సమావేశం జరిగి ఉంటే సమస్యల పరిష్కారానికి సిఫార్సు లభించేదని, వాటిని పరిష్కరించకుండా బదిలీల ప్రక్రియ ఎలా పూర్తవుతుందన్న ప్రశ్నకు ప్రభుత్వం వద్ద సమాధానం లేకపోవడం గమనార్హం.

గురుకులాల్లో ఆందోళన : సాధారణ బదిలీల కంటే ముందే గురుకుల విద్యా సంస్థల్లో పదోన్నతులు, ట్రాన్స్‌ఫర్ల ప్రక్రియకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. దాదాపు నెలరోజులుగా ఆ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. జోనల్ కేటాయింపులు రోజుకోరకంగా మారుతుండటంతో ఈ పరిస్థితి వచ్చిందనే విమర్శలు వస్తున్నాయి. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ పరిధిలో మల్టీ జోన్–1కు చెందిన ఉద్యోగులను మల్టీజోన్–2కు కేటాయించారు. కొన్ని కేటగిరీల్లో మల్టీజోన్–2 పరిధిలోని ఉద్యోగులు మల్టీజోన్–1కు పంపారు. ప్రిన్సిపాల్స్, డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ కేటగిరీల్లో వందల మందికి ఇలా జోన్లు మారడంతో వారంతా న్యాయ పోరాటానికి దిగారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో వారిని మినహాయించి బదిలీలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోనూ జోనల్ కేటాయింపుల్లో సమస్యలు నెలకొన్నాయి. వాటిని పరిష్కరించాకే బదిలీల ప్రక్రియ చేపట్టాలంటూ ఉద్యోగులు ఆందోళనకు దిగడంతో బదిలీల ప్రక్రియ అర్ధాంతరంగా నిలిచిపోయింది.

విద్యా శాఖలో సింగిల్ టీచర్ సమస్య.. : పాఠశాల విద్యా శాఖ పరిధిలో బదిలీల ప్రక్రియ పదిరోజుల క్రితం ముగిసింది. దాదాపు 35వేల మంది టీచర్లు కొత్త స్కూళ్లకు బదిలీ అయ్యారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల విషయంలో ఇబ్బంది ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల్లోని ఆ పాఠశాలల్లో ఇప్పటికే పనిచేస్తున్న టీచర్లు బదిలీ అవడం.. వాటికి ఇతర టీచర్లెవరూ రాకపోవడం సమస్యగా మారింది. అలాంటి చోట్ల టీచర్లను రిలీవ్ చేయకుండా నిలిపేశారు. బదిలీ అయినా ఆ టీచర్లు పాత స్కూళ్లలోనే కొనసాగాల్సి వస్తోంది.

వైద్యారోగ్య శాఖలో సీనియర్లకు మొండిచేయి: రాష్ట్ర వైద్యారోగ్య శాఖలో కూడా బదిలీల ప్రక్రియతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. కీలక సమయంలో మంచి వైద్య సేవలు అందించిన అధికారులు దూర ప్రాంతాలకు బదిలీ అయ్యారు. ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, మాజీ డీఎంఈ సైతం ప్రాధాన్యత లేని చోటికి ట్రాన్స్‌ఫర్ కావడం గమనార్హం. కరోనా సమయంలో కీలకపాత్ర పోషించిన రాజారావు, నాగేందర్, రమేశ్‌రెడ్డి కూడా దూర ప్రాంతాలకు కేటాయించారు. దీంతో ఈ శాఖలో బదిలీల ప్రక్రియను ఇష్టానుసారం చేపట్టారనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా నర్సుల బదిలీల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని.. కొందరు అధికారులు ముడుపులు కూడా తీసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆరా తీసినట్టు సమాచారం.

ఆర్థిక శాఖలో 'క్లియర్ వేకెన్సీ' వివాదం..: ఆర్థికశాఖలో జరిగిన బదిలీల్లో నిబంధనలు సరిగా పాటించలేదని ఆ శాఖ ఉద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు. డైరెక్టర్ వర్క్స్, అకౌంట్స్ కార్యాలయంలో జరిగిన బదిలీల్లో నాలుగేళ్ల తప్పనిసరి బదిలీ నిబంధన పాటించలేదు. ఒకేచోట ఆరేడు ఏళ్ల సర్వీసు పూర్తయినా.. కొందరి వివరాలు సేకరించకుండా పక్కనబెట్టారని ఉద్యోగులు అంటున్నారు. మరోవైపు తక్కువకాలం పనిచేసిన ఉద్యోగులను తప్పనిసరి బదిలీ జాబితాలోకి తీసుకువచ్చారని మండిపడుతున్నారు. అంతేకాదు.. సీనియారిటీ ప్రకారం పూర్తి వేకెన్సీలను చూపకుండా అన్యాయం చేశారనే ఆరోపణలూ వస్తున్నాయి. హనుమకొండలోని మిషన్ భగీరథ కార్యాలయంలో పనిచేస్తున్న ఒక డీఏఓ ఆరేళ్లకుపైగా ఒకేచోట పనిచేస్తున్నా బదిలీ జాబితాలోకి తీసుకోలేదని సమాచారం. ములుగు కార్యాలయంలో ఉన్న క్లియర్ వేకెన్సీని సీనియర్ ఉద్యోగులకు చూపించకుండా.. మిషన్ భగీరథ వరంగల్ కార్యాలయంలో పనిచేస్తున్న తక్కువ సర్వీస్ ఉన్న డీఏఓకు కేటాయించారనే ఆరోపణలు వస్తున్నాయి.

పీసీబీలోనూ బది'లీలలు'!: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ)లో సుదీర్ఘకాలంగా హెడ్ ఆఫీస్, జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న పైస్థాయి అధికారులు, వివిధ కేడర్ల అధికారులు/ఉద్యోగులు నాలుగేళ్లకుపైబడి ఒకేచోట పనిచేస్తున్నా బదిలీ చేయలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వం గడువు పెంచినా.. : బదిలీల విషయంలో అధికారుల నుంచి అటెండర్ల వరకు అసంతృప్తిగా ఉన్నారని ఉద్యోగ సంఘాలు చెప్తున్నాయి. ఇలా వివిధ శాఖల్లో జరుగుతున్న బదిలీలు గందరగోళంగా మారడంతో ప్రభుత్వ బదిలీల ప్రక్రియ గడువును ఈ నెలాఖరు వరకు పొడిగించింది. దీంతో ఇప్పటికైనా అర్హులైన ఉద్యోగులకు బదిలీలు జరగాలని, అన్యాయంగా జరిగిన బదిలీలు ఆగిపోవాలని ఉద్యోగులు కోరుతున్నారు. జోనల్ చిక్కులకు పరిష్కారం లభిస్తుందని, ప్రశాంతంగా ఉద్యోగాలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నీటిపారుదల శాఖలో ఇంజనీర్లకు మినహాయింపు

నీటి పారుదల శాఖలోని అన్ని కేడర్ల ఇంజనీర్లను సాధారణ బదిలీల నుంచి మినహాయిస్తూ ఆ శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం జారీచేశారు. శాఖలో ఇంజనీర్ల కొరత ఉందని, ప్రస్తుత వర్షాకాలంలో ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ చేయాల్సి ఉన్న నేపథ్యంలో.. సాధారణ బదిలీల నుంచి మినహాయిస్తూ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించారు. నిర్మాణంలోని ప్రాజెక్టులు పూర్తయ్యాక ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణ అవసరాలు తీరాక శాఖ అవసరాలను దృష్టిలో పెట్టుకొని అన్ని కేడర్లలోని ఇంజనీర్ల బదిలీలను చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిజానికి ఇంజనీర్ల బదిలీలు, పదోన్నతుల విషయంలో శాఖలోని వివిధ ఇంజనీర్ల సంఘాల మధ్య విభేదాలు తీవ్రం కావడంతో ప్రస్తుతానికి బదిలీలను పక్కనపెట్టినట్టు సమాచారం.

అంతర్జాతీయస్థాయిలో బుద్ధ వనం అభివృద్ధి: మంత్రి జూపల్లి



యునెస్కో సెషన్‌లో మంత్రి జూపల్లి, జితేందర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం అంతర్జాతీయస్థాయిలో అభివృద్ధి కావాలని తెలంగాణ పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆకాంక్షించారు. వారసత్వ కట్టడాల పరిరక్షణే ధ్యేయంగా పని చేసే యునెస్కో ప్రపంచ వారసత్వ కమిటీ 46వ సెషన్‌లో జూపల్లి హాజరయ్యారు. న్యూఢిల్లీ లోని భారత్ మండపంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సమావేశాలకు మన దేశం మొదటిసారి ఆతిథ్యం ఇచ్చింది. ఈ నెల 31వరకు కొనసాగే ఈ సమావేశాల్లో తెలంగాణకు సంబంధించిన వారసత్వ కట్టడాలు, చారిత్రక ప్రాంతాలు, పర్యాటక ప్రదేశాలకు చెందిన కళాఖండాలు, వాటి సమాచారాన్ని తెలిపేలా ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా జూపల్లి మాట్లాడుతూ 2021లో చైనా ఫ్యూజీలో జరిగిన ప్రపంచ వారసత్వ కట్టడాలు, ప్రాంతాల కమిటీ సమావేశంలో రామప్ప దేవాలయాన్ని వారసత్వ సంపద జాబితాలో చేర్చుతూ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

'ఏఐఎస్‌కు దివ్యాంగులెందుకు?'



సాక్షి, హైదరాబాద్: 'వైకల్యం కలిగిన పైలట్‌ను ఏదైనా విమానయాన సంస్థ ఉద్యోగంలో తీసుకుంటుందా? వైకల్యం కలిగిన శస్త్రచికిత్స నిపుణుడిపై మీరు నమ్మకం ఉంచుతారా? మరీ అత్యంత ప్రతిష్టాత్మకమైన అఖిల భారత సేవల (ఏఐఎస్) (ఐఏఎస్/ఐపీఎస్/ఐఎఫ్ఎస్ తదితర) ఉద్యోగాల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?' అని సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర ఆర్థిక సంఘం కార్యదర్శి స్మితా సబర్వాల్ 'ఎక్స్'వేదికగా ఆదివారం ప్రశ్నించారు. ఉద్యోగ స్వభావ రీత్యా అఖిలభారత సేవల అధికారులు క్షేత్రస్థాయిలో గంటల తరబడి పనిచేయాల్సి ఉంటుందని, ప్రజల విన్నపాలను నేరుగా వింటూ పని చేయాల్సి ఉంటుందని, దీనికి శారీరక ఆరోగ్యం అవసరమని స్పష్టం చేశారు.

స్మితా వ్యాఖ్యలు సరికాదు..

వైకల్యాలు శక్తిసామర్థ్యాలు, మేధోశక్తిపై ప్రభావం చూపవని సీనియ ర్ సుప్రీంకోర్టు న్యాయవాది కరుణ, బ్యూరోక్రాట్లు తమ సంకుచిత స్వభావాన్ని ప్రదర్శిస్తున్నారని శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది విమర్శించారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు సరికాదని ఆమె వారికి క్షమాపణ చెప్పాలని, వికలాంగుల కమిషన్ ఆమెపై కేసు నమోదు చేయాలని తెలంగాణ వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముత్తినేని వీరయ్య, తెలంగాణ వికలాంగుల సంఘాల జేఏసీ కన్వీనర్ నారా నాగేశ్వరరావు ఆదివారం ప్రకటనలో వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు.

'రెడ్‌బుక్'తో అరాచకం

అదే రాజ్యాంగం అనే రీతిలో ఏపీలో పాలన

అధఃపాతాళానికి దిగజారిన శాంతి భద్రతలు | **గవర్నర్ అబ్దుల్‌నజీర్‌కు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఫిర్యాదు**

రాష్ట్రంలో నెలన్నర రోజులుగా డిఫ్యాక్టో రాజ్యాంగం.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. కూటమి ప్రభుత్వ అండదండలతో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసకాండ యథేచ్ఛగా కొనసాగుతోంది. రాజకీయ గూండాలు, మహిళలు–చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వారి చెప్పుచేతల్లోకి ప్రభుత్వ వ్యవస్థ వెళ్లిపోయింది. తమకు ఓటు వేయలేదన్న కారణంతో టీడీపీ గూండాలు ఊరూరా ఇష్టారాజ్యంగా కక్ష సాధింపు చర్యలతో విధ్వంసం సృష్టిస్తున్నారు. వేలాది కుటుంబాలు ఊళ్లొదిలాయి. వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ప్రజాప్రతినిధులు మొదలు సామాన్యుల వరకు రక్షణ లేకుండా పోయింది. కళ్లెదుటే ఫొటో, వీడియో ఆధారాలున్నా పోలీసు యంత్రాంగం అరాచకాన్ని నిలువరించే సాహసం చేయలేకపోతోంది.

– వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల అనంతరం అరాచకాలు, ఆటవిక పాలన, హింసాకాండపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. 'రాష్ట్రంలో రాజ్యాంగం, శాంతి–భద్రతలు, పోలీసు వ్యవస్థ మొత్తం నిస్తేజంగా మారిపోయాయి. 45 రోజులుగా రాష్ట్రంలో డిఫ్యాక్టో రాజ్యాంగం.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించడం లేదు. రాజకీయ గూండాలు, మహిళలు–చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడే వారి చెప్పుచేతల్లోకి ప్రభుత్వ వ్యవస్థ వెళ్లిపోయింది' అని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో ఆదివారం ఆయన భేటీ అయ్యారు. దాదాపు 45 నిముషాలపాటు సాగిన ఈ భేటీలో రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అండదండలతో సాగుతున్న హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసకాండ గురించి గవర్నర్‌కు వివరించారు. 'వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ప్రజాప్రతినిధుల నుంచి సామాన్యుల వరకు రక్షణ లేకుండా పోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో 36 హత్యలు, 300కు పైగా హత్యాయత్నాలకు పాల్పడగా, వేధింపులు తట్టుకోలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 ప్రైవేటు, 490 ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. దాడులతో భయకంపితులై 2,700 కుటుంబాలు తమ గ్రామాలను విడిచి పోయాయి. వాటితో పాటు 1,050 దాడులకు పాల్పడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుత పాలకులు శాంతి–భద్రతలను ఏమాత్రం పరిరక్షించలేరని ఈ దురాగతాలు వెల్లడిస్తున్నాయి' అని గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. టీడీపీ గూండాలు పాల్పడిన హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసానికి సంబంధించిన ఫొటోలు, వీడియోలతో సహా పూర్తి ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. గవర్నర్‌కు సమర్పించిన వినతిపత్రంలో విషయాలు ఇలా ఉన్నాయి.

రాష్ట్రపతి పాలనకు సమయం ఆసన్నం

- అఖిలపక్ష భేటీలో విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి డిమాండ్
- ఏపీలో శాంతి భద్రతల పరిస్థితి అత్యంత దారుణం

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అధఃపాతాళానికి దిగజారిన శాంతి భద్రతలు

రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయి. రాజ్యాంగ వ్యవస్థలు విఫలమయ్యాయి. అధికార యంత్రాంగం నిర్వీర్యమైపోయింది. సామాన్యుల ప్రాణాలకు ఏమాత్రం రక్షణ లేకుండా పోయింది. అధికార పార్టీ నేతలు, కార్యకర్తలు దారుణంగా దాడులకు పాల్పడుతుండటంతో ప్రజల్లో తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ఎన్నికల్లో తమ పార్టీలకు ఓటు వేయని వారిని లక్ష్యంగా చేసుకుని టీడీపీ కూటమి ప్రభుత్వం దాడులకు తెగబడుతోంది. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని వారిని అవమానిస్తూ.. దాడులకు పాల్పడుతుండటమే కాకుండా హతమారుస్తున్నారు. వారి ఆస్తులు, వ్యాపారాలను ధ్వంసం చేస్తూ, ఇళ్లను నేలమట్టం చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్న గ్రామ, వార్డు సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్ భవనాలతోపాటు ఇతర ప్రభుత్వ ఆస్తులను కూడా ధ్వంసం చేస్తున్నారు. వాటిని గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందనే ఒకే ఒక్క విద్వేషంతోనే ఇలా విధ్వంసకాండ సృష్టిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలను కూడా నేలమట్టం చేస్తున్నారు.

ఎంపీల నుంచి సామాన్యుల వరకూ రక్షణ కరువు

టీడీపీ నేతలు, కార్యకర్తల దాడులకు పరాకాష్టగా వినుకొండలో వైఎస్సార్‌సీపీ క్రియాశీల కార్యకర్త రషీద్‌ను ఈ నెల 17న కిరాతకంగా నరికి చంపారు. పోలీసులు సమీపంలోనే ఉన్నాసరే నడి వీధిలో దాడి చేసి మరీ పాశవికంగా హత్య చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతోపాటు ఇటీవల ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన అభ్యర్థులకు రక్షణ లేకుండా పోయింది. ఈ నెల 18న చిత్తూరు జిల్లా పుంగనూరు ఎంపీ ఎస్.రెడ్డప్పను కలిసేందుకు వెళ్లిన లోక్‌సభ వైఎస్సార్‌సీపీ పక్ష నేత, ఎంపీ మిథున్ రెడ్డిపై టీడీపీ మూకలు దాడి చేసి హత్య చేసేందుకు యత్నించాయి. పోలీసుల సమక్షంలోనే ఈ దాడికి పాల్పడటం రాష్ట్రంలో సామాన్యులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల ఉదాసీనతకు ఈ దాడి అద్దం పడుతోంది. పోలీసుల ఈ నిర్లక్ష్య వైఖరితో అమానవీయంగా దాడులు చేసేందుకు తమకు అనుమతి లభించిందన్న రీతిలో టీడీపీ గూండాలు చెలరేగిపోయి యథేచ్ఛగా విధ్వంసకాండ సృష్టిస్తున్నారు.

రెడ్ బుక్.. రాజ్యాంగ అరాచకం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యయుతంగా ఏమాత్రం వ్యవహరించడం లేదు. రాజ్యాంగం, శాంతి–భద్రతలు, పోలీసు వ్యవస్థ మొత్తం అచేతనంగా మారిపోయాయి. 45 రోజులుగా రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగమే అమలవుతోంది. రాజకీయ గుండాలు, మహిళలు, చిన్నారులపై అత్యాచారాలకు పాల్పడేవారి చెప్పుచేతల్లోకి ప్రభుత్వ వ్యవస్థ వెళ్లిపోయింది. గత ఐదేళ్లపాటు రాష్ట్రం అత్యుత్తమ విద్య, వైద్య–ఆరోగ్య విధానాలు, రైతుల సంక్షేమం, మహిళా సాధికారత, పటిష్టమైన శాంతి–భద్రతలు, సమీకృత అభివృద్ధికి నిదర్శనంగా నిలిచింది. కానీ ప్రస్తుతం హత్యలు, అత్యాచారాలు, రాజకీయ కక్ష సాధింపులు, విధ్వంసానికి మారుపేరుగా దిగజారిపోయింది. రాష్ట్రంలో అంతటా అరాచకమే రాజ్యమేలుతోంది. ప్రస్తుత పాలకులు శాంతి–భద్రతలను ఏమాత్రం పరిరక్షించలేరని ఈ దురాగతాలు వెల్లడిస్తున్నాయి.

వైఎస్సార్‌సీపీని అణచివేసే కుట్ర

వైఎస్సార్‌సీపీని అణచి వేయాలని, తమ పార్టీతో అనుబంధం ఉన్న వారిని రాజకీయాల్లో లేకుండా చేయాలనే ఏకైక కుట్రతోనే ఈ దాడులు, విధ్వంసానికి పాల్పడుతున్నారు. అందుకోసం అత్యున్నత స్థాయిలో ఉన్న ఉన్నతాధికారుల నుంచి క్షేత్ర స్థాయిలో అధికారుల వరకు ఈ మేరకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. ఓ రాష్ట్ర మంత్రి రెడ్‌బుక్ పేరుతో ఏకంగా హోర్డింగులు ఏర్పాటు చేసి మరీ దాడులు చేయమని తమ నేతలు, కార్యకర్తలను ఆదేశించారు. ఈ విషయాల్లో జోక్యం చేసుకోవద్దని పోలీసు అధికారులకు కూడా స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. దాంతోనే టీడీపీ గుండాలు రాష్ట్ర వ్యాప్తంగా దాడులకు పాల్పడుతూ బీభత్సం సృష్టిస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు భద్రత కల్పించాల్సిన ప్రభుత్వ యంత్రాంగాన్ని హత్యలు, దాడులు, దురాగతాలకు పాల్పడేందుకు దుర్వినియోగం చేస్తున్నారు. 27 మంది ఐఏఎస్ అధికారులు, 24 మంది ఐపీఎస్ అధికారులకు పోస్టింగులు ఇవ్వకుండా ఈ ప్రభుత్వం వివక్ష, కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. మొత్తం మీద రాష్ట్రంలో శాంతి–భద్రతలు అధఃపాతాళానికి దిగజారిపోయాయి. రాష్ట్రంగానీ ప్రజలుగానీ ఈ దుస్థితిని ఇక ఏమాత్రం భరించే పరిస్థితి లేదు. రాష్ట్రంలో ఎన్నికల అనంతరం హింసాకాండపై కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలతో విచారణ జరిపించాలని కోరుతున్నాం.

మంచి మాట

ఉరుకులు పరుగులతో ఉరవడిగా వచ్చి తనని చేరిన నదిని సముద్రుడు ఒక ప్రశ్న అడుగుతాడు. "నీ ప్రవాహ వేగానికి మహావృక్షాలు విరిగి పడిపోతూ ఉంటాయి. ప్రబ్బలి మొక్కలు అలాగే ఉంటాయి. వాటిని నువ్వు ఏమీ చేయవా?" అని. నది ఈ విధంగా సమాధానం చెపుతుంది. "ప్రబ్బలి మొక్కలు వేగంగా ప్రవాహం వస్తుంటే ఎదురు నిలవక తలవంచి ఉంటాయి. ప్రవాహ వేగం తగ్గగానే యథాప్రకారం తలెత్తుతాయి. మహావృక్షాలు తలవంచవు" అని!



ఒదిగితేనే ఎదుగుదల

నది చెప్పినది వృక్షాలకి సంబంధించినదే అయినా మనకి కూడా వర్తిస్తుంది. ఎగిరెగిరి పడినా, ఎదిరించి నిలిచినా, ఎదురొడ్డి నిలిచినా విరిగి పడటం జరుగుతుంది. పొగరుబోతు గొర్రెపోటేలు కొండని గెలవగలనని కుమ్మి తల చిట్లి నశించినట్టు అవుతుంది. తమకి శక్తి లేకపోయినా అహంకారంతో ఎదుటివారి శక్తి సామర్థ్యాలని తక్కువగా అంచనా వేసి దెబ్బతింటూ ఉంటారు మహావృక్షాల వంటి వారు. పైగా తమ నీడలో మరి ఏ మొక్కకి కూడా పెరిగే అవకాశం ఇవ్వరు. దానితో ఆపదలో ఆదుకునే వారు, తోడ్పడేవారు ఉండక కూలిపోక తప్పదు. తల ఎగరేసి, తల పొగరుతో ఉండక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు తలవంచటం, పరిస్థితులు అనుకూలంగా మారినప్పుడు తలెత్తటం చేస్తారు తెలివిగలవారు గడ్డిపోచల లాగా. పెరుగుతున్న మొక్కకి ఏదైనా అడ్డు వస్తే, కొన్ని పక్కకి వంగి వెలుగు వచ్చే దారి చూసుకుని ఎదుగుతాయి. నిటారుగా మాత్రమే ఎదుగుతాము, వంగము అనుకున్న మొక్కలు గిడసబారతాయి.

> ఎదురీత నదిలోనే కాదు ఎక్కడైనా శ్రమతో కూడుకున్నదే. జీవితమనే ప్రవాహంలో కదిలే మనిషి అనుకూలమైన దిశలో సాగితే ప్రయాణం సుకరంగా ఉంటుంది. వ్యతిరేక దిశలో వెళ్ళటానికి ఎంతో శక్తిని వెచ్చించ వలసి ఉంటుంది. జీవితం సంఘర్షణ అవుతుంది. కొన్ని సందర్భాలలో ప్రవాహం ముందుకి తోస్తుంటే, తాను వెనక్కి వెళ్ళే ప్రయత్నం చేస్తుంటే అంగుళం కూడా కదలక ఉన్న చోటనే నిలిచి పోవలసి రావచ్చు. నిలదొక్కుకోలేక కూలబడవచ్చు. అప్పుడు ప్రవాహంలో కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. వీలు, వాలు చూసుకోవాలని పెద్దలు చెప్పేది అందుకే!


సముద్రంలో స్నానం చేయటానికి గాని, ఈత కొట్టటానికి గాని వెళ్ళేవారు అలకి అనుకూలంగా వెడతారు. అలతో పాటు లేచి పడతారు. అలకి వ్యతిరేక దిశగా ఈత కొడితే జరిగే అనర్థాలు అందరికీ తెలుసు. నదుల్లోనూ, కాలవల్లోనూ ఈతకి వెళ్ళేవారు ప్రవాహం ఎటువైపు ఉంటే అటే వెడతారు. వ్యతిరేక దిశలో వెడితే అది ఎదురీత. పడవలు కూడా ప్రవాహం వెళ్ళే దిశలో వేగంగా వెడతాయి. వ్యతిరేక దిశలో ప్రయాణం శ్రమతో కూడుకొని ఉంటుంది.

పరిస్థితులని గమనించకుండా ఉండే ఈ ప్రవర్తనకి మనిషిలో ఉండే అహంకారమే కారణం. నా అంతటి వారు లేరు అనే గుణం. నన్ను ఎదిరించగల వారు లేరు అనే పొగరు. ఎదుటివారి సామర్థ్యాన్ని గుర్తించలేని గుడ్డితనం. ఎగిరెగిరి పడుతూ ఉంటారు. అదిరిపాటుకి అంతూ దరీ ఉండవు. దీనినే 'మదం' అని కూడా అంటారు. విరగబాటుతనం ఉంటే ప్రవాహానికి ఎదురొడ్డిన మహావృక్షాల లాగా విరిగి పడటం తప్పదు.

అంటే ఎప్పుడూ పరిస్థితులకి, అవతలి వారి ఇష్టానిష్టాలకి తల ఒగ్గి, వ్యక్తిత్వం అన్నది లేకుండా బతక వలసిందేనా? అన్న సందేహం రావటం సహజం. పరిస్థితులని మార్చగల శక్తిసామర్థ్యాలు ఉంటే మంచిదే. ఎప్పుడూ అట్లా ఉండటం అసంభవం. ప్రతికూలంగా ఉన్న సందర్భాలలో ఎట్లా ఉండాలి అన్నది కూడా తెలియాలి కదా! రోగాన్ని తగ్గించే అవకాశం లేకపోతే ఉపశమనం కలిగించాలి. అనుకూల వాతావరణం వచ్చే దాకా ఊరుకోవటం ఉత్తమం. ''కొంచెముండు టిల్ల కొలది కాదు'' అన్న వేమనని అనుసరించటం శ్రేయస్కరం.

– డా॥ ఎన్. అనంత లక్ష్మి

గృహస్థాశ్రమ వైశిష్ట్యం



... అదే మనల్ని పట్టుకున్నది

ఇంద్రియాలను నిగ్రహించడం అంత తేలికకాదు. రావణాసురుడు రాముడి చేతిలో పది తలలు తెగి పడిపోయి ఉన్నాడు యుద్ధభూమిలో. మండోదరిని పల్లకీలో తీసుకొచ్చారు. అక్కడ ఆమె దిగింది. కాస్త దూరంలో రామలక్ష్మణులు నిలబడి ఉన్నారు. అందరూ అనుకున్నారు.. ''నా భర్తను నువ్వే చంపేసావ్ ... దుర్మార్గుడివి..'' అని రాముణ్ణి తిడుతుందనుకున్నారు. ఎంతయినా భర్త కదా, ఆక్రోశంలో నిందిస్తుందనుకున్నారు. ఆమె నేరుగా నేలపై పడి ఉన్న రావణుడి దగ్గరకు వెళ్లి..'' ఇంద్రియాణి పురా జిత్వా జితం త్రిభువనం త్వయా / స్మరద్భిరవ తద్వైరమింద్రియైరేవ నిర్జితః'' అన్నది. నీవు ఒకప్పుడు త్రిభువన సామ్రాజ్యాన్ని కోరుకున్నావు. ఆ కోరిక తీరడానికి తపస్సు చేసావు. ఆ సమయంలో ఇంద్రియాలను బలవంతంగా నిగ్రహించావు. కాలికింద తల దించుకుని పాము అవకాశం కోసం ఎదురు చూసినట్లు నీవు కోరుకున్న సామ్రాజ్యం రాగానే నీ ఇంద్రియాలే నిన్ను కాటేసాయి. మహా పతివ్రత సీతమ్మను వేధించావు. రాముని చేతిలో చచ్చిపోయావని అందరూ అనుకుంటున్నారు. నీ భార్యగా నాకు తెలుసు. రాముడి చేతిలో కాదు, నీ ఇంద్రియాల చేతిలోనే నీవు చచ్చిపోయావు'' అంది. ఈ మాటలను సీతమ్మ కూడా ముందే ఇంచుమించు ఇలాగే చెప్పింది..''నీ కామం నీ భార్యయందుంచుకో. ధర్మానికి కట్టుబడి ఉండు. దోషం లేదు. నీ కామం నీ భార్యను దాటిపోయిందా నీకు మహాపాపం చుట్టుకుంటుంది... వద్దు. ధూర్త విషయాలజోలికి వెళ్ళకు' అని హెచ్చరించింది కూడా..

అందువల్ల ఇంద్రియాలను నిగ్రహించడం అంత తేలికయిన పనేం కాదు. అరిషడ్వర్గాలకు దూరంగా ఉండాలని చెప్పడం చాలా తేలికే. అంటే కామానికీ, కోపానికీ... దూరంగా ఉండమంటున్నారు.. సరే.. అసలు కామాన్ని పట్టుకుని ఉంటే కదా... ఈ మాట అనవలసింది. మరి ....మనం పట్టుకోవడం కాదు... అదే మనల్ని పట్టుకుంటున్నది. అది వదలాలి అంటే... మొదట అది మనల్ని పట్టుకుందని గుర్తించాలి. తరువాత మనం ఏం చేస్తే అది పట్టు వదులుతుందో కూడా తెలుసుకోవాలి. ఇది అందరికీ అన్వయం అవుతుందా లేదా.. పక్కనబెట్టి గృహస్థుకు ఏ ధర్మం అన్వయం అవుతుందో అదే అన్వయం చేసుకోవాలి.

అందుకే ప్రహ్లాదుడు హిరణ్యకశిపుడితో మాట్లాడుతూ ...''లోకములన్నియున్ గడియలోన జయించినవాడ వింద్రియా / నీకము జిత్తమున్ గెలువ నేరవు నిన్ను నిబద్ధు జేయు నీ/ భీకర శత్రు లార్వుర బ్రభిన్నుల జేయుము ప్రాణికోటిలో/ నీకు విరోధి లే డొకడు నేర్పున? జూడుము దానవేశ్వరా!' అంటాడు. నీవు లోకాలన్నీ గెలిచానంటున్నావు కదా... ముందు నీ ఇంద్రియాలను నీవు గెలిచావా? నీ మనసును గెలిచావా? అది చెప్పు.. వాటిని గెలవడం అంత తేలిక కాదు. వాటిని గెలువు. గెలిస్తే... అప్పుడు నీకు శత్రువన్న వాడెవడూ ఎదురుగా కనబడడు. అందరూ మిత్రులే...అంటాడు. కాబట్టి అది అనుష్ఠానం చేత గెలవాలి. అంటే సుఖాన్ని ధర్మంతో కట్టేసి ఉంచాలి. అప్పుడు ధర్మబద్ధమైన అర్థం ప్రభవిస్తుంది. కామం ధర్మబద్ధమైనప్పుడు సంతానం కూడా ధర్మబద్ధంగానే ఉంటుంది. సమాజం నైతికంగా ఒక క్రమ పద్ధతిలో, సుఖసంతోషాలతో, ప్రశాంతంగా పురోగమిస్తుంది.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి



దానంలో ఘటికుడు

పూర్వం కశ్యపబుద్ధుని కాలంలో వేగళింగ అనే నగరం ఉండేది. ఆ నగర శివారులో ఘటీకారుడు అనే కుమ్మరి ఉండేవాడు. అతనికి జ్యోతిపాలుడు అనే మిత్రుడు ఉండేవాడు. అప్పుడు ఆ ప్రాంతాన్ని కికీలుడు అనే రాజు పాలిస్తూ ఉండేవాడు.

ఘటీకారుడు కశ్యప బుద్ధుని ఉపాసకుడు. కశ్యపుని ధర్మ ప్రబోధాలు విని ధార్మికంగా జీవిస్తూ ఉండేవాడు. కుండలు చేయడానికి కావలసిన మట్టిని పలుగు పారలతో తవ్వి తీసేవాడు కాదు. క్రిమికీటకాలు తన పలుగు కింద పడి చనిపోతాయని. ఎలుకలు తవ్వి పోసిన మట్టిని మాత్రమే తీసుకుని పోయి కుండలు చేసేవాడు. ఆ కుండల్ని కూడా ఎక్కువ ధరకు అమ్మేవాడు కాదు. వాటిని ఆరుబయట ఉంచేవాడు. కావలసిన వాళ్లు కుండల్ని తీసుకుని అక్కడ ఉంచిన గంపల్లో తాము చెల్లించాల్సిన ధరకు సరిపడే ధనాన్ని గానీ, నూకల్ని గానీ, ధాన్యాన్ని గానీ ఉంచి వెళ్ళేవారు. అలా... నిజాయితీగా, ధర్మబద్ధంగా తాను జీవిస్తూ అందరూ జీవించాలని కోరుకునేవాడు.

అతని తల్లిదండ్రులు ఇద్దరూ అంధులు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వారి ఆలనా పాలనా చూసేవాడు. వారు కూడా ధార్మికులే. ఇతరులు లేని సమయంలో ఎవరైనా భిక్షువులు గానీ, యోగులుగానీ భిక్షకు వస్తే...''అయ్యా! మేము ఇద్దరం గుడ్డివాళ్ళం. లేవలేని ముసలివాళ్ళం. అదిగో ఇంట్లో ఉట్టిమీద ఆహారం ఉంది. మీకు కావలసినంత మీరే తీసుకోండి. మేము ఇచ్చే భిక్షగా భావించండి'' అనేవారు.

ఒకరోజున కికీలుడు తన రాజభవనం ముందు నిలబడ్డాడు. అటుగా కశ్యపబుద్ధుడు తన శిష్యగణంతో వెళ్తున్నాడు. కికీలక మహారాజు వారి ముందుకు వచ్చి నమస్కరించి– ''భగవానులు మమ్ము అనుగ్రహించాలి. భిక్షుసంఘంతో వచ్చి మా ఆతిథ్యం స్వీకరించాలి'' అని వేడుకున్నాడు.

''లేదు మహారాజా! నేను వేరొకరికి మాట ఇచ్చాను'' అన్నాడు.

''ఎవరికి భగవాన్? నేను ఈ దేశానికి రాజుని. ప్రభువుగా వెళ్ళి వారిని అర్థిస్తాను. ఈరోజు ఆ అవకాశం నాకు ఇవ్వమంటాను. మరోమారు వారిని తీసుకోమంటాను'' అన్నాడు.

''లేదు మహారాజా! ఈ రోజు నేను వారి ఇంటనే భిక్ష స్వీకరించాలి'' అని ముందుకు నడిచాడు. భిక్షుగణం ఊరి చివరకు వెళ్ళింది. అప్పటికే పట్టిన మబ్బుల్నుండి సన్నని చినుకులు రాలుతున్నాయి. భిక్షు సంఘం వెళ్ళేసరికి... ఘటికారుని పూరిపాక మీద పరచిన ఎండు గడ్డిని తీసివేసి కట్టలు కట్టారు. ఆ కట్టల్ని ఎవరో మోసుకుపోతున్నారు. గడ్డి తీయడంతో పాక మీద ఖాళీలు కనిపిస్తున్నాయి. కశ్యప బుద్ధుణ్ణి వారు గౌరవంగా ఇంటి వసారాలోకి ఆహ్వానించారు. ఆ చూరు కిందే కూర్చుని పచ్చడి మెతుకుల భిక్ష స్వీకరించారు. వర్షం పెరిగింది. తడుస్తూనే ధర్మోపదేశం చేశాడు కశ్యపుడు. ఘటికారుడు కశ్యపునికి పాదాభివందనం చేశాడు. భిక్షాగణం తిరిగి బయలుదేరింది. దారిలో చెట్టుకింద కికీలమహారాజు కనిపించాడు.

''చూశావా! మహారాజా! ఘటికారుడు ఎంతటి దానపరుడో! ఎవరో గడ్డి అడిగారు. తన దగ్గర లేదు. అయినా తన ఇంటి మీద పరచిన గడ్డిని తీసి దానం చేశాడు. అతను మహాదాత. అతని భిక్ష స్వీకరించడం మాకు ఎంతో సంతోషం.'' అంటూ ముందుకు కదిలాడు.

తాను సమర్పించే గొప్ప భోజనాన్ని కాదని, పూరిగుడిసెలో పచ్చడి మెతుకుల కోసం కశ్యపు బుద్ధుడు ఎందుకు వెళ్ళాడో రాజుకి అర్థమైంది. తనకంటే ఘటికారుడే గొప్పవాడని గ్రహించాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

ఏ దివిలో విరిసిన పారిజాతమో


జూలై 22
దాశరథి శత జయంతి ప్రారంభం

ఏ దివిలో విరిసిన పారిజాతమో
ఏ కవిలో మెరిసిన ప్రేమ గీతమో
నా మదిలో నీవై నిండిపోయెనే...

ఈ పాట ఉన్న సినిమా పేరు చాలామందికి తెలియకపోవచ్చు. సినిమా విడుదలయ్యి 50 సంవత్సరాలయ్యిందని కూడా తెలియకపోవచ్చు. హీరో ఎవరో. హీరోయిన్ ఎవరో. కాని పాట నిలిచింది. రాసిన దాశరథి నిలిచారు. పాడిన గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కూడా. *'నిదుర మబ్బును మెరుపు తీగవై కలను రేపినది నీవే'* అని ఇదే పాటలో రాశారు దాశరథి. సినిమా సంగీత ఆకాశంలో కొన్ని నిదుర మబ్బులను తన రాకతో దాశరథి చెదరగొట్టారు. కొన్ని దివ్య పద ద్వారాలను తెరిచారు.

దివి నుంచి భువికి దిగి వచ్చె దిగి వచ్చె
పారిజాతమే నీవై నీవై

ఇది 'తేనె మనసులు' కోసం దాశరథి రాశాక కె.వి.మహదేవన్ ట్యూన్ చేసిన పాట. కాని 'ఇద్దరు మిత్రులు' కోసం సాలూరి రాజేశ్వరరావు హార్మోనియం పెట్టెను ముందరేసుకుని 'మీరు ట్యూన్‌కి రాస్తారా, రాస్తే నన్ను ట్యూన్ చేయమంటారా?' అని అడిగారు దాశరథిని. బహుశా దాశరథి ఆ క్షణంలో నవ్వుకుని ఉంటారు. నిజాము మీద యుద్ధగళం విప్పి వరంగల్ జైలులో బందీ అయినపుడు ఒక రాత్రి ఆయనను ఉన్నట్టుండి ఇతర రాజకీయ ఖైదీలతో కలిపి నిజామాబాద్ జైలుకు బయలుదేరదీశారు పోలీసులు. అది డిసెంబర్ నెల. రాత్రి. భయంకరమైన చలి. ఎక్కడకు తీసుకెళుతున్నారో తెలియని అయోమయం. దాశరథి ఆ చలిలో, బిక్కచచ్చిన తోటి రాజకీయ ఖైదీలను ఉత్తేజపరుస్తూ కవిత్వం అందుకున్నారు. ఆశువుగా. తెగిపడే కంఠంతో. ఒక్కో కవితా కాగడ. వెచ్చదనం రాజేస్తున్న నెగడు. అలాంటి దాశరథికి– పళ్ల తోముకోవడానికి బొగ్గుముక్క ఇస్తే జైలు గోడలను కవిత్వంతో నింపిన దాశరథికి– ట్యూన్ ఇస్తే ఎంత. నేరుగా రాయమంటే ఎంత. 'ఎలాగైనా పర్వాలేదండీ' అన్నారు దాశరథి. సాలూరు ట్యూన్ ఇచ్చారు. 'నేను తాంబూలం వేసుకు వస్తాను. ఆలోచిస్తూ ఉండండి' అని బయటకు వెళ్లి వచ్చిన ఆయన ఎర్రబడ్డ నోటిని ఆశ్చర్యంతో తెరిచారు. పల్లవి రెడీ!

ఖుషీ ఖుషీగా నవ్వుతూ చెలాకి మాటలు రువ్వుతూ
హుషారు గొలిపేవెందుకే నిషా కనులదానా

ఈ ఖుషీ ఆ నిషా అప్పటి వరకూ తెలుగు పాట ఎరగదు. ఇది దాశరథి ఇచ్చిన హైదరాబాద్ టచ్. దక్కనీ మిఠాస్. పాట హిట్ అయ్యింది. దాశరథి నుంచి 'గాలిబ్ గీతాల' సంపుటిని అంకితం తీసుకున్నందుకు అక్కినేని 'ఇద్దరు మిత్రులు' ద్వారా ఇచ్చిన అవకాశం కవికి విజయావకాశంగా మారింది. తెలుగు పాట దాశరథిని చూసి ఇలా అంది –

నా కంటి పాపలో నిలిచిపోరా
నీ వెంట లోకాల గెలవనీరా

ఇద్దరు హైదరాబాద్ కవులు ఒక సంవత్సరం తేడాలో తెలుగు పరిశ్రమలో అడుగు పెట్టారు. మొదట అక్కినేని ద్వారా దాశరథి (1961). తర్వాత ఎన్టీఆర్ ద్వారా సి. నారాయణ రెడ్డి (1962). దాశరథిది మొదటి నుంచి పోరుగీతం. ఆయన స్వయంగా నిజాం వ్యతిరేక ఉద్యమకారుడు. అజ్ఞాతంలో ఉన్నారు. జైలులో బాధలు పడ్డారు. ఆల్ ఇండియా రేడియోలో 1956 నుంచి '71 వరకూ ఉద్యోగాన్ని కాపాడుకుంటూ సినిమా కవిగా అవకాశాలు ఉపయోగించుకున్నారు. 1977 నుంచి '83 వరకు అంటే ఎన్టీఆర్ వచ్చి రద్దు చేసే దాకా దాశరథి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆఖరు ఆస్థానకవి. ఆ పదవిలో ఉండగా సినిమా గీతాలు ఆయన పెద్దగా రాయలేదు. దానికి తోడు 1987లో 62 ఏళ్ల వయసులో ఎదురైన అకాల మరణం దాశరథికి సుదీర్ఘ సినిమా కెరీర్ లేకుండా చేసింది. ఆయన సుమారు 620 పాటలు రాసి ఉండవచ్చు. రాసింది తక్కువైనా హిట్ అయినవి ఎక్కువ. చెట్టు పిట్ట కూడా పాడుకున్న పాట ఆయనది.

గోదారి గట్టుంది గట్టు మీన సెట్టుంది
సెట్టు కొమ్మన పిట్టుంది పిట్ట మనసులో ఏముంది

అన్నపూర్ణ, ఆదుర్తి ఇలా ఒకటి రెండు అనుబంధాలు తప్ప దాశరథి ప్రత్యేకంగా ఏదో ఒక గ్రూప్‌తో లేదా సంస్థతో కలిసి ఉన్నట్టు లేదు. సినిమా రంగంలో ప్రతిభతో పాటు పి.ఆర్ కూడా ముఖ్యం. తిరగబడే కవికి అలాంటి స్వభావం తక్కువ. ఆశ్చర్యం ఏమిటంటే ఇంత ఉడుకునెత్తురు కవికి సినిమాలో ఆవేశ కావేశాల పాటలు ఏమాత్రం దక్కలేదు. చాలా మటుకు ప్రేమగీతాలు, ఎన్నటికీ మాయని యుగళ గీతాలు.

ఎన్నెన్నో జన్మల బంధం నీది నాది
ఎన్నటికీ మాయని మమత నాది నీది

దాశరథి కుటుంబ అనుబంధాలను రాశారు. *'అన్నా నీ అనురాగం ఎన్నో జన్మల పుణ్యఫలం'* ఆయనదే. *'బాబూ వినరా... అన్నాదమ్ముల కథ ఒకటి'*... *'అమ్మ అన్నది ఒక కమ్మని మాట'*.... అలాగే కవ్వింతలూ రాశారు... *'అది ఒక ఇదిలే అతనికి తగులే'*... భార్య అలక భర్త వేడుకోలు... *'ఓ చెలి కోపమా... అంతలో తాపమా'*... ఊరడింపు *'గోరొంక గూటికే చేరావు చిలక... భయమెందుకే నీకు బంగారు మొలక'*... దరఖాస్తు... *'విన్నవించుకోనా... చిన్న కోరిక'*... 'కాజల్' సినిమా కోసం సాహిర్ రాసిన *'ఛూలేనేదో నాజుక్ హోటోంకో'* విఖ్యాత గీతాన్ని దాశరథి ఎంత కోమలంగా తెలుగు చేశారో చూడండి. 'తాగాలి' కాదు 'తాకాలి' అన్నారు.

నీ లేత గులాబి పెదవులతో
కమ్మని మధువును తాకాలి

దాశరథికి కృష్ణ అనుబంధం ఉంది. దైవబంధం ఉంది. ఆయన పాటలు ఆలయాల్లో నేటికీ సుప్రభాత గీతాలు. *'పాడెద నీ నా నామమే గోపాల'*... *'రారా కృష్ణయ్య రారా కృష్ణయ్య'*, *'కన్నయ్యా... నల్లని కన్నయ్య'*... *'మనసే కోవెలగా... మమతలు మల్లెలుగా... నిన్నే కొలిచెదరా... కృష్ణా'*... *'నేనె రాధనోయి గోపాలా'*... *'నడిరేయి ఏ జాములో స్వామి నిను చేర దిగి వచ్చునో'*... *'మము పాలింపగ నడచి వచ్చితివా'*... వాణి జయరామ్‌కు దాశరథి వల్ల దక్కిన పూలసజ్జ వంటి గీతం చూడండి.

పూజలు చేయ పూలు తెచ్చాను
నీ గుడి ముందే నిలిచాను
తీయరా తలుపులను రామా...

దాశరథికి వీణ ఇష్టం. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్నారు. సినిమా గీతాల్లో కూడా ఆయన ఈ వీణానాదాన్ని పలికించారు. *'మదిలో వీణలు మ్రోగె'*... *'నీవు రావు నిదుర రాదు'*.. *'వేణుగాన లోలునిగన వేయి కనులు చాలవులే'*.... ఇక ఈ పాట?

మ్రోగింది వీణ పదే పదే హృదయాలలోనా
ఆ దివ్యరాగం అనురాగమై సాగిందిలే....

నేటి నుంచి దాశరథి శతజయంతి సంవత్సర వేడుకలు మొదలుకానున్నాయి. సినిమా రంగం, సినీ సంగీత రంగం, సినీ గేయకర్తలు, అభిమానులు సమావేశాలు, సంగీత విభావరులు నిర్వహించుకుని దాశరథి పాటలను మళ్లీ తలుచుకుని పాడుకోవాల్సిన సందర్భం ఇది. అయితే మన సినిమా రంగానికి పెద్దగా ఇటువంటి వాటికి సమయం ఉండదు. కాని ప్రజల వద్ద శ్రోతల వద్ద ఉంటుంది. సత్కవిని తమ నాల్కల యందు నుంచి కడిగేసే మూర్ఖులు ఎంత మాత్రం కారు వారు. పాడుకుంటూ ఉంటారు. పాడుతూనే ఉంటారు. వారికి తనివి తీరదు.

తనివి తీరలేదే నా మనసు నిండలేదే
ఏనాటి బంధమీ అనురాగం

– కె

బచ్చన్ ఫిక్స్


రవితేజ

'మిస్టర్ బచ్చన్' ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ఫిక్స్ అయ్యాడు. రవితేజ హీరోగా నటించిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లు ఆదివారం ప్రకటించారు మేకర్స్. ''మిస్టర్ బచ్చన్' పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మూవీని విడుదల చేస్తున్నాం. ఆగస్ట్ 14న ప్రీమియర్ షోలు వేస్తున్నాం. ఆగస్ట్ 19న రక్షా బంధన్ సెలవు ఉంటుంది. 5 రోజుల లాంగ్ వీకెండ్ మా మూవీకి ప్లస్ అవుతుందనుకుంటున్నాం'' అని చిత్రబృందం పేర్కొంది.

నేను చేసిన తప్పులకు కృతజ్ఞతలు

– ధనుష్


సందీప్, ప్రకాశ్‌రాజ్, ధనుష్, దుషారా విజయన్, అపర్ణా బాలమురళి, సురేష్‌బాబు, జాన్వీ

''నా మొదటి సినిమా నుంచి ఇప్పటివరకూ మంచి దర్శకులతో పనిచేశాను. వాళ్లందరి దగ్గరి నుంచి ఒక్కో విషయం నేర్చుకుంటూ వచ్చి డైరెక్టర్ అయ్యాను. నాకు నటనకంటే కూడా డైరెక్షన్ అంటే ఎక్కువ ఇష్టం'' అని ధనుష్ అన్నారు. ఆయన హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రాయన్'. ప్రకాశ్ రాజ్, దుషారా విజయన్, అపర్ణా బాలమురళి, విష్ణు విశాల్, సందీప్ కిషన్ కీలక పాత్రలు పోషించారు. కళానిధి మారన్ నిర్మించిన 'రాయన్' ధనుష్ కెరీర్‌లో 50వ సినిమా. ఈ మూవీ తెలుగు, తమిళ, మలయాళ, కన్నడలో ఈ నెల 26న విడుదల కానుంది. తెలుగులో ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో రిలీజ్ అవుతోంది. ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ధనుష్ మాట్లాడుతూ–''నేను ముఖ్యంగా రెండు విషయాలకు కృతజ్ఞతలు చెప్పాలనుకుంటున్నాను. ఒకటి.. నా మొదటి సినిమా నుంచి 49వ సినిమా వరకూ నేను పని చేసిన దర్శకులందరికీ కృతజ్ఞతలు. రెండోది.. నేను చేసిన తప్పులకు కృతజ్ఞతలు. ఈ వేడుకలో నా గత చిత్రాలకు సంబంధించిన ఏవీ వేసినప్పుడు నాకు చాలా తప్పులు కనిపించాయి. ఆ తప్పుల నుంచి చాలా నేర్చుకున్నాను. ఇక గొప్పగా చెప్పుకునే సినిమా ఇవ్వాలనే 'రాయన్' చేశాను. తెలుగులో ఎన్టీఆర్‌తో మల్టీస్టారర్ చేయాలనుంది. నాకు తెలుగు వంటకాల్లో ఆవకాయ పప్పన్నం అంటే ఇష్టం'' అన్నారు. ''ధనుష్ సౌత్ ఇండియా, నార్త్ ఇండియా అని కాకుండా ఇండియన్ ఇండస్ట్రీలోనే ఫైనెస్ట్ హీరో అండ్ ఫైనెస్ట్ ఆర్టిస్ట్ అనిపించుకున్నారు. క్రిస్మస్‌కి 'గేమ్ చేంజర్' సినిమాతో కలుద్దాం'' అన్నారు 'దిల్' రాజు. ''రాయన్' ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నా'' అన్నారు డి. సురేష్‌బాబు. నిర్మాతలు సునీల్ నారంగ్, భరత్ నారంగ్, డైరెక్టర్ గోపీచంద్ మలినేని తదితరులు పాల్గొన్నారు.

రాకీ ప్రపంచంలోకి...


శ్రద్ధా శ్రీనాథ్

విశ్వక్ సేన్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. రవితేజ ముళ్లపూడి దర్శకునిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్ఆర్‌టీ ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామ్ తాళ్లూరి నిర్మిస్తున్నారు. కాగా శ్రద్ధా శ్రీనాథ్‌ని స్వాగతిస్తూ, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''మెకానిక్ రాకీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నా'' అని ఈ సందర్భంగా శ్రద్ధా శ్రీనాథ్ పేర్కొన్నారు. ''ముక్కోణపు ప్రేమకథగా రూపొందుతోన్న చిత్రం 'మెకానిక్ రాకీ'. మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. దీపావళి కానుకగా అక్టోబర్ 31న సినిమాని విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మనోజ్ కాటసాని.



బీసీసీఐ నుంచి ఐఓఏకు రూ. 8 కోట్ల 50 లక్షలు

పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడనున్న భారత క్రీడాకారులకు ఆర్థిక సహకారం అందించాలని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘానికి (ఐఓఏ) రూ. 8 కోట్ల 50 లక్షలు ఇస్తామని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. ఈనెల 26న మొదలయ్యే పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో దేశం గర్వపడేలా చేయాలని జై షా ఆకాంక్షించారు. పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ నుంచి 16 క్రీడాంశాల నుంచి 117 మంది క్రీడాకారులు బరిలో ఉన్నారు.

రన్నరప్ సహజ జోడీ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 మహిళల టోర్నీలో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది. అమెరికాలోని ఇండియానా రాష్ట్రంలోని ఇవాన్స్‌విల్లె పట్టణంలో ఈ టోర్నీ జరిగింది. డబుల్స్ ఫైనల్లో సహజ (భారత్)-హీరోకో కువాటా (జపాన్) జోడీ 2-6, 0-6తో అలీసియా లినానా (స్పెయిన్)-మెలానీ క్రివోజ్ (అర్జెంటీనా) ద్వయం చేతిలో ఓడిపోయింది. సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో సహజ 7-5, 2-6, 6-7 (6/8)తో ఇరీనా షమనోవిచ్ (రష్యా) చేతిలో పోరాడి ఓడిపోయింది.



'హాల్ ఆఫ్ ఫేమ్'లో పేస్, విజయ్ అమృత్‌రాజ్

న్యూపోర్ట్ (అమెరికా): భారత దిగ్గజ టెన్నిస్ క్రీడాకారులు లియాండర్ పేస్, విజయ్ అమృత్‌రాజ్‌లకు గొప్ప గౌరవం లభించింది. ఈ ఇద్దరికీ అంతర్జాతీయ టెన్నిస్ 'హాఫ్ ఆఫ్ ఫేమ్'లో చోటు కల్పించారు. ఆసియా నుంచి ఈ గౌరవం పొందిన టెన్నిస్ క్రీడాకారులు వీరిద్దరే కావడం విశేషం. 51 ఏళ్ల పేస్ వరుసగా ఏడు ఒలింపిక్స్ క్రీడల్లో (1992 బార్సిలోనా నుంచి 2016 రియో వరకు) పోటీపడ్డ ఏకైక టెన్నిస్ క్రీడాకారుడిగా రికార్డు నెలకొల్పాడు. 1996 అట్లాంటా ఒలింపిక్స్‌లో వ్యక్తిగత సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం నెగ్గిన పేస్ డేవిస్‌కప్‌లో భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో పురుషుల డబుల్స్‌లో 8 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌లో 10 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్‌ను గెల్చుకున్న పేస్‌కు 'ప్లేయర్ కేటగిరీ'లో హాల్ ఆఫ్ ఫేమ్‌లోకి ఎంపిక చేశారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహిళా దిగ్గజ టెన్నిస్ ప్లేయర్ మార్టినా నవ్రతిలోవా చేతుల మీదుగా పేస్ 'హాల్ ఆఫ్ ఫేమ్' పతకాన్ని అందుకున్నాడు. మరోవైపు 70 ఏళ్ల విజయ్ అమృత్‌రాజ్ 1974, 1987లలో భారత జట్టు డేవిస్‌కప్ ఫైనల్‌కు చేరుకోవడంలో కీలకపాత్ర పోషించారు. ఇప్పటి వరకు 28 దేశాల నుంచి 267 మంది టెన్నిస్ ప్లేయర్లకు 'హాఫ్ ఆఫ్ ఫేమ్'లో స్థానాన్ని కల్పించారు.

ఎదురులేని భారత్

- 78 పరుగులతో యూఏఈపై ఘనవిజయం
- రిచా, హర్మన్‌ప్రీత్ మెరుపులు
- టి20ల్లో తొలిసారి 200 స్కోరు దాటిన టీమిండియా
- మంగళవారం నేపాల్‌తో చివరి మ్యాచ్



దంబుల్లా: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత మహిళా క్రికెటర్లు ఆసియా టి20 టోర్నీలో మరో భారీ విజయం సాధించారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్టుతో ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం 78 పరుగుల తేడాతో ఘనవిజయం నమోదు చేసింది. వరుసగా రెండో గెలుపుతో భారత జట్టుకు సెమీఫైనల్ బెర్త్ దాదాపు ఖరారైంది. యూఏఈ కెప్టెన్ ఇషా ఓజా ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసింది. అంతర్జాతీయ టి20ల్లో భారత్‌కిదే అత్యధిక స్కోరు కావడం విశేషం. ఓపెనర్లు షఫాలీ వర్మ (18 బంతుల్లో 37; 5 ఫోర్లు, 1 సిక్స్), స్మృతి మంధాన (9 బంతుల్లో 13; 1 ఫోర్, 1 సిక్స్) మెరుపు ఆరంభాన్నిచ్చారు. స్మృతి వెనుదిరిగిన కాసేపటికి టీమిండియా వరుస బంతుల్లో షఫాలీ, హేమలత వికెట్లను చేజార్చుకుంది. దాంతో భారత్ 5.1 ఓవర్లలో 52 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (47 బంతుల్లో 66; 7 ఫోర్లు, 1 సిక్స్), జెమీమా రోడ్రిగ్స్ (13 బంతుల్లో 14) భారత్‌ను ఆదుకున్నారు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 54 పరుగులు జోడించారు. జెమీమా అవుటయ్యాక హర్మన్‌తో కలిసిన వికెట్ కీపర్ రిచా ఘోష్ (29 బంతుల్లో 64 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్) యూఏఈ బౌలర్ల భరతం పట్టింది. వీరిద్దరు ఐదో వికెట్‌కు 45 బంతుల్లో 75 పరుగులు జత చేశారు. చివరి ఓవర్ తొలి బంతికి హర్మన్‌ప్రీత్ రనౌటవ్వగా... మిగిలిన ఐదు బంతుల్లో రిచా ఐదు ఫోర్లు కొట్టింది. ఈ క్రమంలో రిచా 26 బంతుల్లో తన అర్ధ సెంచరీని పూర్తి చేసుకుంది. అంతేకాకుండా తొలిసారి టి20ల్లో భారత జట్టు స్కోరును 200 పరుగులు దాటించింది. 202 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన యూఏఈ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 123 పరుగులు చేసి ఓడిపోయింది. ఇషా ఓజా (38; 5 ఫోర్లు, 1 సిక్స్), కవీషా (40 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. రిచా ఘోష్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. లెగ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ ఎడమ చేతికి గాయం కావడంతో ఆమె ఈ టోర్నీ నుంచి వైదొలిగింది. శ్రేయాంక స్థానంలో తనూజా కన్వర్ ఈ మ్యాచ్‌తో టీమిండియా తరఫున అరంగేట్రం చేసింది. భారత జట్టు తమ చివరి లీగ్ మ్యాచ్‌ను మంగళవారం నేపాల్ జట్టుతో ఆడుతుంది. గ్రూప్ 'ఎ'లో జరిగిన మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు తొమ్మిది వికెట్ల తేడాతో నేపాల్ జట్టును ఓడించి సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది.

స్కోరు వివరాలు

భారత ఇన్నింగ్స్: షఫాలీ వర్మ (సి) తీర్థ (బి) సమైరా 37; స్మృతి మంధాన (సి) రినిత (బి) కవీషా 13; హేమలత (బి) హీనా 2; హర్మన్‌ప్రీత్ కౌర్ (రనౌట్) 66; జెమీమా (సి) రినిత (బి) కవీషా 14; రిచా ఘోష్ (నాటౌట్) 64; పూజ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 201. వికెట్ల పతనం: 1-23, 2-52, 3-52, 4-106, 5-181. బౌలింగ్: సమైరా 4-0-42-1, ఖుషీ శర్మ 1-0-15-0, కవీషా 4-0-36-2, హీనా 4-0-40-1, వైష్ణవి 3-0-28-0, ఇషా ఓజా 2-0-26-0, ఇందుజ 2-0-14-0.

యూఏఈ ఇన్నింగ్స్: ఇషా ఓజా (స్టంప్డ్) రిచా (బి) తనూజా 38; తీర్థ (సి) హర్మన్‌ప్రీత్ (బి) రేణుక 4; రినిత (బి) పూజ 7; సమైరా (సి) తనూజా (బి) దీప్తి 5; కవీషా (నాటౌట్) 40; ఖుషీ శర్మ (సి) స్మృతి (బి) రాధ 10; హీనా (సి) షఫాలీ (బి) దీప్తి 8; రితిక (రనౌట్) 6; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 123. వికెట్ల పతనం: 1-11, 2-24, 3-36, 4-76, 5-95, 6-107, 7-123. బౌలింగ్: రేణుక సింగ్ 4-0-30-1, తనూజా కన్వర్ 4-0-14-1, పూజా వస్త్రకర్ 4-1-27-1, దీప్తి శర్మ 4-0-23-2, రాధా యాదవ్ 4-0-29-1.

'పంచ్' పతకం తెచ్చేనా!

ఆశల పల్లకిలో భారత బాక్సర్లు
- అందరి కళ్లు నిఖత్ పైనే
- లవ్లీనా, అమిత్, నిశాంత్‌లపై కూడా దృష్టి

మరో 4 రోజుల్లో...








వందేళ్లకంటే ఎక్కువ చరిత్ర ఉన్న ఒలింపిక్స్ బాక్సింగ్ క్రీడాంశంలో భారత్ నుంచి తొలిసారి 1948 లండన్ ఒలింపిక్స్‌లో ఏకంగా ఏడుగురు బాక్సర్లు పోటీపడ్డారు. ఆ తర్వాత 1952 హెల్సింకి ఒలింపిక్స్‌లో నలుగురు భారత బాక్సర్లు బరిలోకి దిగారు. అయితే ఈ రెండు ఒలింపిక్స్‌లో మన బాక్సర్లు ఆకట్టుకోలేకపోయారు. హెల్సింకి ఒలింపిక్స్ తర్వాత మరో నాలుగు ఒలింపిక్స్ క్రీడల్లో భారత్ నుంచి ప్రాతినిధ్యం కరువైంది. మళ్లీ 1972 మ్యూనిక్ ఒలింపిక్స్‌లో భారత బాక్సర్లు పోటీపడ్డారు. అప్పటి నుంచి ప్రతి ఒలింపిక్స్‌లో భారత బాక్సర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో విజేందర్ సింగ్ (75 కేజీలు) కాంస్యం రూపంలో భారత్‌కు బాక్సింగ్‌లో తొలి పతకాన్ని అందించాడు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో మేరీకోమ్ (51 కేజీలు)... 2020 టోక్యో ఒలింపిక్స్‌లో లవ్లీనా బొర్గొహైన్ (75 కేజీలు) కాంస్య పతకాలు గెలిచారు. ఈసారి పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నుంచి ఆరుగురు బాక్సర్లు అర్హత పొందారు. పురుషుల విభాగంలో అమిత్ పంఘాల్ (51 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు)... మహిళల విభాగంలో నిఖత్ జరీన్ (50 కేజీలు), ప్రీతి పవార్ (54 కేజీలు), జైస్మిన్ లంబోరియా (57 కేజీలు), లవ్లీనా (75 కేజీలు) భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ ఆరుగురిలో అమిత్, లవ్లీనాలకు ఇవి రెండో ఒలింపిక్స్‌కాగా... నిశాంత్, నిఖత్, ప్రీతి, జైస్మిన్ తొలిసారి ఒలింపిక్స్‌లో ఆడనున్నారు. వరుసగా రెండుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన నిఖత్ జరీన్‌పైనే అందరి దృష్టి ఉంది. ఆసియా క్రీడల్లో, కామన్వెల్త్ గేమ్స్‌లో, ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకాలు నెగ్గిన నిఖత్ తొలి ప్రయత్నంలోనే ఒలింపిక్ పతకం సాధించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.





టోక్యోలో కాంస్యం నెగ్గిన లవ్లీనా ఈసారి కూడా అద్భుతం చేస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. పురుషుల విభాగంలో అమిత్ పంఘాల్, నిశాంత్ తమ స్థాయికి తగ్గట్టు ఆడితే కాంస్యాలు సాధించే చాన్స్ ఉంది. పారిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్ పోటీలు జూలై 27 నుంచి ఆగస్టు 10 వరకు జరుగుతాయి.

–సాక్షి క్రీడా విభాగం



ఆస్కార్‌కు తొలి ఎఫ్1 విజయం

బుడాపెస్ట్: మెక్‌లారెన్ జట్టు డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రి తన కెరీర్‌లో తొలిసారి ఫార్ములావన్ (ఎఫ్1) రేసులో విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన హంగేరి గ్రాండ్‌ప్రిలో 23 ఏళ్ల ఈ ఆస్ట్రేలియన్ డ్రైవర్ అగ్రస్థానాన్ని పొందాడు. కెరీర్‌లో 35వ రేసులో పోటీపడ్డ ఆస్కార్ నిర్ణీత 70 ల్యాప్‌లను అందరికంటే వేగంగా ఒక గంటా 38 నిమిషాల 01.989 సెకన్లలో పూర్తి చేసి టైటిల్ దక్కించుకున్నాడు. మెక్‌లారెన్‌కే చెందిన లాండో నోరిస్ రెండో స్థానంలో నిలిచాడు. హామిల్టన్ (మెర్సిడెస్), లెక్‌లెర్క్ (ఫెరారీ), వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) వరుసగా మూడు, నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. సీజన్‌లోని తదుపరి రేసు బెల్జియం గ్రాండ్‌ప్రి ఈనెల 28న జరుగుతుంది.



యూకీ-ఒలివెట్టి జోడీకి టైటిల్

స్టాడ్ (స్విట్జర్లాండ్): భారత అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో మూడో ఏటీపీ డబుల్స్ టైటిల్‌ను సాధించాడు. ఆదివారం ముగిసిన స్విస్ ఓపెన్ ఏటీపీ-250 టోర్నీలో యూకీ బాంబ్రీ (భారత్)-అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) ద్వయం విజేతగా నిలిచింది. 66 నిమిషాలపాటు జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో మూడో సీడ్ యూకీ-ఒలివెట్టి జంట 3-6, 6-3, 10-6తో 'సూపర్ టైబ్రేక్'లో హంబెర్ట్-మార్టిన్ (ఫ్రాన్స్) జోడీని ఓడించింది. యూకీ-ఒలివెట్టిలకు 30,610 యూరోల (రూ. 27 లక్షల 87 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 250 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

241 పరుగులతో నెగ్గిన ఇంగ్లండ్



నాటింగ్‌హమ్: వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు 241 పరుగుల ఆధిక్యంతో ఘన విజయం సాధించింది. మూడు టెస్టుల సిరీస్‌ను ఒక మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో ఇంగ్లండ్ సొంతం చేసుకుంది. నాలుగో రోజు ఇంగ్లండ్ నిర్దేశించిన 385 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్‌లో 36.1 ఓవర్లలో 143 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ 41 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి విండీస్‌ను దెబ్బ తీశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 248/3తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 92.2 ఓవర్లలో 425 పరుగులకు ఆలౌటైంది. హ్యారీ బ్రూక్ (109; 13 ఫోర్లు), జో రూట్ (122; 10 ఫోర్లు) సెంచరీలు సాధించారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

జేఎన్‌వీ సెలక్షన్ టెస్ట్-2025

దేశవ్యాప్తంగా ఉన్న 653 నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలకు జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 653.
» **తెలుగు రాష్ట్రాల్లో జేఎన్‌వీలు:** తెలంగాణ-09, ఆంధ్రప్రదేశ్-15 విద్యాలయాలున్నాయి.
» **అర్హత:** 2024-25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ ఉండాలి. 01.05.2013 నుంచి 31.07.2015 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులు.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికచేస్తారు.
» **పరీక్ష విధానం:** మొత్తం 100 మార్కులకు 80 ఆబ్జెక్టివ్ టైప్ ప్రశ్నలు ఉంటాయి. మెంటల్ ఎబిలిటీ(40 ప్రశ్నలు, 50 మార్కులు), అర్థమేటిక్(20 ప్రశ్నలు, 25 మార్కులు), లాంగ్వేజ్(20 ప్రశ్నలు, 25 మార్కులు) సబ్జెక్టులు ఉంటాయి. ఓఎంఆర్ సీట్‌లో నాలుగు ఆప్షన్స్‌లో ఒకటి సమాధానం పెన్ సాయంతో దిద్దాలి. బ్లూ/బ్లాక్ బాల్ పాయింట్ పెన్ ఉపయోగించాలి. పరీక్ష సమయం రెండు గంటలు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 16.09.2024
» **వెబ్‌సైట్:** www.navodaya.gov.in

ఐఐటీ హైదరాబాద్‌లో ఎంఎల్ ఇంజనీర్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), హైదరాబాద్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కోసం మెషిన్ లెర్నింగ్(ఎంఎల్) ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 10.
» **అర్హత:** పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్/ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్/మ్యాథమేటిక్స్/కంప్యూటింగ్/ఈసీఈ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.60,000 నుంచి రూ.90,000.
» **ఎంపిక విధానం:** ధ్రువపత్రాల పరిశీలన, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 31.07.2024.
» **వెబ్‌సైట్:** https://www.iith.ac.in

ఐహెచ్‌ఎం, హైదరాబాద్‌లో 12 ఉద్యోగాలు

హైదరాబాద్ విద్యానగర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ-అప్లైడ్ న్యూట్రిషియన్(ఐహెచ్‌ఎం)లో.. వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ లెక్చరర్ కమ్ అసిస్టెంట్ ఇన్‌స్ట్రక్టర్-05, పీఏ టు ప్రిన్సిపాల్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి కనీసం 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ(టూరిజం/హోటల్ మేనేజ్‌మెంట్/హోటల్ అడ్మినిస్ట్రేషన్ /హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్), పీజీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం, టైపింగ్‌తో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** ihmhyd.ao@gmail.com.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.ihmhyd.org

» ఐఐటీ జామ్-2025 షెడ్యూల్ విడుదల
» ఐఐటీల్లో పీజీ, ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీలో ప్రవేశాలు
» మొత్తం 21 ఐఐటీల్లో దాదాపు మూడు వేల సీట్లు
» ఐఐఎస్సీ, ఐఐఎస్ఈఆర్‌ల్లోనూ అడ్మిషన్

జామ్ స్కోర్.. పీజీ ప్రోగ్రామ్

ఐఐటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ టెక్నాలజీస్)లకు ఇంజనీరింగ్, టెక్నాలజీ విద్యాబోధనలో అంతర్జాతీయ గుర్తింపు! అందుకే ఐఐటీల్లో బీటెక్‌లో ప్రవేశం కోసం ఏటా లక్షల మంది పోటీపడుతుంటారు. కాని సీట్ల పరిమితి కారణంగా కొంతమందికే అడ్మిషన్ లభిస్తుంది. బ్యాచిలర్ స్థాయిలో నిరాశకు గురైన వారు.. పీజీ స్థాయిలో తమ ఐఐటీ కల సాకారం చేసుకోవచ్చు. అందుకు మార్గం.. జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్ (జామ్)! తాజాగా 2025-26 ప్రవేశాలకు సంబంధించి ఐఐటీ జామ్ -2025 షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. ఐఐటీ జామ్ వివరాలు, పరీక్ష విధానం, జామ్ స్కోర్‌తో ప్రవేశం లభించే కోర్సులు, ఇన్‌స్టిట్యూట్‌లు తదితర సమాచారం..

ఐఐటీలు బ్యాచిలర్ నుంచి పీజీ వరకు పలు స్థాయిల్లో ప్రవేశాలు చేపడుతున్నాయి. ఇందుకోసం నిర్వహించే ఎంట్రన్స్‌లలో జామ్ ప్రత్యేకమైన టెస్ట్. పీజీ స్థాయిలో సైన్స్ కోర్సుల్లో చేరాలనుకునే వారికి ఇది చక్కటి అవకాశంగా నిలుస్తోంది.

ఆరు కోర్సులు.. 2987 సీట్లు

ఐఐటీ జామ్ స్కోర్ ఆధారంగా దేశవ్యాప్తంగా 21 ఐఐటీ క్యాంపస్‌లలో..పీజీ స్థాయిలో ఆరు కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. అవి..ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ (టెక్నాలజీ); ఎంఎస్ (రీసెర్చ్); ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ, జాయింట్ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ;ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రామ్స్. మొత్తం 2,987సీట్లు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి. డిగ్రీలో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత లేదా 5.5 సీజీపీఏ ఉండాలి. 2025లో చివరి సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆన్‌లైన్‌లో జామ్

ఐఐటీలు, ఇతర ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎమ్మెస్సీ తదితర సైన్స్ కోర్సుల్లో ప్రవేశానికి జామ్ పరీక్షను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు.మొత్తం ఏడు పేపర్లలో పరీక్ష జరుగుతుంది. అవి.. బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, జియాలజీ, మ్యాథమెటిక్స్, మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లలో పరీక్షకు హాజరవ్వొచ్చు. ఈ విషయాన్ని దరఖాస్తు సమయంలోనే పేర్కొనాల్సి ఉంటుంది.

మూడు విభాగాల్లో జామ్

జామ్ పరీక్ష మొత్తం మూడు విభాగాల్లో జరుగుతుంది. అవి..
- సెక్షన్-ఎ: 30 మల్టిపుల్ ఛాయిస్ కొశ్చన్స్(ఎంసీక్యూ) ఉంటాయి. ఇందులో 1 మార్కు ప్రశ్నలు 10, 2 మార్కుల ప్రశ్నలు 20 అడుగుతారు.
- సెక్షన్-బి: ఈ విభాగంలో 10 మల్టిపుల్ సెలక్ట్ కొశ్చన్స్ (ఎంఎస్‌క్యూ) ఉంటాయి. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు ఉంటాయి. వీటిలో ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉంటాయి. అభ్యర్థులు అడిగిన ప్రశ్నకు సరితూగే సమాధానాలను గుర్తించాల్సి ఉంటుంది.
- సెక్షన్-సి: ఈ విభాగంలో 20 న్యూమరికల్ ఆన్సర్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 10 ప్రశ్నలకు 1 మార్కు, 10 ప్రశ్నలకు 2 మార్కులు కేటాయిస్తారు.
- ఇలా మొత్తం మూడు గంటల వ్యవధిలో వంద మార్కులకు 60 ప్రశ్నలకు పరీక్ష ఉంటుంది. నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమలవుతోంది. ప్రతి తప్పు సమాధానానికి 1/3 వంతు మార్కు కోత విధిస్తారు. ఎంఎస్‌క్యూ, ఎన్ఏటీ విభాగాల్లో ఎలాంటి నెగెటివ్ మార్కులు ఉండవు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్

ఐఐటీ జామ్ స్కోర్ ఆధారంగా ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తాయి. అభ్యర్థులు ఐఐటీల్లో సీట్ల కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం జామ్ ఆన్‌లైన్ అప్లికేషన్ ప్రాసెసింగ్ సిస్టమ్(జేఓఏపీఎస్)ను ప్రత్యేకంగా అందుబాటులోకి తెస్తారు. అభ్యర్థులు ఈ పోర్టల్‌లో తమ లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకుని.. ఆ తర్వాత ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేయాలి. ఈ దరఖాస్తు సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న కోర్సులు, ఇన్‌స్టిట్యూట్‌ల ప్రాథమ్యాలను పేర్కొనాలి. ఆ తర్వాత అభ్యర్థులు పొందిన స్కోర్, వారు పేర్కొన్న ప్రాథమ్యాలను బేరీజు వేసి ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ చేస్తారు. ఈ ప్రక్రియ మొత్తం నాలుగు రౌండ్లలో ఉంటుంది.

మరెన్నో ఇన్‌స్టిట్యూట్స్

ఐఐటీ జామ్ స్కోర్‌ను ఐఐటీలతో పాటు మరెన్నో ఇన్‌సిట్యూట్స్ కూడా పీజీ ప్రవేశాలకు ప్రామాణికంగా తీసుకుంటున్నాయి. ఎన్ఐటీలు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, ఐఐఎస్ఈఆర్(పుణె, భోపాల్), ఐఐపీఈ, జేఎన్ఎస్ఏఆర్, ఎస్ఎల్ఐఈటీ, డీఐఏటీ వంటి ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్స్‌లో కూడా ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ తదితర మాస్టర్స్ కోర్సుల్లో ప్రవేశాలు పొందొచ్చు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** 2024, సెప్టెంబర్ 3- అక్టోబర్ 11
- **జామ్ పరీక్ష తేదీ:** 2025, ఫిబ్రవరి 2
- **ఫలితాల వెల్లడి:** 2025, మార్చి 16
- **ఆన్‌లైన్ అడ్మిషన్ పోర్టల్:** 2025, ఏప్రిల్ 2 నుంచి
- **వెబ్‌సైట్:** https:// jam2025.iitd.ac.in/index.php

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

ఐఐటీలో పీజీ స్థాయిలో అడుగు పెట్టేందుకు మార్గం వేసే జామ్‌లో బెస్ట్ స్కోర్ సాధించడానికి.. అభ్యర్థులు సబ్జెక్ట్/పేపర్ వారీగా ప్రధానంగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

బయోటెక్నాలజీ

అభ్యర్థులు బయాలజీ, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్‌ను ప్రిపేరవ్వాల్సి ఉంటుంది. బయాలజీ విభాగానికి సంబంధించి పదో తరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు అకడమిక్స్‌ను అభ్యసనం చేయాలి. జనరల్ బయాలజీ, బయోకెమిస్ట్రీ అండ్ ఫిజియాలజీ, బేసిక్ బయోటెక్నాలజీ, మాలిక్యులర్ బయాలజీ, సెల్ బయాలజీ, మైక్రోబయాలజీ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. కెమిస్ట్రీకి సంబంధించి పదోతరగతి, ఇంటర్, డిగ్రీ పాఠ్యాంశాలను చదవాలి. మ్యాథ్స్, ఫిజిక్స్‌లను ఇంటర్ స్థాయిలో చదివితే సరిపోతుంది.

ఎకనామిక్స్

మైక్రో ఎకనామిక్స్, మాక్రో ఎకనామిక్స్, స్టాటిస్టిక్స్ ఫర్ ఎకనామిక్స్, ఇండియన్ ఎకానమీ, మ్యాథమెటిక్స్ ఫర్ ఎకనామిక్స్‌లను అధ్యయనం చేయాలి.

జియాలజీ

ప్లానెట్ ఎర్త్, జియో మార్ఫాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, పాలియోంటాలజీ, స్ట్రాటిగ్రఫీ, మినరాలజీ, పెట్రోలజీ, ఎకనామిక్ జియాలజీ, అప్లయిడ్ జియాలజీలపై దృష్టి పెట్టాలి.

మ్యాథమెటిక్స్

సీక్వెన్సెస్ అండ్ సిరీస్ ఆఫ్ రియల్ నంబర్స్, ఫంక్షన్స్ ఆఫ్ వన్/టూ/త్రీ రియల్ వేరియబుల్, ఇంటెగ్రల్ క్యాల్కులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ క్యాల్కులస్, గ్రూప్ థియరీ, లీనియర్ ఆల్‌జీబ్రా, రియల్ అనాలసిస్ పాఠ్యాంశాలను అధ్యయనం చేయాలి.

మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్

మ్యాథ్స్‌కు 40 శాతం, స్టాటిస్టిక్స్‌కు 60 శాతం వెయిటేజీ ఉండే ఈ పేపర్‌లో.. మ్యాథ్స్‌కు సంబంధించి సీక్వెన్సెస్ అండ్ సిరీస్, డిఫరెన్షియల్ క్యాల్కులస్, ఇంటెగ్రల్ క్యాల్కులస్, మాట్రిసెస్ చాప్టర్లను అధ్యయనం చేయాలి. స్టాటిస్టిక్స్‌లో ప్రాబబిలిటీ, ర్యాండమ్ వేరియబుల్స్, స్టాండర్డ్ డిస్ట్రిబ్యూషన్, జాయింట్ డిస్ట్రిబ్యూషన్, సాంప్లింగ్ డిస్ట్రిబ్యూషన్, లిమిట్ థీరమ్స్, ఎస్టిమేషన్, టెస్టింగ్ ఆఫ్ హైపో థీసిస్‌లను అధ్యయనం చేయాలి.

ఫిజిక్స్

మ్యాథమెటికల్ మెథడ్స్, మెకానిక్స్ అండ్ జనరల్ ప్రాపర్టీస్ ఆఫ్ మేటర్, ఆసిలేషన్స్, వేవ్స్ అండ్ ఆప్టిక్స్, ఎలక్ట్రిసిటీ అండ్ మ్యాగ్నటిజం, కైనటిక్ థియరీ, థర్మోడైనమిక్స్, మోడ్రన్ ఫిజిక్స్, సాలిడ్ స్టేట్ ఫిజిక్స్, డివైజెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ పాఠ్యాంశాలను అభ్యసనం చేయాలి.

కెమిస్ట్రీ

బేసిక్ మ్యాథమెటికల్ కాన్సెప్ట్‌లు, అటామిక్ అండ్ మాలిక్యులర్ స్ట్రక్చర్, థియరీ ఆఫ్ గ్యాసెస్, సాలిడ్ స్టేట్, కెమికల్ థర్మోడైనమిక్స్, కెమికల్ అండ్ ఫేజ్ ఈక్విలిబ్రియా, ఎలక్ట్రోకెమిస్ట్రీ, కెమికల్ కైనటిక్స్, అబ్జార్షన్,స్పెక్ట్రోమెట్రి; ఆర్గానిక్ కెమిస్ట్రీ అండ్ స్పెక్ట్రోమెట్రి బేసిక్ కాన్సెప్ట్‌లు, ఆర్గానిక్ రియాక్షన్ మెకానిజం, సింథటిక్ అప్లికేషన్స్, క్వాలిటేటివ్ ఆర్గానిక్ అనాలసిస్, ఆరోమాటిక్ అండ్ హెటిరోసైక్లిక్ కెమిస్ట్రీ. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో పిరియాడిక్ టేబుల్, కెమికల్ బాండింగ్, షేప్స్ ఆఫ్ కాంపౌండ్స్, మెయిన్ గ్రూప్ ఎలిమెంట్స్, ట్రాన్సిషన్ మెటల్స్, బయో ఇనార్గానిక్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీపై దృష్టి పెట్టాలి.

అకడమిక్స్‌పై పట్టు

జామ్‌లో బెస్ట్ స్కోర్ కోసం అభ్యర్థులు బ్యాచిలర్ స్థాయి అకడమిక్స్‌పై పట్టు సాధించాలి. అదే విధంగా జామ్ పాత ప్రశ్న పత్రాలు, గేట్ సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన పాత ప్రశ్న పత్రాలు ప్రాక్టీస్ చేయాలి.

బేసిక్ కాన్సెప్ట్స్‌పై అవగాహనతోపాటు, అప్లికేషన్ అప్రోచ్ పెంచుకోవాలి. అప్పుడే పరీక్ష హాల్లో ప్రశ్నను ఏ విధంగా అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
22-7-2024

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
739	270
80,605	24,531

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	17,727	▽	144
డోజోన్స్	40,288	▽	377
ఎఫ్‌టీఎస్ఈ 100	8,156	▽	49
డాక్స్	18,172	▽	183
షాంఘై	2,982	△	5
నికాయ్	40,046	▽	63

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	83.23	84.25
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	107.09	109.61
€	యూరో	ఒకటి	89.93	92.38
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.80	54.60
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.15	57.10
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.57	64.14
SAR	సౌదీ రియాల్	ఖాతాదారుల	21.40	22.95
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాదారుల	21.87	23.66
¥	చైనా యువాన్	ఖాతాదారుల	10.39	12.46



బడ్జెట్ 'హల్వా' మెప్పిస్తుందా?



ఒక పక్క ధరాభారం... మరోపక్క పన్నుల మోత! దేశంలో వేతన జీవుల నుండి సామాన్యుల వరకు ఈ సెగ గట్టిగానే తగులుతోంది. వికసిత భారతదేశమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్న మోదీ 3.0 సర్కారుకు ఉపాధికల్పన ఇప్పుడు చాలా కీలకంగా మారింది. పారిశ్రామికంగా దేశాన్ని పరుగులు పెట్టిస్తూనే.. ప్రజలకు ఆర్థిక ఉపశమనం కల్పించాల్సిన అవసరం కూడా నెలకొంది. ఈ నేపథ్యంలో రికార్డు స్థాయిలో వరుసగా ఏడో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వైపు అన్ని వర్గాలూ ఆశగా ఎదురుచూస్తున్నాయి. మరి సీతమ్మ బడ్జెట్ 'హల్వా' అందరినీ మెప్పిస్తుందా? వివిధ రంగాలు, పరిశ్రమ వర్గాల అంచనాలు సాకారమవుతాయా? మధ్యతరగతి ఆశలు నెరవేరుతాయా? అనేది మరికొద్ది గంటల్లో తేలిపోనుంది.

– సాక్షి, బిజినెస్ డెస్క్

మోదీ 3.0 తొలి బడ్జెట్‌పై ఎన్నో అంచనాలు

- పన్నుల భారం తడిసిమోపెడు..
- తగ్గింపునకు డిమాండ్లు
- ఈ దిశగా ప్రకటనలకు వీలు..
- తయారీ, మౌలికానికి ప్రాధాన్యం
- గృహ రుణాలపై ప్రోత్సాహకాలు
- బీమాపైనా ఇవే ఆశలు
- చరిత్రాత్మక నిర్ణయాలు అంటూ రాష్ట్రపతి సంకేతం

భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా అవతరించాలి'.. కేంద్రంలోని మోదీ సర్కారు దీర్ఘకాలిక లక్ష్యం ఇది. అమెరికా, యూరప్, చైనా ఆర్థికవ్యవస్థలు ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్న తరుణంలోనూ భారత్ ప్రపంచంలోనే వేగవంతమైన వృద్ధి (7% పైనే)తో సాగిపోతోంది. ప్రస్తుతం ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న దేశం అమెరికా, చైనా తర్వాత మూడో స్థానానికి చేరుకుంటుందని అంచనా. ఈ స్వప్నం సాకారం కావాలంటే ఉపాధి అవకాశాల కల్పన, పరిశ్రమల ఏర్పాటు, మౌలిక వసతులకు పెద్ద ఎత్తున ప్రోత్సాహం అవసరం. పన్నుల ఉపశమనం కల్పించాలన్న డిమాండ్లు ఉండనే ఉన్నాయి. రానున్న బడ్జెట్‌లో చరిత్రాత్మక, ముఖ్యమైన ఆర్థిక నిర్ణయాలు ఉంటాయంటూ పార్లమెంటు ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇప్పటికే సంకేతం పంపారు. దీంతో ఈ నెల 23న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించే 2023–24 పూర్తి స్థాయి బడ్జెట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పన్నుల భారం తగ్గించరూ..

ప్రస్తుత పరిస్థితి: ఆదాయపన్ను, జీఎస్‌టీ తదితరాల రూపంలో ప్రజలపై ప్రత్యక్ష, పరోక్ష పన్నుల బాదుడు గడిచిన పదేళ్లలో గణనీయంగా పెరిగిపోయింది. ఇది ఏ స్థాయిలో అంటే.. 2023–24లో కేంద్ర సర్కారు రూ.34.6 లక్షల కోట్ల భారీ మొత్తాన్ని ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపంలో సమకూర్చుకుంది. ఒక వస్తువు చేతులు మారుతున్న ప్రతి దశలోనూ పన్ను పరిధిలోకి వెళుతోంది. ఉదాహరణకు డీజిల్, పెట్రోల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్సైజ్, వ్యాట్ ట్యాక్స్ విధిస్తుంటాయి. వాహనం వాడే ప్రతి ఒక్కరూ ఇంధనం కొనుగోలుపై పన్ను చెల్లిస్తున్నట్టే. వస్తు రవాణాకు వినియోగించే లారీలు, ట్రక్కులు, రైల్వే డీజిల్, విద్యుత్‌ను ఇంధనంగా వినియోగిస్తుంటాయి. ఆ దశలో అవి డీజిల్, విద్యుత్‌పై పన్ను చెల్లిస్తుంటాయి. ఆ చార్జీల భారం వస్తువులపై పడి, చివరికి వినియోగదారుడు తన వంతు కూడా చెల్లించాల్సి వస్తోంది. ఒక కంపెనీ తన లాభం నుంచి 25 శాతం పన్ను చెల్లించాలి. ఆ తర్వాతే డివిడెండ్ పంపిణీ చేస్తుంది. ఈ డివిడెండ్ అందుకున్న వారు దానిపై తమ ఆదాయ స్థాయికి అనుగుణంగా పన్ను చెల్లించాలి. అంటే రెండు దశల్లో డివిడెండ్‌పై పన్ను పడినట్టు అవుతోంది. ఇలా ప్రత్యక్షం కంటే, పరోక్ష పన్నుల భారం ప్రజలపై బాగా పెరిగిపోయింది.



అంచనాలు: పాత పన్ను విధానం నుంచి ప్రజలను క్రమంగా కొత్త విధానంలోకి తీసుకురావాలన్నది కేంద్రం ఆశయం. పాత విధానంలో పీపీఎఫ్, ఫిక్స్‌డ్ డిపాజిట్, చిన్న మొత్తాల పొదుపు పథకాలు, పిల్లల స్కూల్ ట్యూషన్ ఫీజులు, ఈఎల్ఎస్ఎస్, జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియం, గృహ రుణం చెల్లింపులపై గణనీయమైన పన్ను ప్రయోజనాలున్నాయి. అందరూ వీటిని వినియోగించుకోలేరు. కనుక అందరికీ ఉపయోగపడే విధంగా, పారదర్శకంగా ఉండేందుకు మినహాయింపుల్లేని కొత్త పన్ను విధానాన్నే అంతిమంగా అమలు చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉంది. అందుకని నూతన పన్ను విధానంలోకి మళ్లే దిశగా పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించేందుకు ప్రాథమిక పన్ను మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు చేయవచ్చని అంచనాలున్నాయి. పరిశ్రమ భాగస్వాములు కూడా ఆర్థిక మంత్రిని ఇదే కోరాయి. స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50వేల నుంచి రూ. లక్షకు పెంచొచ్చన్న అంచనాలున్నాయి. పాత పన్ను విధానంలో రూ.2.5 లక్షల ప్రాథమిక పన్ను మినహాయింపు పదేళ్ల నుంచి అదే స్థాయిలో కొనసాగుతోంది. దీన్ని పెంచాలన్న డిమాండ్లు ఉన్నాయి. కానీ, పాత పన్ను విధానాన్ని నిరుత్సాహపరిచేందుకు అందులో ఎలాంటి మార్పులు చేయకపోవచ్చని భావిస్తున్నారు. పన్ను మినహాయింపులను పెంచడం వల్ల ప్రజల చేతుల్లో ఖర్చు చేసే ఆదాయం పెరిగి, అది వినియోగంలోకి వస్తుందని.. అంతిమంగా దేశ వృద్ధికి దోహదం చేస్తుందని నిపుణులు అంటున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో సాధించిన 8.2 శాతం వృద్ధి రేటు ఇక మీదటా గరిష్టాల్లో నిలదొక్కుకునేందుకు ఈ తరహా చర్యలు అవసరమన్న వాదన వినిపిస్తోంది.

దీర్ఘకాల మూలధన ఆస్తుల నిర్వచనం మారుతుందా?

దీర్ఘకాల మూలధన ఆస్తుల నిర్వచనం మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈక్విటీ పెట్టుబడులు ఏడాదిలోపు విక్రయించినట్టయితే స్వల్పకాల, ఏడాది ముగిసిన తర్వాత విక్రయించినట్టయితే దీర్ఘకాల మూలధన ఆస్తులుగా ఆదాయ పన్ను చట్టం పరిగణిస్తోంది. స్వల్పకాల మూలధన లాభాలపై 15 శాతం పన్ను, దీర్ఘకాల మూలధన లాభం రూ.మొదటి లక్ష తర్వాత మొత్తంపై 10 శాతం పన్ను అమలవుతోంది. అదే రియల్ ఎస్టేట్‌ను 24 నెలలు నిండినప్పుడే దీర్ఘకాల మూలధన ఆస్తిగా చూస్తున్నారు. వివిధ సాధనాల మధ్య గందరగోళం లేకుండా ఏకరూపత తీసుకురావచ్చన్న అంచనాలున్నాయి. అంటే ఈక్విటీల్లో దీర్ఘకాల మూలధన ఆస్తుల కాలాన్ని రెండేళ్లకు పెంచడం లేదంటే రియల్ ఎస్టేట్ సాధనానికి రెండేళ్లకు బదులు ఏడాది కాలాన్ని దీర్ఘకాల ఆస్తిగా నిర్ణయించొచ్చని భావిస్తున్నారు. రియల్ ఎస్టేట్ పెట్టుబడులకు ఏడాదికే దీర్ఘకాల మూలధన లాభాల పన్ను ప్రయోజనాలు కల్పిస్తే మార్కెట్లోకి ఎక్కువ ప్రాపర్టీలు విక్రయానికి వచ్చి, రేట్ల పెరుగుదల ఒత్తిడి తగ్గుతుందనే అంచనాలు సైతం ఉన్నాయి. ఒకవేళ ఈక్విటీ పెట్టుబడులకు రెండేళ్లకు పెంచితే అది కొంత నిరుత్సాహపరిచే అవకాశం లేకపోలేదు. ఈక్విటీల్లో దీర్ఘకాల మూలధన లాభం మొదటి రూ.లక్షకు పన్ను ఉపశమనం ఉండగా, దీన్ని రూ.2 లక్షలు చేయాలని మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) ఆర్థిక మంత్రిని కోరింది.

బీమాపై డిమాండ్లు ఇవీ..



ఇక జీవిత బీమా, ఆరోగ్య బీమాపై జీఎస్‌టీ భారం తగ్గించాలన్న బలమైన డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. వీటిపై 18 శాతం జీఎస్‌టీ అమలవుతోంది. దేశంలో ప్రతి ఒక్కరికీ బీమాను చేరువ చేసేందుకు పన్ను రేటును 5 శాతానికి తగ్గించాలని పరిశ్రమ కోరుతోంది. ఆరోగ్యం, వైద్యం కోసం చేసే ఖర్చులు గణనీయంగా పెరిగిపోయినప్పటికీ సెక్షన్ 80డీ కింద హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలకు కల్పిస్తున్న వెసులుబాటులో (60ఏళ్లలోపు ఉంటే రూ.25 వేలు, 60 ఏళ్లు నిండిన వారికి రూ.50 వేలు) గత తొమ్మిదేళ్లుగా ఎలాంటి మార్పులు లేకపోవడాన్ని ఆర్థిక మంత్రి దృష్టికి పరిశ్రమ తీసుకెళ్లింది. ద్రవ్యోల్బణానికి ముడిపెట్టి, ఈ సెక్షన్ కింద హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై పన్ను మినహాయింపు ఏటా ఆటోమేటిక్‌గా పెరిగే విధంగా ఉంటే బావుంటుందని తెలిపింది. ఇంటి అద్దెలు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ) మినహాయింపును పెంచాలన్న డిమాండ్ ఉంది. భారీ పన్ను వసూళ్ల అంచనాల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకునేందుకు బడ్జెట్‌కు వెసులుబాటు ఉంటుందన్నది విశ్లేషణ.

వ్యవసాయం- గ్రామీణం



ప్రస్తుత పరిస్థితి: రైతుల ఆదాయాన్ని, వారి ఆర్థిక స్థితిగతులు పెంచేందుకు కృషి చేస్తామంటున్న మోదీ సర్కారు.. ఈ రంగానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు చేయడం లేదు. 2023–24 బడ్జెట్‌లో సాగు రంగానికి రూ.1.25 లక్షల కోట్లు కేటాయించారు. దీంతో పోల్చితే కేవలం 0.6 శాతం పెంచి 2024–25 మధ్యంతర బడ్జెట్‌లో రూ.1.27 లక్షల కోట్లు కేటాయించారు. గ్రామీణాభివృద్ధి కేటాయింపులు మాత్రం 4.2 శాతం పెంచి 1.80 లక్షల కోట్లు చూపించారు.

అంచనాలు: పంట నష్టాన్ని తగ్గించి, మెరుగైన రేటు వచ్చే దిశగా బడ్జెట్‌లో చర్యలు ప్రకటిస్తారన్న ఆశలు రైతన్నల్లో నెలకొన్నాయి. దేశవ్యాప్తంగా రైతులు అందరికీ నానో డీఏపీ ఎరువులను అందుబాటులోకి తీసుకురావడం, పంట ఉత్పత్తి అనంతరం నిల్వ, సరఫరా వ్యవస్థ, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తామని మధ్యంతర బడ్జెట్‌లో చేసిన ప్రకటనలు ఈ రంగానికి బలాన్నిచ్చేవే. ఇవి కాకుండా పూర్తి స్థాయి బడ్జెట్లో అదనపు చర్యలు ఏమి ప్రకటిస్తారో చూడాలి. ముఖ్యంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు పెంచాలన్న డిమాండ్‌ను పరిశీలించవచ్చు.


ఉపాధి



ప్రస్తుత పరిస్థితి: తలసరి ఆదాయాన్ని పెంచడం ముందున్న ప్రధాన సవాళ్లలో ఒకటి. ప్రపంచంలో టాప్–10 ఆర్థిక వ్యవస్థల్లో జీడీపీ పరిమాణం పరంగా 3,942 బిలియన్ డాలర్లతో (2024 జూలై 1 నాటికి ఐఎంఎఫ్ డేటా) భారత్ ఐదో స్థానంలో ఉంది. కానీ, తలసరి ఆదాయం 2730 డాలర్లతో (రూ.2.27 లక్షలు) టాప్–10లో చివరి స్థానంలో ఉంది. 2014 నుంచి చూస్తే తలసరి ఆదాయం రెట్టింపైనప్పటికీ.. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలంటే ఇది గణనీయంగా మెరుగుపడాల్సి ఉంది. దీనికి ప్రభుత్వం వద్దనున్న ఏకైక అస్త్రం ఉపాధి కల్పన. సేవల రంగంపై ఆధారపడిన ఎకానమీని తయారీ వైపు మళ్లించడం ద్వారా ఉపాధి కల్పనను సాధించాలన్నది లక్ష్యం.

అంచనాలు: ఉత్పత్తి అనుసంధాన ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) కింద వివిధ రంగాల్లో కొత్తగా తయారీ కేంద్రాల ఏర్పాటు, అదనపు ఉత్పాదకతపై ప్రోత్సాహకాలు అందిస్తోంది. దిగుమతులను తగ్గించి, దేశీయంగా ఆయా ఉత్పత్తుల స్వావలంబన సాధించేందుకు (ఆత్మనిర్భర్ భారత్), ప్రపంచానికి తయారీ కేంద్రంగా చేయాలన్న (మేక్ ఇన్ ఇండియా) లక్ష్యాలు ఇందులో అంతర్లీనంగా ఉన్నాయి. దీంతో దేశీ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లో పోటీపడగలవని కేంద్రం భావిస్తోంది. ఆయా దిశల్లో తాజా బడ్జెట్ నిర్ణయాలు ఉంటాయని భావిస్తున్నారు.

మౌలికం



ప్రస్తుత పరిస్థితి: దేశం పారిశ్రామికంగా మరింత పురోగతి చెందాలంటే, అందుకు మెరుగైన వసతులు అవసరం. అప్పుడే పెట్టుబడిదారులు ముందుకు వస్తారు. కేంద్రంలోని మోదీ సర్కారు రహదారులు, రైల్వే, జలమార్గాలకు ప్రాధాన్యాన్ని పెంచింది. రైల్వే వసతుల ఆధునికీకరణపై పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోంది.

అంచనాలు: 2023–24లో రైల్వేలకు రూ.2.41 లక్షల కోట్లు చేయగా, ఈ విడత రూ.2.9–3 లక్షల కోట్లకు పెంచొచ్చని భావిస్తున్నారు. అంతేకాదు రహదారుల నిర్మాణానికీ కేటాయింపులు పెరుగుతాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2014 నాటికి జాతీయ రహదారుల నిడివి 91,287 కిలోమీటర్లు ఉండగా, 2023 డిసెంబర్ నాటికి 1,46,145 కిలోమీటర్లకు పెరిగింది. ఏటా 4,000 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం ఉండగా, దాన్ని, 12వేల కిలోమీటర్లకు విస్తరించారు. జీడీపీలో మూలధన కేటాయింపులను 3.5 శాతానికి పెంచొచ్చని ప్రముఖ బ్రోకరేజీ సంస్థ నోమురా అంచనా వేస్తోంది. ఎకానమీ పురోగతికి మౌలిక రంగం కీలకమని భావిస్తున్న కేంద్రం ఈ విషయంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి అన్ని చర్యలు తీసుకుంటోంది. బడ్జెట్‌లోనూ ఈ మేరకు నిర్ణయాలు ఉండవచ్చని అంచనా.

హెల్త్‌కేర్



ప్రస్తుత పరిస్థితి: దేశ ఉత్పాదకత పెరిగేందుకు ఆరోగ్యకర సమాజం ఎంతో అవసరం. 2023–24 బడ్జెట్‌లో ఆరోగ్యం కుటుంబ సంక్షేమ శాఖకు చేసిన కేటాయింపులు రూ.80,517 కోట్లు. మొత్తం బడ్జెట్‌లో 2 శాతంలోపే. 2024–25 మధ్యంతర బడ్జెట్‌లో 13 శాతం పెంచి రూ.90,658 కోట్లు చూపించారు. ఈ నిధులు మరింత పెరగాల్సిన అవసరం ఉంది. నూతన ఔషధాల ఆవిష్కరణపై చేసే ఖర్చుకు, డయాగ్నోస్టిక్స్‌పైన జీఎస్‌టీ మినహాయించాలని, పీఎల్ఐ కింద ఈ రంగానికి ప్రోత్సాహకాలు పెంచాలని పరిశ్రమ కోరుతోంది. 9–14 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖద్వారా కేన్సర్ నుంచి నివారణకు టీకా ఇవ్వడాన్ని సార్వత్రిక టీకా కార్యక్రమం పరిధిలోకి తేవాలన్న డిమాండ్ ఉంది.

అంచనాలు: కేన్సర్, జీవనశైలి వ్యాధుల నివారణకు వీలుగా ప్రజారోగ్యంపై మరింత పెట్టుబడులు అవసరమన్న సూచనలను బడ్జెట్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని మరింత మందికి చేరువ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు బలంగా ఉన్నాయి. వైద్య ఉపకరణాల దిగుమతులపై ప్రపంచంలోనే అత్యధికంగా కస్టమ్స్ డ్యూటీలు మన దేశంలో ఉన్నాయని, వీటిని తగ్గించాలన్న పరిశ్రమ డిమాండ్‌ను పరిశీలించవచ్చు.

మారిన ప్రభుత్వ ప్రాధాన్యతలు (కేటాయింపులు రూ. కోట్లలో)

	2021-22	2022-23	2023-24
రక్షణ	5,00681	5,73,098	6,23,889
రహదారులు, రవాణా	1,23,551	2,17,089	2,76,351
రైల్వేలు	1,35,242	1,62,410	2,43,272
ఆహార, పౌర సరఫరా	3,06,571	2,83,954	2,22,234
కెమికల్స్, ఫెర్టిలైజర్స్	1,54,789	2,53,563	1,92,218
గ్రామీణాభివృద్ధి	1,61,643	1,77,840	1,72,968
వ్యవసాయం	1,22,836	1,08,277	1,26,666
కమ్యూనికేషన్లు	51,545	1,40,976	1,22,749
విద్య	80,352	97,196	1,29,718
జల్‌శక్తి	84,470	71,618	96,550
కుటుంబ సంక్షేమం	84,470	75,731	80,518
గృహ, పట్టణాభివృద్ధి	1,06,840	77310	69,271

మోదీ సర్కారు రహదారులు, రైల్వేలు, జల్‌శక్తి, కమ్యూనికేషన్లకు పెద్ద పీట వేస్తున్నట్టు గత నాలుగు బడ్జెట్ కేటాయింపులు పరిశీలిస్తే తెలుస్తోంది. విద్య, వైద్యానికీ కేటాయింపులు పెంచినప్పటికీ రహదారులు, రైల్వేల స్థాయిలో లేకపోవడాన్ని గమనించొచ్చు. ముఖ్యంగా దేశ రక్షణ కోసమే పెద్ద మొత్తంలో కేటాయింపులు చేస్తున్నట్టు ఈ పట్టికను పరిశీలిస్తే తెలుస్తుంది.

విద్యారంగం



విద్యారంగానికి 2023–24 బడ్జెట్‌తో పోలిస్తే 7% తక్కువగా రూ.1.2 లక్షల కోట్లనే 2024–25 మధ్యంతర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి కేటాయించారు. పూర్తిస్థాయి బడ్జెట్‌లో అయినా దీన్ని సరిదిద్దుతారేమో చూడాలి. విద్యా సేవలు, టెస్ట్ ప్రిపరేషన్, నైపుణ్య కోర్సులపై 18% జీఎస్‌టీ చాలా ఎక్కువన్న అభ్యంతరం ఉంది. నాణ్యమైన విద్యను అందుబాటు వ్యయాలకే అందించే దిశగా తగినన్ని పెట్టుబడులతోపాటు స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సాయం, సులభంగా విద్యా రుణాలు లభించేలా చర్యలు తీసుకోవాలని విద్యా సంస్థలు, ఎడ్‌టెక్ కంపెనీలు డిమాండ్ చేస్తున్నాయి. విద్యా రుణాలు సులభం కావాలన్నది డిమాండ్.

ఎంఎస్ఎంఈలు



దేశంలో ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ పరిశ్రమ కేంద్రం నుంచి మరింత సాయాన్ని ఆశిస్తోంది. తక్కువ వడ్డీపై రుణ సాయానికి తోడు, సులభతర రుణాలు, ఆవిష్కరణలకు ప్రోత్సాహం, మౌలిక వసతుల కల్పన, సానుకూల పన్ను విధానం, వ్యాపార సులభతర నిర్వహణకు వీలుగా నిబంధనల అమల్లో వెసులుబాటు తదితర రూపాల్లో సహకారాన్ని కోరుతోంది. ప్రతి జిల్లా స్థాయిలో ఆర్థిక కేంద్రాలు ఏర్పాటు చేసి, వసతులు కల్పించడం, నైపుణ్యాభివృద్ధి కల్పనతో మరింత మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నాయి. ఎస్ఎంఈలకు 45 రోజుల్లోగా చెల్లింపులు జరిగేలా చట్టంలో మార్పులు తీసుకురావాలని పరిశ్రమ కోరుతోంది.

హౌసింగ్



అందుబాటు ధరల ఇళ్లు, పర్యావరణ అనుకూల ఇళ్ల ప్రాజెక్టులు చేపట్టేందుకు వీలుగా డెవలపర్లకు ప్రోత్సాహకాలు కల్పించాలని రియల్టీ కోరుతోంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం విజయవంతమైన నేపథ్యంలో.. మరింత మందికి లబ్ధి చేకూరేందుకు ఈ పథకాన్ని 2.0 రూపంలో తీసుకురావాలని డిమాండ్ చేస్తోంది. అందరికీ ఇళ్ల లక్ష్యం సాకారం దిశగా బడ్జెట్‌లో చర్యలు ఉంటాయన్న అంచనాలు పెరిగాయి. గృహ రుణాలపై రూ. 5 లక్షల వరకు వడ్డీ చెల్లింపులకు పన్ను మినహాయింపు కల్పించాలని పరిశ్రమ ఇప్పటికే కేంద్ర ఆర్థిక మంత్రిని కోరింది. ఈ రంగానికి పరిశ్రమ హోదా కల్పించాలన్న డిమాండూ ఉంది.

పర్యావరణ ఇంధనాలు



శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తులపైనే ఎక్కువగా ఆధారపడగా, సోలార్, విండ్, గ్రీన్ హైడ్రోజన్ తదితర పర్యావరణ అనుకూల ఇంధనాలను కేంద్రం ప్రోత్సహిస్తోంది. 2070 నాటికి సున్నా కర్బన ఉద్గారాల విడుదల లక్ష్యాన్ని చేరుకోవాలంటే పునరుత్పాదక ఇంధన వనరులపై పెట్టుబడులకు ప్రోత్సాహం ఉండాలని, శుద్ధ ఇంధన వనరులకు మళ్లేందుకు, ఈ దిశగా పరిశోధన, అభివృద్ధికి తగినంత ప్రోత్సాహం అందించాలన్న డిమాండ్లు ఉన్నాయి. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ప్రజల్లో ఆసక్తి పెరుగుతున్న దశలో ఫేమ్ పథకం ద్వారా సబ్సిడీలు తొలగించడం సరికాదని పరిశ్రమ భావిస్తోంది.

బ్యాంకింగ్



బ్యాంకింగ్ ఎకానమీ పురోగతిలో కీలకమని కేంద్రం భావిస్తోంది. ఈ రంగంలో సంస్కరణలకు వీలుగా బ్యాంకింగ్ రెగ్యులేషన్ యాక్ట్ 1949, ఇతర చట్టాలకు సవరణలను బడ్జెట్‌లో ప్రతిపాదించొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. ప్రభుత్వరంగ బ్యాంక్‌లను ప్రైవేటీకరించాలంటే బ్యాంకింగ్ కంపెనీల చట్టం 1970, బ్యాంకింగ్ కంపెనీల చట్టం 1980లకు సవరణలు తప్పనిసరి. ఈ రెండు చట్టాలు బ్యాంకుల జాతీయకరణ సమయంలో తెచ్చినవి. వీటిల్లో సవరణలతో ప్రభుత్వరంగ బ్యాంక్‌ల ప్రైవేటీకరణకు, ప్రభుత్వ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటా 51 శాతం లోపునకు తగ్గించుకునేందుకు వీలు లభిస్తుంది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
బడ్జెట్, క్యూ1 ఫలితాలపై దృష్టి | హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం డౌన్

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

22-7-2024	
విశాఖ	550–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	520–00
విజయవాడ	530–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	520–00
వరంగల్	522–00
రిటైల్ ధర	5.80

స్టాక్స్ వ్యూ

టీసీఐ ఎక్స్‌ప్రెస్ | బ్రోకరేజ్: ప్రభుదాస్ లీలాధర్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 1,169   టార్గెట్: రూ. 1,410

ఎందుకంటే: లాజిస్టిక్స్ కంపెనీ టీసీఐ ఎక్స్‌ప్రెస్‌కు పుణేలోగల వస్తువుల క్రమబద్ధీకరించే(సార్టింగ్) సెంటర్‌ను ఇటీవలే సందర్శించాం. 1.5 లక్షల చదరపు అడుగులలో ఏర్పాటైన పూర్తి ఆటోమేటెడ్ కేంద్రమిది. సుమారు 50 లోడింగ్ డాక్స్(వాహనాలు)కు వీలుంది. ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) ద్వితీయార్థం(అక్టోబర్–మార్చి) నుంచి బీటూబీ పరిమాణం పుంజుకోనున్నట్లు యాజమాన్యం భావిస్తోంది. వార్షికంగా 12–15 శాతం వృద్ధిని ఊహిస్తోంది. ఇందుకు ప్రధానంగా దక్షిణాది మార్కెట్ల నుంచి టెక్స్‌టైల్స్ లగేజీ(లోడ్) పెరగనున్నట్లు అంచనా. శ్రామికులపై ఆధారపడటాన్ని తగ్గించుకునే బాటలో యాజమాన్యం ఆటోమేషన్‌పై గురిపెట్టింది. వీటితోపాటు ట్రక్‌ల కూలింగ్ టైమ్‌ను వేగవంతం చేయడంలో నిలకడ, ట్రక్కుల టర్న్అరౌండ్(టెర్మినల్‌లో గడిపే) సమయాన్ని(టీఏటీ) తగ్గించడం వంటి అంశాలకూ ప్రాధాన్యత ఇవ్వనుంది. దీంతో గతంలో ఒక్కో ట్రక్కుకోసం వినియోగించే 5–6గురు శ్రామికుల స్థానే ఇద్దరితోనే ప్యాకేజీల లోడింగ్, అన్‌లోడింగ్ కార్యకలాపాలకు అవకాశం ఏర్పడింది. పుణే సార్టింగ్ సెంటర్ ఆటోమేషన్ తదుపరి శ్రామిక వ్యయాలు 30 శాతం దిగివచ్చాయి. అంతేకాకుండా ఒక్కో ట్రక్కు లోడింగ్, అన్‌లోడింగ్ సమయం సైతం 6–7 గంటల నుంచి భారీగా తగ్గి గంటకు పరిమితమవుతోంది. వెరసి ఒక్కో ట్రక్ మొత్తం టర్న్అరౌండ్ సమయం 5 గంటలకు చేరింది. పుణే సెంటర్ 60 కేజీల హ్యాండ్లింగ్ సామర్థ్యాన్ని కలిగి ఉంది. అయితే లగేజీ పరిరక్షణకు అధిక ప్రాధాన్యమిస్తూ 50 కేజీలకుపైనగల పార్శిళ్లను మ్యాన్యువల్‌గా హ్యాండిల్ చేస్తోంది. వీటి వాటా 5–10 శాతమేకాగా.. జీపీఎస్ ద్వారా ట్రక్కుల రియల్ టైమ్ ట్రాకింగ్‌కు వీలు కల్పిస్తోంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

వీఐపీ ఇండస్ట్రీస్ | బ్రోకరేజ్: సునిధి సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 464   టార్గెట్: రూ. 672

ఎందుకంటే: లగేజీ, బ్యాక్‌ప్యాక్, ప్రయాణ అనుబంధ వస్తువుల తయారీ దిగ్గజం వీఐపీ ఇండస్ట్రీస్ దేశీయంగా అతిపెద్ద కంపెనీ. అంతేకాకుండా గ్లోబల్ స్థాయిలోనూ లగేజీ తయారీకి రెండో పెద్ద కంపెనీగా నిలుస్తోంది. గత కొన్నేళ్లుగా బిజినెస్, లీజర్ ప్రయాణాలు జోరందుకున్న నేపథ్యంలో కంపెనీకి లబ్ధి చేకూరుతోంది. విమాన ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటం, పలు ప్రీమియం ట్రయిన్లు ప్రవేశిస్తుండటానికితోడు.. ఎస్‌యూవీలు, ప్యాసింజర్ వాహనాల భారీ విక్రయాలు లీజర్ పరిశ్రమ పుంజుకునేందుకు ప్రభావం చూపుతున్నాయి. అంతేకాకుండా బలపడుతున్న మధ్యతరం(జెన్ఎక్స్) కుటుంబాల ఆకాంక్షలు, వ్యక్తిగత ప్రాధాన్యతలు మారుతుండటం వంటి అంశాలు మధ్యకాలం నుంచి దీర్ఘకాలంలో 10 శాతం స్థాయిలో వార్షిక డిమాండుకు కారణంకానున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) కంపెనీకి ట్రాన్స్‌ఫార్మేషనల్(పరివర్తన) ఏడాదిగా నిలవనున్నట్లు యాజమాన్యం భావిస్తోంది. గతేడాది(2023–24)లో చేపట్టిన వ్యవస్థీకృత మార్పుల ప్రభావంతో బ్రాండ్ పొజిషనింగ్, మార్కెటింగ్ ఇన్నొవేషన్స్ ఇందుకు సహకరించనున్నట్లు కంపెనీ పేర్కొంటోంది. కఠిన వర్కింగ్ క్యాపిటల్ నిర్వహణ, స్టాక్‌ను భద్రపరిచే, నిర్వహించే యూనిట్ల(ఎస్‌కేయూ)ల క్రమబద్ధీకరణ కంపెనీ విజయంలో కీలకపాత్ర పోషించనున్నాయి. గత కొన్నేళ్లుగా కోల్పోయిన మార్కెట్ లీడర్‌షిప్‌ను తిరిగి పొందే సన్నాహాల్లో భాగంగా కంపెనీ మధ్యస్థాయి యాజమాన్య నిర్వహణ సిబ్బందిలో మార్పులు చేపట్టింది. పారితోషిక(రివార్డ్) ఆధారిత మార్కెటింగ్ తదితర వ్యూహాలను అమలు చేస్తోంది. ఓవైపు ట్రావెల్ రంగం జోరు, మరోపక్క పటిష్ట బ్రాండింగ్, మార్కెటింగ్‌ల నేపథ్యంలో కంపెనీ వార్షికంగా కనీసం 10% వృద్ధిని సాధించే వీలుంది.





దామెర గ్రామంలో పాఠశాలకు రాని పిల్లలను బైక్‌పై తీసుకొస్తున్న టీచర్ గురిజ మహేశ్

స్కూలుకు డుమ్మా కొడితే.. మాస్టారే ఇంటికొస్తారు!

చదువు గొప్పతనాన్ని వివరించి.. నచ్చజెప్పి పాఠశాలకు తీసుకెళ్తారు..

- ఆదర్శంగా నిలుస్తున్న నల్లగొండ ఉపాధ్యాయుడు..
- విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు కృషి

నాంపల్లి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ఆ ఉపాధ్యాయుడి లక్ష్యం.. బడీడు పిల్లలను స్కూల్‌లో చేర్పించడమే కాదు.. విద్యార్థులు కావాలని డుమ్మా కొడితే.. వారు ఎక్కడున్నా వెళ్లి తీసుకొస్తారు. ఇంటికి.. అవసరమైతే వ్యవసాయ బావులు, పొలాల వద్దకైనా వెళ్లి తల్లిదండ్రులు, పిల్లలకు చదువు ప్రాముఖ్యతను వివరించి నచ్చజెప్పి తన బైక్‌పై స్కూల్‌కు తీసుకొస్తుంటారు. 13 ఏళ్లుగా ఇలా విద్యార్థులపై ప్రత్యేక దృష్టిపెట్టి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు నల్ల గొండ జిల్లా నాంపల్లి మండలంలోని దామెర ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గురిజ మహేశ్.

ఏ పాఠశాలలో పనిచేసినా..

నల్లగొండ జిల్లా చండూరు మండల కేంద్రానికి చెందిన మహేశ్ 2009 మే నెలలో డీఎస్సీ పరీక్ష రాసి టీచర్‌గా ఎంపికయ్యారు. 2010 నవంబర్‌లో కనగల్ మండలంలోని రెగట్టే ప్రాథమికపాఠశాలలో మొదటి పోస్టింగ్ వచ్చింది. చెరుకుపల్లి, చామలపల్లి, జాన్‌తండా, దామెర, నెవిళ్లగూడెంలోని ప్రాథ మిక పాఠశాల్లో పని చేసిన ఆయన 2023లో దామెర ప్రాథమికోన్నత పాఠ శాలకు డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆయన ఏ పాఠశాలలో పని చేసినా బడిని బలోపేతం చేయడంపైనే ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. ఏయే తరగతుల విద్యార్థులు రాలేదో గుర్తించి మొదట ఆయా క్లాస్‌ల లీడర్లను పంపించి వారిని రప్పిస్తుంటారు. అలా కూడా రానిపక్షంలో మహేశ్ స్వయంగా పిల్లల ఇళ్లకు వెళ్తారు. పిల్లలతో పాటు వారి తల్లిదండ్రులకు నచ్చజెప్పి తనబైక్‌పైనే స్కూల్‌కు తీసుకొస్తారు. తాను పనిచేసే స్కూళ్ల అభివృద్ధికి స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఆర్ఐల సహకారంతో నిధులు సమకూరుస్తుంటారు. పిల్లలది తెలిసీ తెలియని వయస్సు కాబట్టి వారికి నచ్చజెప్పి స్కూళ్లకు రోజూరావడం అలవాటుగా చేయాలనేదే తన ప్రధాన కర్తవ్యమని మహేశ్ చెప్పారు.



మహా శాకంబరీదేవిగా శ్రీభద్రకాళి

శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఆషాఢ శుద్ధ పౌర్ణమి ఆదివారం నాడు వరంగల్‌లోని శ్రీభద్రకాళి అమ్మవారు మహా శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం నుంచి వర్షం జోరుగా కురుస్తున్నప్పటికీ లెక్కచేయకుండా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో అమ్మవారికి మిత్రాక్రమంలో పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ ఈవో శేషుభారతి, సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

– హన్మకొండ కల్చరల్

పోరాట జ్వాలలు రగిల్చిన యోధుడు దాశరథి: సీఎం

సాక్షి, న్యూఢిల్లీ: 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అంటూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట జ్వాలలు రగిల్చిన యోధుడు దాశరథి కృష్ణమాచార్యులు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొనియాడారు. కవి దాశరథి కృష్ణమాచార్య శత జయంతి సందర్భంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయన సేవలను స్మరించుకున్నారు. తెలుగు, ఉర్దూ, సంస్కృత, ఆంగ్ల భాషల్లో పండితుడైన దాశరథి.. తన కలం నుంచి ఓవైపు విప్లవాగ్నులను రగుల్చుతూనే, మరోవైపు అనువాద, ప్రణయ కవిత్వాలను, సినీ గీతాలను వెలువరించిన సవ్యసాచిగా అభివర్ణించారు.

డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి 'కెప్టెన్ చైర్'తో సత్కారం



సాక్షి, హైదరాబాద్: ఏఐజీ ఆసుపత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. యూకేకు చెందిన జాన్స్ హాప్కిన్స్ విశ్వవిద్యాలయానికి చెందిన 'కెప్టెన్ చైర్'ను డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి అందజేశారు. గ్యాస్ట్రోఎంటరాలజీ రంగంలో డాక్టర్ రెడ్డి విశేష సేవలకు గుర్తింపుగా ఈ సన్మానం చేశారు. ఆ యూనివర్సిటీకి చెందిన గ్యాస్ట్రోఎంటరాలజీ, హెపటాలజీ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ అన్నే మేరీ లెన్నాన్ ఆ కుర్చీని డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి ఆదివారం అందజేశారు. 1874లో జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వ్యవస్థాపక ప్రొఫెసర్ సర్ విలియం ఓస్లర్ కాలం నాటి ఈ కుర్చీ చారిత్రాత్మక ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. వైద్య విద్యలో కృషికి పేరుగాంచిన సర్ ఓస్లర్ కెప్టెన్ కుర్చీని అందించే సంప్రదాయాన్ని ప్రారంభించారు. ప్రపంచంలో వైద్య రంగంలో విశేష కృషి చేసిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులకు దీన్ని అందజేస్తారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ లెన్నాన్ మాట్లాడుతూ, గ్యాస్ట్రోఎంటరాలజీలో డాక్టర్ రెడ్డి మార్గదర్శకత్వాన్ని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ గుర్తించిందని చెప్పారు. కెప్టెన్ కుర్చీని అందజేయడం వైద్య పరిశోధన, విద్యకు ఆయన నిరంతర సేవలకు గుర్తింపు అని స్పష్టం చేశారు.

సికింద్రాబాద్‌లో నిషేధిత డ్రగ్స్ స్వాధీనం

డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: నిషేధిత డ్రగ్స్ విక్రయిస్తున్న ఓ మెడికల్ దుకాణంపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు ఆదివారం దాడులు నిర్వహించారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలోని జన్ ఔషధి కేంద్రంపై నిర్వహించిన సోదాల్లో నిషేధిత డ్రగ్ ఆఫ్లోక్సాసిన్ అండ్ ఆర్నిడాజోల్ సస్పెన్షన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్ర థానేలో లాక్–బీటా ఫార్మాస్యూటికల్‌లో ఈ మందులు తయారు చేసినట్టు గుర్తించామన్నారు. ఆఫ్లోక్సాసిన్ అండ్ ఆర్నిడాజోల్ సస్పెన్షన్ మానవ ఆరోగ్యంపై దుష్పరిణామాలు కల్గించడంతో 2018లో కేంద్ర ప్రభుత్వం ఈ డ్రగ్‌ను నిషేధిత మందుల జాబితాలో చేర్చింది. సదరు మందును తయారు చేయడం, నిల్వ చేయడం, విక్రయించడంపైనా నిషేధం కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత డ్రగ్స్ విక్రయించిన మెడికల్ దుకాణంపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డీజీ తెలిపారు. హానికరమైన డ్రగ్స్ విక్రయించడం తీవ్ర నేరమని, అలాంటి మందులను విక్రయించినా, సరఫరా చేసినా కఠిన చర్యలు తప్పవని కమలాసన్ రెడ్డి హెచ్చరించారు. నిషేధిత డ్రగ్స్‌పై సమాచారం ఉంటే ప్రజలు డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ టోల్‌ఫ్రీ నంబర్ 1800–599–6969లో ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

డబ్ల్యూహెచ్‌వో చెప్పినా.. పెడచెవిన..

రాష్ట్రంపై డెంగీ పంజా • ఈ ఏడాది ఇప్పటివరకు వెయ్యికి చేరువలో కేసులు

ఒక్క హైదరాబాద్‌లోనే 327 కేసులు నమోదు • ఖమ్మం జిల్లాలో 161 కేసుల నమోదుతో ఆందోళన

'ఈ సీజన్‌లో తెలంగాణకు డెంగీ ప్రమాదం పొంచి ఉంది. డెంగీ ప్రమాదం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ ఉండగా, డెంగీలోని నాలుగు ప్రధాన వేరియంట్లన్నీ ఇక్కడే కనిపిస్తున్నాయి. డీఈఎన్‌వీ1, డీఈఎన్‌వీ2, డీఈఎన్‌వీ3, డీఈఎన్‌వీ4 ప్రభావం ఎక్కువగా ఉంటుంది. కొన్నిసార్లు రెండు మూడు వేరియంట్లు కూడా ఒకేసారి రోగులపై దాడి చేసే ప్రమాదం పొంచి ఉంది.'

– రాష్ట్రానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలకు తగ్గట్టే రాష్ట్రంపై డెంగీ పంజా విసురుతోంది. గతేడాదితో పోలిస్తే ఇప్పుడు పెద్దఎత్తున కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని..ఆస్పత్రుల్లో అవసరమైన కిట్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పేర్కొంది. కానీ ప్రజారోగ్య సంచాలకుల విభాగం మాత్రం క్షేత్రస్థాయిలో సరైన చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోందన్న విమర్శలు ఉన్నాయి. గతేడాది మొదటి ఆరు నెలలతో పోలిస్తే..ఈ ఏడాది ఆరు నెలల్లో డెంగీ కేసులు అధికంగా నమోదైనట్టు వైద్యారోగ్యశాఖ నివేదిక పేర్కొంది

లక్షలాది మందికి జ్వరాలు.. ఆస్పత్రులు కిటకిట

రాష్ట్రంలో లక్షలాది మందికి జ్వరాలు సోకాయని వైద్యారోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ మేరకు తాజాగా ఒక నివేదికను ప్రభుత్వానికి పంపించింది. ఒక అంచనా ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 3 లక్షల మంది జ్వరాలతో బాధపడుతున్నారని ఒక వైద్యాధికారి వెల్లడించారు. దీంతో రాష్ట్రంలో జ్వరాలతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. మరోవైపు చికున్‌గున్యా కేసులు భారీగా నమోదయ్యాయి. చాలామంది రోగులు జ్వరంతో బాధపడుతూ ఒళ్లు నొప్పులు కూడా ఉంటున్నట్టు చెబుతున్నారు. కాగా, ఆస్పత్రుల్లో ఔట్ పేషెంట్లు పెరిగారు. హైదరాబాద్ ఫీవర్ ఆస్పత్రిలో సాధారణ రోజుల్లో 40 మంది వచ్చేవారు..కానీ ఇప్పుడు ఆ సంఖ్య వందకు పెరిగిందని డాక్టర్లు చెబుతున్నారు. గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు వెయ్యిచొప్పున ఓపీ ఉంటోంది.



రక్తస్రావం జరిగితే ప్రమాదకరం



డెంగీని ముందుగా గుర్తించితే 80 శాతం వరకు ఎటువంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చు. కానీ కొందరికి తీవ్రమైన రక్తస్రావం అవుతుంది. ముక్కు నుంచి కానీ, మలం ద్వారా గానీ, బ్రష్ చేసేప్పుడు పళ్ల మధ్య నుంచి రక్తస్రావం అవుతుంది. ఇలా అధికంగా రక్తస్రావం అయితేనే ప్రమాదకరం. మహిళలకు పీరియడ్స్ సమయంలో సాధారణ రక్తస్రావం కంటే అదనంగా అయ్యే అవకాశం ఉంటుంది. దాన్ని వారు గుర్తించాలి. అలాంటి సమయాల్లో ప్లేట్‌లెట్ల సంఖ్య 50 వేలున్నా సరే తప్పనిసరిగా ప్లేట్‌లెట్లు ఎక్కించాల్సి ఉంటుంది. రక్తస్రావం కానప్పుడు 20 వేల వరకు ప్లేట్‌లెట్లు పడిపోయినా ప్రమాదం కాదు. అప్పుడు ప్రత్యేకంగా ప్లేట్‌లెట్లు ఎక్కించి రోగిని సాధారణ స్థితికి తీసుకురావొచ్చు.

– డాక్టర్ కె.కృష్ణప్రభాకర్, హైదరాబాద్

డెంగీ కేసులు ఇలా.... (జనవరి టు జూన్)

	రాష్ట్రం	హైదరాబాద్	ఖమ్మం	మేడ్చల్	నల్లగొండ
గతేడాది	706	229	14	39	10
ఈ ఏడాది	964	327	161	103	30

పిడుగొస్తే.. ఏం చేయాలి?



ప్రతి సెకనుకు భూమిపై 50 నుంచి 100 పిడుగులు పడతాయట.

'వాన రాకడ.. ప్రాణం పోకడ తెలియవ'న్నది సామెత. కానీ దేశంలో ఏటా వేలాది మందిని బలిగొంటున్న పిడుగు పాటును మాత్రం ముందే గుర్తించేందుకు చాన్స్ ఉంటుంది. ఆకాశం మేఘావృతమై జల్లులు మొదలైతే.. ఉరుములు, మెరుపులు వస్తుంటే.. చాలా మంది ఏ చెట్టు కిందకో పరుగెడుతుంటారు. అంతేకాదు కారులో ఉంటే పిడుగు పడొచ్చనే భయంతో కిందకు దిగి కాస్త దూరంగా నిలబడుతూ ఉంటారు. కానీ ఇలా చేయకూడదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చిన్నచిన్న జాగ్రత్తలతో పిడుగు ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. ఇటీవల తెలంగాణలో రైతులు, చిన్నారులు సహా పదుల సంఖ్యలో పిడుగుపాటుతో ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవీ..

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక మేరకు 2022లో ప్రకృతి విపత్తుల కారణంగా మన దేశంలో 8,060 మరణాలు సంభవిస్తే.. అందులో 2,887 మరణాలకు పిడుగుపాటే కారణం.

పిడుగుపాటు బారిన పడకుండా..



'దామిని' ఉంటే తప్పించుకోవచ్చు!

పిడుగులకు సంబంధించి ముందుగానే హెచ్చరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'దామిని'అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మీరు ఉన్న ఏ ప్రాంతంలోనైనా తర్వాతి 15 నిమిషాల్లో పిడుగులు పడే అవకాశం ఉంటే ఈ యాప్ హెచ్చరిస్తుంది. పుణేకు చెందిన ఐఐటీఎం సంస్థ దీన్ని రూపొందించింది. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా.. మీరున్న చోటేకాదు చుట్టుపక్కల ఎక్కడెక్కడ పిడుగులు పడే అవకాశముందో చెప్తుంది. అంతేకాదు.. గత 15 నిమిషాల్లో ఎక్కడైనా పిడుగుపడితే ఆ సమాచారం కూడా దీనిలో లభిస్తుంది. పిడుగుల విషయంలో ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్న విషయాన్ని కూడా చెప్తుంది. పిడుగుపాటును ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసే పరిజ్ఞానం ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ దగ్గర కూడా ఉంది.

– సాక్షి సెంట్రల్ డెస్క్

రీల్స్ మోజులో ప్రాణం పోయింది

బైక్ అదుపుతప్పి యువకుడి దుర్మరణం

లింగోజిగూడ/వర్ధన్నపేట: ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ కోసం బైక్‌పై చేసిన స్టంట్ అదుపుతప్పి ఒక యువకుడు ప్రాణాలు కోల్పోగా, మరో యువకుడు ఆసుపత్రి పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ శివారు కోనాపురానికి చెందిన మేడ రాజు, మహబూబీ దంపతులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వలస వచ్చారు. ఎల్‌బీనగర్ సెంట్రల్ బ్యాంక్ కాలనీలో నివాసముంటున్నారు. మేడ రాజు కుమారుడు శివ (19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం తన స్నేహితులు సంపత్, పవన్, విజయ్‌తో కలిసి బైక్‌లపై ఎల్‌బీనగర్ పెద్దఅంబర్‌పేట వైపు బయల్దేరారు. కేటీయం బైక్ ను శివ నడుపుతుండగా సంపత్ వెనుక కూర్చున్నాడు. శివ తన బైక్‌తో రీల్స్ కోసం స్టంట్లు చేస్తుండగా, మరో బైక్‌పై ఉన్న పవన్, విజయ్‌లు వీడియో తీస్తున్నారు. హయత్‌నగర్ లక్ష్మారెడ్డిపాలెం వద్ద శివ నడుపుతున్న బైక్.. స్కూటర్‌ను ఢీ కొట్టడంతో అదుపుతప్పి కిందపడ్డారు. శివ, సంపత్‌లకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే స్థానికంగా ఉన్న ఆసుపత్రికి తరలించారు. శివ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. తీవ్రగాయాలతో సంపత్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శివ మృతదేహాన్ని ఆదివారం రాత్రి స్వగ్రామం కోనాపురానికి తరలించారు. హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారిపై స్టంట్‌లు చేస్తున్న యువకులు



రమణీయం 'రాయికల్'

సైదాపూర్(హుజూరాబాద్): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం రాయికల్ జలపాతం కనువిందు చేస్తోంది. ఆదివారం వేకువజాము నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆకునూర్, పెరుకపల్లి గ్రామాల సరిహద్దుల్లోని నీలగిరి గొలుసుకట్టు గుట్టల నుంచి ఈ జలపాతం జాలువారుతోంది. దీంతో జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది.

ఉధృతంగా రాయికల్ జలపాతం

వీధి కుక్కల బెడదపై నేడు సీఎం సమీక్ష

సచివాలయంలో జంతు పరిరక్షణ సంస్థలతో చర్చ



సాక్షి, హైదరాబాద్: ఇటీవల హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కలు కాటు వేయడంపై హైకోర్టు సుమోటోగా విచారణ జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీకి పలు సూచనలు చేసింది. ఈ నేపథ్యంలో కుక్కల సమస్యపై హైకోర్టు సూచనల మేరకు సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. వివిధ జంతు పరిరక్షణ సంఘాలతో సమావేశమై, వీధి కుక్కల బెడద తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలని యానిమల్ బర్త్ కంట్రోల్ ఇంప్లిమెంటేషన్, మానిటరింగ్ కమిటీని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ సమావేశానికి వెటర్నరీ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ కె.సతీశ్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ లగాన్ మోహన్‌రెడ్డి, యానిమల్ వెల్ఫేర్ సంస్థల తరఫున అమల అక్కినేని, వాసంతి వడి, న్యాయవాదులు శ్రేయ పరోపకారి, వేణు మాధవ్, ఐపీఎం రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ సంపత్, ఆరోగ్య శాఖ అధికారులు హాజరు కానున్నారని జీహెచ్ఎంసీ కమిషనర్ పేర్కొన్నారు.

ఫిజిక్స్ టీచర్లను మ్యాథ్స్ చెప్పాలనడం సరికాదు

- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- తదుపరి విచారణ 23కు వాయిదా

సాక్షి, నల్లగొండ: భౌతికశాస్త్ర స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులకు గణిత బోధన తప్పనిసరి కాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు స్పష్టం చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు వారిని గణితం బోధించాలని ఒత్తిడి చేయవద్దని సర్కార్‌ను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. భౌతికశాస్త్రం స్కూల్ అసిస్టెంట్లు.. 6, 7 తరగతులకు గణితం సబ్జెక్టును బోధించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏప్రిల్‌లో మెమోను జారీ చేసింది. దీనిపై నల్లగొండ, భువనగిరి జిల్లాలకు చెందిన 19 మంది ఉపాధ్యాయులు విద్యాశాఖ సెక్రెటరీ, డైరెక్టర్‌ను కలసి గణితం తమ సబ్జెక్టు కాదని, ఈ విషయాన్ని పరిశీలించి భౌతికశాస్త్రం మాత్రమే బోధించే విధంగా చూడాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులకు సబ్జెక్టు పరంగా అన్యాయం జరుగుతుందని, ఉపాధ్యాయులు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తుందని.. ప్రభుత్వం మెమోను ఉపసంహరించుకోవాలని విన్నవించారు. అయినా అధికారులు పట్టించుకోకపోవటంతో నల్లగొండ జిల్లా ఉరుమడ్ల జెడ్పీహెచ్ఎస్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ. నాగయ్య, మరో 18 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. గణితం ఉపాధ్యాయులు లేని చోట్ల ఆ సబ్జెక్టును బోధించమనడంలో తప్పులేదని, కానీ.. ఎలాంటి అనుభవం లేని తమపై ఒత్తిడి తేవడం సరికాదని వారు విన్నవించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ విచారణ చేపట్టి, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఈ అంశంపై ప్రభుత్వ న్యాయవాది సమయం కోరడంతో తదుపరి విచారణను కోర్టు ఈ నెల 23కు వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాలపై జిల్లాలోని భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద ప్లకార్డులతో చిన్నారులు..

రేవంత్ అంకుల్.. మా ప్రాణాలకు రక్షణ ఏదీ?

వీధికుక్కల బెడదపై చిన్నారుల వినూత్న నిరసన

కుత్బుల్లాపూర్: వీధి కుక్కల బెడదపై ఆదివారం కొంపల్లి ఎన్‌సీఎల్ కాలనీకి చెందిన చిన్నారులు వినూత్న తరహాలో నిరసన తెలిపారు. 'రేవంత్ అంకుల్..మా ప్రాణాలకు రక్షణ ఏదీ?' అంటూ ఆదివారం ప్లకార్డులు చేతబూని పెద్ద సంఖ్యలో చిన్నారులు పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వద్దకు చేరుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్‌సీఎస్ నార్త్ కాలనీలో వీధి కుక్కల దాడుల్లో గత ఆరు నెలల వ్యవధిలో సుమారు 70 మంది చిన్నారులు గాయపడ్డారు. ఈ విషయమై పలుమార్లు కొంపల్లి మున్సిపల్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసినా సరిగ్గా స్పందించలేదు. దీంతో అధికారుల తీరును నిరసిస్తూ కాలనీకి చెందిన చిన్నారులు ప్లకార్డులతో నిరసన చెప్పారు. కొంపల్లి మున్సిపల్ కమిషనర్ హరికృష్ణపై సీఐ విజయవర్ధన్‌కు ఫిర్యాదు చేశారు. చిన్నారుల ఫిర్యాదు మేరకు జీడీ నమోదు చేశామని, డీసీపీ దృష్టికి తీసుకెళ్లి తదుపరి చర్యలు చేపడతామన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.